ప్రపంచ తెలుగుమహాసభ ప్రచురణ

# సాహిత్య భాషగా తెలుగు


రచయిత:

ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం



494.813
LAK
459
ROP



ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి

కళాభవన్, సైఫాబాద్

హైదరాబాద్-500004

ప్రథమ ముద్రణ :
1975, ఏప్రిల్
ప్రతులు : 2000

494.813
LAK

మూల్యం : **2-50**

Acc No. 6221

ముద్రణ :
నాగార్జున ప్రింటింగ్ వర్క్స్,
ముషీరాబాద్, హైదరాబాద్-20

# ముందుమాట

ఎన్నో ఏళ్ళుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వ సమయం ఆసన్నమవుతున్నది. ప్రపంచంలోని తెలుగువారి ప్రతినిధులందరిని ఒక చోట సమీకరించవలసిన పెద్దలందరూ కన్నకలలు ఫలిస్తున్న శుభసమయమిది రాబోయే ఉగాది రెండువేల అయిదువందల సంవత్సరాల తెలుగుజాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టము కాగలదు

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దికి చెందిన శాతవాహనరాజుల కాలంనుండి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారతదేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదుకోట్లకుపైగా ఉన్నారు హిందీ మాట్లాడేవారి తరువాత స్థానం తెలుగువారిదే బౌద్ధ పూర్వయుగంనుంచి ఇటీవల బ్రిటిష్ సామ్రాజ్య పరిపాలనాయుగం వరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచ నలుమూలలకూ వలసవెళ్ళడం జరిగింది. అట్లావెళ్ళిన తెలుగువారు తమ భాషా సంస్కృతీ సంప్రదాయాలను ఆయా జాతీయ జీవన విధానాలతో మేళవించి, వాటిని సంపన్నం చేస్తూ ఉన్నారు

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధానలక్ష్యం తెలుగుప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదికమీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషినిగూర్చి చర్చించి, నిర్ణయించుకోవడానికీ, తద్వారా వివిధ చైతన్యస్రవంతులను ఏకోన్ముఖంచేసి మన సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేసుకోవడానికి ఈ మహాసభలు దోహదకారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు అర్థవంతమైన భావ సమైక్యతకు ప్రాతిపదికలై తెలుగుజాతిని సమైక్యం చేయగలవనీ, ఆ విధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవనీ విశ్వశిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12వ తేదీన తెలుగు ఉగాది రోజున ప్రారంభమై ఒక వారం రోజులపాటు జరిగే ఈ మహా సభలలో వివిధ దేశాలనుంచీ, వివిధ రాష్ట్రాలనుంచీ, యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థలనుంచీ వచ్చిన ప్రముఖులు ప్రతినిధులుగానో, పరిశీలకులుగానో పాల్గొంటారు. ఈ మహాసభల సమయంలో చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ దేశాలలోని తెలుగు

వారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల కళల అభివృద్ధి, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలయిన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాలనుంచి ప్రస్ఫుటంచేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రహాలయాన్ని "మ్యూజియంను" స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజభూతమవుతుంది. తెలుగువారి సంస్కృతిని నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజులపాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలను విశదంచేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజలు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘన విజయాలను విశదంచేసే గ్రంథాలు అనేకం ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి. ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయితలందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకువచ్చిన అకాడమీ అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగువారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయులందరి ఆదరణ పొందగలవని విశ్వశిస్తున్నాను. అయితే, ఇంతమాత్రంచేతనే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడం లేదు. చేయవలసినది ఇంకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న "అంతర్జాతీయ తెలుగు విజ్ఞానసంస్థ" మహాసభల ఆశయ సాధనకు పూనుకొనడమే కాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

**జలగం వెంగళరావు**
అధ్యక్షులు
ప్రపంచ తెలుగు మహాసభలు.

# పరిచయము

సహస్రాబ్దాలుగా ప్రవర్ధమానమగుచున్న తెలుగు సంస్కృతిని తెలుగుదేశపు నలుచెరగుల పరిచితము చేయు సంకల్పముతో 1975వ సంవత్సరమును తెలుగు సాంస్కృతిక సంవత్సరముగ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ప్రకటించినది అందుకు అనుగుణమైన కార్యక్రమాలను నిర్వహింపజేయుటయే గాక, ప్రపంచములోని వివిధ దేశాలలో వసించుచున్న తెలుగువారి సాంస్కృతిక ప్రతినిధులందరును ఒకచోట సమావేశమగు వసతిని కల్పించుటకై "1975, ఏప్రిల్ 12 (తెలుగు ఉగాది) మొదలుగ ప్రపంచ తెలుగు మహాసభ హైదరాబాద్‌న జరుగునటుల ప్రభుత్వము నిర్ణయించినది. అందుకు ఒక ఆహ్వానసంఘము ఏర్పాటయినది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్యమంత్రి మాన్యశ్రీ జలగం వెంగళరావుగారు ఆ సంఘమునకు అధ్యక్షులు. విద్యాశాఖా మంత్రి మాన్యశ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు దాని కార్య నిర్వాహకాధ్యక్షులు. ఆర్థిక మంత్రి మాన్యశ్రీ పిడతల రంగారెడ్డిగారు ఆర్థిక, సంస్థా కార్యక్రమాల సమన్వయ సంఘాల అధ్యక్షులు.

ఆ సంఘము, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున వచ్చువారికి తెలుగు జాతి సాంస్కృతిక వైభవమును తెలియజేయుటకు అనువుగ ఆంధ్ర భాషా సాహిత్య, కళా చరిత్రాదికములను గురించి ఉత్తమములు, ప్రామాణికములునగు కొన్ని లఘు గ్రంథములను ప్రకటించవలెనని సంకల్పించి, ఆ కార్యనిర్వహణకై 44 మంది సభ్యులు కల ఒక విద్వత్ సంఘమును, శ్రీ నూకల నరోత్తమ రెడ్డిగారి అధ్యక్షతన నియమించినది. ఆ విద్వత్ సంఘమును ఆ లఘు గ్రంథముల వస్తువుల నిర్దేశించి వాని రచనకై ఆయా రంగములందు పేరుగనిన ప్రముఖులను రచయితలుగ ఎన్నుకొనినది. ఈ విధముగ సిద్ధమైన గ్రంథములలో భాషా, సాహిత్య, చారిత్రక విషయములకు సంబంధించిన వానిని ప్రకటించు బాధ్యతను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వహింప వలసినదిగా ప్రపంచ తెలుగు మహాసభా కార్యనిర్వాహకాధ్యక్షులు మాన్యశ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు అకాడమీని కోరిరి. మహాసభా సఫలత కొరకై కృషిచేయు సంకల్పముతో ఈ బాధ్యతను వహించుటకు అకాడమీ సంతోషముతో అంగీకరించినది.

ఆ విధముగ ప్రకటింపబడిన గ్రంథశ్రేణిలో **ఈ సాహిత్య భాషగా తెలుగు**ను, రచించిన డాక్టర్ సి నారాయణరెడ్డి గారు ఆంధ్ర పాఠక లోకమునకు సుపరిచితులు. వారికి మేము కృతజ్ఞతా బద్ధులము. గ్రంథమును నిర్దుష్టముగ. చక్కగా ముద్రించిన నాగార్జునా ప్రింటింగ్ వర్క్స్ వారికి మా కృతజ్ఞతలు.

**దేవులపల్లి రామానుజరావు**
కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

హైదరాబాద్
తేదీ॥ 30-3-1975

# సాహిత్య భాషగా తెలుగు

పూర్వ యుగాల్లో సాహిత్య ప్రయోజనాలకూ లౌకిక ప్రయోజనాలకూ వాడబడే భాషలు స్ఫుటమైన భేదం కలిగి ఉండేవి. ఇరవయ్యో శతాబ్దంలో సాహిత్యకుల దృష్టిపథం మారింది. కావ్య భాష కూడా నిత్య వ్యవహారంలో ఉండే భాష లాగే ఉండాలనే భావము ఇప్పుడు దృఢపడుతూంది. ఇటువంటి ఉద్దేశం పందొమ్మిదవ శతాబ్ది చివర భాగంలోనే సాహిత్య చింతకులలో తలయెత్తింది. దానిపై పెక్కు వివాదాలు చెలరేగాయి. క్రమంగా శిష్ట వ్యావహారికమే సాహిత్య భాషగా స్థానం పొందాలని చాలామంది రచయితలు భావింపజొచ్చారు. పూర్వయుగాల్లో దీనికి భిన్నంగా భావించేవారు. వారి ఆలోచనా పరంపర ఇట్లా ఉండేది. "సాహిత్యమనగా రసప్రపంచము. రసము పరబ్రహ్మ స్వరూపము. రసో వైసః అని ఉపనిషత్తు చెప్పుతూంది. బ్రహ్మ స్వరూపమైన రసాన్ని ప్రస్తరించే సాహిత్య భాష, ప్రతిపాద్యమైన వస్తువు ఔత్కృష్ట్యాన్ని బట్టి కేవల లౌకిక వ్యవహారము ప్రయోజనముగా గల భాష కంటె కొంత భిన్నమై, విలక్షణమై, ఉదాత్తమైనదిగా ఉండాలి" ఇది ప్రాచీనుల దృష్టిపథము ఆధునికులైనా దీనిని బొత్తిగా కాదనడం లేదు. విపణి వీథిలో కొనుగోళ్ళకు అమ్మకాలకూ వాడే భాషకాని, విశృంఖలంగా మాట్లాడేటప్పుడు ప్రయోగించే పద స్వరూపాన్ని కాని, పద జాలాన్ని కాని యథాతథంగా సాహిత్యంలో వాడవచ్చునని నేటి కాలపు సాహిత్యకులు కూడా అనడం లేదు. అందుచేతనే కావ్యాల్లో వాడే భాష 'శిష్టవ్యావహారికం'గా ఉండాలని వారు కూడా అంటున్నారు. పూర్వులకూ వీరికీ భేదం ఎక్కడ అంటే వ్యవహారంలో ఉండే పదజాలాన్నీ, పదస్వరూపాన్నీ సాహిత్యంలో సుతరామూ వాడ కూడదని వారు నియమం పెట్టుకోలేదు. అయితే ప్రాచీనులు మాత్రం ఇటువంటి ప్రతిషేధం పెట్టుకున్నారా? పెట్టుకుంటే వారి రచనలు లోకానికి ఎట్లు ఉపాదేయము లయ్యేడివి. వారు రచించిన పురాణాలను, కావ్యాలనూ లోకం ఎట్లా గ్రహించేది? ఎట్లా ఆస్వాదించేది? లోకంతో మాకు పనిలేదు. మా ఇష్టము వచ్చినట్లు మేము వ్రాసుకుంటాము. లోకులకు అర్థం అయినా అవక పోయినా వారు ఆస్వాదించినా ఆస్వాదించక పోయినా, మా త్రోవ మాది, అనే ధోరణిలో ప్రాచీనులు కావ్యజాలం

సృష్టించారనే వాదన ఎంత మాత్రమూ గ్రాహ్యమైనది కాదు. అట్లా తలపోయడం ప్రాచీనులకు మహాపచారం చెయ్యడమే అవుతుంది. ఎందుకంటే పూర్వమహాకవు లెవరు చెప్పినా లోక ప్రయోజనం కోసం. జగద్ధితం కోసం కావ్యం వ్రాస్తున్నామన్నారే కాని స్వాత్మానందం కోసం, లోకాన్ని నిర్లక్ష్యం చేసి కావ్యరచన చేస్తున్నామని ఎక్కడా ఎవరూ అనలేదు. భవభూతి వంటి మహాకవి ఏదో ఒక సందర్భంలో సమకాలికుల దుర్విమర్శలకు చిరాకుపడి ఈ లోకంతో నాకేమిపని అని ఘూర్ణిల్లి యుండవచ్చును.

"యేనామకేచి దిహనః ప్రథయంత్యవజ్ఞామ్‌।
జానంతితే కిమపి, తాన్ప్రతి నైషయత్నః।
ఉత్పత్స్యతే మమతు కోపి సమానధర్మా।
కాలోహ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ॥"

'మా యొక్క అజ్ఞతను ప్రకటించడానికి కొందరు పూనుకో వచ్చును. అయితే వారికిమాత్రం ఏమి అధికంగా తెలుసును ? నా యీ ప్రయత్నము వారి నుద్దేశించినది కాదు. నాతో సమానమైన భావాలూ చిత్తవృత్తీ కలవ్యక్తి భవిష్యత్తులో జన్మించక పోవదు. కాలము అనంతమైనది. ఈ పృథ్వీమండలం విస్తారమైనది.' సమాన ధర్మం కలవారినిగూర్చి ఈ నాటకరచన చెయ్యబడుతూందని ఈషత్క్రోపంతో కవి పలికాడు. అంతమాత్రంచేత భవభూతి లోకాన్ని నిర్లక్ష్యం చేసి తనకు ఇష్టంవచ్చినట్లు సాహిత్య సృష్టి చేశాడని అనవచ్చునా? కవి కూడా మానవ మాత్రుడే. అతనికీ రాగద్వేషాలు ఉన్నాయి. ఆశానిరాశలు ఉంటాయి అని సరిపుచ్చుకోవాలి. విపరీతభాష్యాలు చెయ్యడం న్యాయం కాదు.

తెలుగు కవీంద్రుడైన చేమకూర వెంకటకవి కూడా సమకాలికుల విమర్శకులకు ఇట్లాగే నొచ్చుకున్నాడు. 'ఏగతి రచియించిరేని సమకాలమువారలు మెచ్చరే గదా అని బాధ ప్రకటించాడు. ఇంతమాత్రంచేత చేమకూర వెంకటకవి లోకాన్ని నిర్లక్ష్యం చేసి వ్రాశాడ'ని అనడం ధర్మమవుతుందా. శ్రీనాథమహాకవి శృంగార నైషధంలో అన్నాడు.

"పనివడి నారికేళ ఫలపాకమునం జవియైన భట్టహ
ర్షుని కవితానిగుంభములు సోమరిపోతులు కొందఱయ్యలో
నని కొనియాడనేర రదియట్టిద లేజవరాలు చెక్కుమీ
టిన వసవల్చు బాలకుఁడు డెందమునం గలగంగ నేర్చునే॥"

దీనినిబట్టి తన ప్రౌఢ కవిత్వాన్ని మెచ్చలేనివారిని శ్రీనాథుడు సోమరిపోతులు. వసవల్చు బాలకులు అని ఈసడించినాడని విమర్శించడం న్యాయమా? ఏసందర్భంలో మహాకవి ఈ యుపమానం ప్రయోగించాడో సావధానంగా పరిశీలించాలి. అసలీభావం శ్రీహర్షనైషధంలోనే ఉంది. శ్రీనాథుడు అనువాదం మాత్రమే చేశాడు. అయినా శ్రీనాథుడు తక్కువతిన్నవాడేమీ కాదు. ఆగ్రహంవస్తే ప్రత్యర్థులైన పండితుల్ని విదలించేవాడే. రాజమహేంద్రవర పండితుల్ని గూర్చి భీమేశ్వర పురాణంలో అంటాడు.

> "బోధమల్పంబు గర్వమభ్యున్నతంబు
> శాంతి నిష్పచ్చరంబు మచ్చరము ఘనము
> కూప మండూకములవోలె కొంచెమెఱిగి
> పండితమ్మన్యులైన వైతండికులకు,"

అందుచేత ఆయా కవులు ఈషత్కోపావిష్టులై చెప్పిన మాటలను గాక వారు సావధాన చిత్తంతో ప్రకటించిన భావాన్నే వారి హృదయావిష్కారణానికి మూలంగా గ్రహించాలి.

మొత్తంమీద ప్రాచీనులు సాహిత్య భాషకూ వ్యవహారంలోని భాషకూ కొంత అంతరం ఉండాలని నమ్మినవారే. ఆ యంతరము ఎంత దూరమైనది, ఎంత గహనమైనది అనే విషయంలోనే అభిప్రాయ భేదాలకు అవకాశం కలిగింది. సాహిత్యభాషకూ జన వ్యవహార భాషకూ మధ్య ఉండే వ్యవధానం ఉండీఉండనట్లు ఉండాలని తలపోశారు నన్నయ తిక్కనాది మహాకవులు. అది ఇంకా కొంచెం గభీరంగా ఉండాలంటారు నాచన సోమన శ్రీనాథాదులు. జానుతెనుగే కావ్యభాషగా ఉండాలంటారు పాల్కురికి సోమనాథాదులు. ఆ యంతరం గహనంగా, పెద్ద అఖాతంగా కూడా ఉండవచ్చును అనుకొన్నారు ప్రబంధ కవులు. ఈ యవాంతరం బొత్తిగా ఉండకూడదంటారు ఆధునికులు. వారు వారు భావించిన దానికి ఆచరణలో అనుష్ఠించిన దానికీ వ్యత్యాసాలు కనబడుతూంటాయి. ఎందుచేతనంటే ఒక లక్ష్యాన్ని పెట్టుకోవడం వేరు. ఒక మహా కావ్యంలో ఆద్యంతమూ దానిని అమలు పెట్టడం వేరు. ఏటికి అడ్డం పడిన గజీతగాడు ఒక్కటే ఈత పద్ధతిని పాటించాలనే నియమం ఏమి ఉంది. ఉన్నా కాని అది ఆచరణ సాధ్యమా. ఒకప్పుడతడు బారీత ఈదుతాడు. ఒకప్పుడు కుక్కవలె నిలువీత ఈదుతాడు. ఒకప్పుడు తెడ్డీత ఈదుతాడు. మరీ ఆయాసం వస్తే వెల్లకిలబడి తోసుకు పోతాడు. అవతలి ఒడ్డు చేరడమే పరమ లక్ష్యంకాని మిగిలిన చిన్న

చిన్న నియమాలు మహాజలరాశి తరణంలో లెక్కకు రావు ఒక చిన్న కావ్యమో ఖండికయో అయితే చిన్న చిన్న నియమాలు పెట్టుకొని కొంత సంయమనం పాటించ వచ్చును. కవి దృష్టి దీనిమీదనే నిబద్ధమై ఉంటుంది గనుక. ఇదే అష్టాదశ పర్వ నిర్వహణ సంభృతమైన మహా రచన అయితే చిన్న చిన్న నియమాలుసాధ్యమూకావు; ఆవశ్యకమూ కావు. అందుచేతనే నన్నయ భట్టారకుడన్నాడు:

"బుద్ధి బాహు విక్రమమున దుర్గమార్థ జల
గౌరవ భారత భారతీ సముద్రము దరియంగ
నీదను విధాతృనికైనను నేరబోలునే".

మహారచన చేసేటప్పుడు మరొక జటిల సమస్య తలయెత్తుతూంది. మహా కావ్య రచనకు కావలసిన ముడి సరుకు అంటే పదజాలం అంతా, నిత్య వ్యవహారంలో ఉన్నదా? లేదు. తెలుగులో ఇంకా తక్కువ. దీనికి చారిత్రక కారణాలు ఉన్నాయనుకోండి. మన పూర్వ కవులు తెలుగును పెరగనివ్వవలసినంతగా స్వతంత్రంగా పెరగనిచ్చినట్లు లేదు. వారు విస్తారంగా సంస్కృతాభిమానం కలవారవడంచేత అపారంగా లభిస్తూన్న గీర్వాణ పదజాలాన్ని తెలుగులోకి దిగుమతి చేసుకొని తత్సమ భాషాభిముఖంగా పయనించారు. నన్నయచాడో, అంతకు పూర్వమో, శివకవుల జానుతెనుగు ఉద్యమం తలయెత్తి ఉంటే తెలుగు సాహిత్య భాషా స్వరూపం మరొక విధంగా ఉండియుండ వచ్చును. బహుశా తమిళం లాగే మన భాష కూడా విస్తారంగా తన కాళ్ళ మీద తాను నిలబడ కలిగియుండును. సంస్కృత సహాయం లేకుండా వర్ధిల్లియుండును. కాని అట్లా జరుగలేదు. జాను తెనుగు అను పేరుతో సంస్కృత భూయిష్టం కాని దేశ భాషను వ్రాయాలని ఉద్దేశించిన శివకవులు కూడా సంస్కృత ప్రాబల్యాన్ని త్రోసిరాజు అనలేక పోయారు. వారు కూడా సంస్కృత బాహుళ్యాన్ని నిరసిస్తూనే దీర్ఘ సమాస భూయిష్ఠమైన శైలిని తమ కావ్యాల్లో ఆదరించారు. భాషా విప్లవవాదియైన పాల్కురికి సోమనాథుడు గీర్వాణ భాషా శృంఖలాన్ని వదిలించుకోలేక పోయాడు. అనగా ఆతని కాలానికే తెలుగు భాషమీద సంస్కృత ప్రభావం స్థిరపడి పోయిందని విశదమవుతూంది. ముందు ముందు దీనిని యింకా చర్చిద్దాం.

## సాహిత్యం - ముఖ్యరాసులు

సాహిత్యభాష విషయంలో మూడు ముఖ్య ద్రవ్యాల్ని పరిగణించాలి.

1. కవి, అతని చిత్తవృత్తి.

2 వస్తువు, దానికి ప్రాణమైన రసము

3. సహృదయుడు లేక పాఠకుడు.

మూఢపరాశియైన సహృదయుడు సాహిత్యభాషను రూపొందించడంలో ప్రత్యక్ష పాత్ర వహించకపోయినా పాఠకదృష్టిగల రచన ఒకవిధంగాను, అతణ్ణి ఉపేక్షించిన రచన మరొకవిధంగాను ఉండడానికి అవకాశముంది కావున పాఠకుణ్ణి సాహిత్యభాషా నిర్మాణంలో తటస్థద్రవ్యంగా గ్రహించవచ్చును. ప్రధానద్రవ్యాలైన కవి - వస్తుద్వయాన్ని కొంత తరచిచూద్దాము. 'అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః । యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే' అన్న ప్రాచీన భాషణను నిరాకరింపరానిది. కావ్యప్రపంచంలో కవియే ప్రజాపతి. అతనికి రుచించినట్లే అది రూపుదిద్దుకొంటుంది. కవి తన వ్యక్తిత్వాన్ని అధఃకరించుకొని సామాజికదృష్టిలో వ్రాయాలని ఆధునికులు భావిస్తారు. కాని ఇది కొంతవరకే సాధ్యం అని చెప్పాలి. కవివ్యక్తిత్వంలేని కావ్యము చంద్రుడు లేని ఆకాశంలా ఉంటుంది. కావ్యానికి ఆలంకారికులు చెప్పిన పెక్కు ప్రయోజనాల్లో 'సద్యఃపర నిర్వృతి; కాంతా సమ్మితమైన ఉపదేశము' అను రెండును ముఖ్యతమమైనవని అన్నికాలాల్లోను, అన్ని దేశాల్లోను బహుసంఖ్యాకులు ఒప్పుకొంటున్నారు. సద్యఃపరనిర్వృతి - అనగా తత్కాలమునందే అపూర్వానందము ఇవ్వగల సాహిత్య లక్షణము. అయితే ఈ పరనిర్వృతి కవికి సంబంధించినదా, సహృదయునకు సంబంధించినదా అనే విచికిత్స రావచ్చును. ఈ పరనిర్వృతి కవి - సహృదయులకు ఉభయులకు సంబంధించినదనే చెప్పాలి. కవిలో పూతభావజన్యమైన నిర్వైతుకానందము లేకపోతే అతడు తన రచనయందు దాన్ని ఎట్లా నిక్షేపిస్తాడు. సహృదయునిలో దాన్ని ఎట్లు ఉద్బుద్ధము చేయగలుగుతాడు. కారణములేని కార్యము ఉండదు గదా, అయితే ఈ ఆనందానుభూతిని ఇతరులతో అనగా పాఠకులతో పంచుకోవాలనే సత్వవృత్తి కవియందు ఉండకపోతే ఆ కావ్యం లోకహితాన్ని సాధించలేదు.

కవియొక్క చిత్తవృత్తిని బట్టి కావ్యశైలి లేక భాష మారుతుంది. సాత్వికుడైన కవి సాత్వికుడైన బాటసారివంటివాడు; సత్వస్వభావం కల బాటసారి తాను నిష్కంటకమైన ఋజుమార్గమున ప్రయాణించడమేకాకుండా తోటిప్రయాణీకుల్ని నిష్ప్రమాదమైన మార్గాన్ని తీసుకుపోతాడు. రాజసుడైన కవి రాజసుడైన బాటసారివంటివాడు. రాజసుడైన బాటసారి తాను ఋజుమార్గమున ప్రయాణిస్తాడు. కాని తోటిబాటసారుల్ని తనతో తీసుకుపోయే బాధ్యత వహించడు. వారు తనవెంట రాగలరనో, రావాలనో

భావించి తనయిచ్చవచ్చినట్లు ప్రయాణిస్తాడు. వేదాంతపరిభాషలో చెప్పాలంటే సాత్విక కవి తల్లిమార్జాలమువంటివాడు. మార్జాలము తన పిల్లల్ని వాటి ప్రయత్నాలకు విడిచి పెట్టక నోట కరుచుకొని వెడుతుంది. సాత్వికకవి సహృదయుని లేక పాఠకుని తన వెంట తీసుకొనిపోయేదృష్టి పెట్టుకుంటాడు. రాజసకవి, తల్లి మర్కటము వంటివాడు. కోతిపిల్లలు తల్లికడుపు నంటిపెట్టుకొని తల్లితో ప్రయాణంచేస్తాయి. తల్లి వాటిని నోట కరచుకొని వెళ్ళదు. రాజసకవి సహృదయుడు లేక పాఠకుడు తనవెంటనంటి రావలె ననే దృష్టి పెట్టుకుంటాడు. రాజసకవి తన భావవైహాయస గమనాన్ని గమనించు కుంటూ పాండిత్య శిఖరాగ్రాలకు తనతోపాటు పాఠకుడూ ఎక్కిరావాలంటాడు. ప్రాచీన కవులు నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రెగడ, బమ్మెర పోతన, అల్లసాని పెద్దన వంటివారు సాత్వికకవుల కోవలోకి వస్తారని స్థూలంగా భావిద్దాము. పాల్కురికి సోమన, నాచన సోమన, శ్రీనాథుడు, రామరాజభూషణుడు, తెనాలి రామకృష్ణుడు వంటివారు రాజసకవులని స్థూలంగా భావిద్దాము. వారి గుణ విశేషాన్నిబట్టి వారి వారి శైలి భిన్నంగా ఉంటుంది. భాష ఆ శైలిని అనుసరించే ప్రవహిస్తుంది. అందుచేత సాహిత్యభాషలో సాత్విక రాజస భేదం మనము గుర్తుపెట్టుకోవచ్చును.

కావ్యవస్తువునిబట్టికూడా భాష భేదించవలసివస్తుంది. విస్తృతమైన వస్తువిన్యాసం కల కావ్యంలో పరిమిత శబ్దజాలంతో నడక సాగదు. నడక కుంటువడి పునరుక్తిదోషం రావడమో, లేక భావమంతా అక్లిష్టంగా రేకులువిప్పిన కమలంలా అందాలు ఈనక ముకుళితప్రాయమై ఉండిపోవడమో జరుగుతుంది. ఉత్తమ కవిత్వంలో కొంత తెరచాటు తప్పదు. భావాన్నంతటినీ వాచ్యంచెయ్యడం కవితాశోభకు న్యూనత అని తజ్ఞులు భావిస్తారు. అందుకోసమే ధ్వనిప్రస్థానం సాహిత్యంలో కుదురుకొన్నది. కొందరు కవులు తాము ఉద్దేశించిన భావాన్నంతనీ చక్కగా వ్యక్తీకరింపలేక తాము చెప్పజాలక విడిచినది ధ్వన్యర్థము అని సమర్థించుకుంటారు. కాని ఇది గ్రాహ్యముకాదు. పదార్థములు అన్వయించిన తరువాత వాక్యార్థ సౌందర్యంకోసం చెప్పగలిగిన విశేషార్థం ధ్వన్యర్థం అనిపించుకొంటుంది. కాని అర్థమేకాని పద్యంలో ధ్వన్యర్థం చూసుకొనుము అనడం కుందేటికొమ్ముకోసం వెతకడం వంటిది. వస్తువైఫల్యాన్నిబట్టి భాషావైఫల్యం ఉండ వలసివస్తుంది. లేకపోతే రచనావైవిధ్యం ఉండదు. రచనయందు వైవిధ్యం లేకపోతే అది నిస్సారంగా ఉంటుంది. అయితే రచనావైవిధ్యం సాధించడంలో ఛందస్సుకు చాలా ప్రాధాన్యం ఉంది. చందోవైవిధ్యంచేత వస్తువు అప్పటికప్పటికి నూతనత్వ మాపాదించుకొంటుంది; కవిత్వము శ్రవణయోగ్యంగాను, పఠనయోగ్యంగాను ఉంటుంది.

ఈ రహస్యం కనిపెట్టేకాబోలు నన్నయాదులు తమ దీర్ఘతమ రచనల్లో చంపూశైలినే కాక ఛందోవైపుల్యాన్ని కూడా పాటించారు. పాల్కురికి సోమనాథుడు ఇంచుమించు అంత దీర్ఘ రచనలుచేస్తూ ఏకైక ఛందస్సును అనగా ద్విపదను ఆద్యంతం నిర్వహించాడు. దేశిచ్ఛందోగౌరవంచేత మనం దానిని పరిగ్రహించినా మనసార ఆస్వాదించలేకుండా ఉన్నాము. వందలకొద్దీ ద్విపదలు వరుసగా చదువుతూంటే రోకటిపాటగా విసుగు కలిగిస్తుంది. ద్విపద సౌందర్యమూ, ప్రయోజనమూ దానికిలేకపోలేదు. ఆంగ్ల మహాకవి మిల్టను తన Paradise Lost అనే కావ్యాన్ని ఆద్యంతమూ Blank verse అనే ఛందస్సులో నిర్వహించలేదా? అది విసుగు పుట్టించడంలేదా? అంటే అక్కడ తద్భాషావిదుల అభిరుచియే ప్రమాణము. ఒకే ఛందస్సు వాడడంలో వచ్చే Monotony ఊకదంపు లక్షణాన్ని గతివైవిధ్యంచేత మిల్టను వారించుకున్నాడని అంటారు. పాల్కురికి సోమనాథుని దృష్టి కావ్యశిల్పంమీదకన్న శైవమత ప్రచారంమీద అధికంగా లగ్నం అవడంచేత ఇట్లాంటి మెలకువలను ఆ మహారచయిత ఉపేక్షించాడు.

రచనావైవిధ్యం సాధించడానికి ఛందోవైవిధ్యం భాషావైపుల్యం కావాలని అన్నాము. భాష అనేది లోకంలో ఏర్పడి సిద్ధంగా ఉంది కాని కవి అధీనంలో లేదు. 'సిద్ధి ర్లోకాద్వ్యుత్యా' అని పెద్దలు చెప్పనేచెప్పారు. ఎంత ఘనుడైన కవి అయినా, వాగనుశాసనుడైనా, కవిబ్రహ్మ అయినా, కవిసార్వభౌముడైనా, కవితా పితామహుడైనా సరే అతనికి క్రొత్తశబ్దనిర్మాణంలో అధికారంగాని, సాఫల్యంగానీ తక్కువ. లోకంలో వాడుకలో ఉన్న పదజాలాన్నే వాడుకోవాలి. ఈ పదజాలంకూడా యుగయుగానికి కొంచెం భేదిస్తూనే ఉంటుంది. ఆర్థికరంగంలోలాగే భాషారంగంలోకూడా మార్పులు వస్తూంటాయి. పాతనాణాలు పోయి క్రొత్తనాణాలు చెలామణీలోనికి వస్తూంటాయి. క్రొత్త రాజరికంవస్తే పాత రాజరికంతాలూకు నాణాలన్నిటినీ కరగపోసినూత్న గద్యాణములు వాడుకలోకి తేవచ్చును. భాషారంగంలో ఇంత సర్వవ్యాపియైన మార్పు రాదు. వస్తే అది ఆ పూర్వభాష కానేకాదు. వేరేభాష అవుతుంది. అయినప్పటికీ శబ్దాలు రూపంలో అర్థంలో సరిక్రొత్త రూపాలుదాలుస్తూ ఉంటాయి. అర్థవిపరిణామ శాస్త్రం ఈ సన్నివేశాన్ని వివరిస్తుంది. ఒక నదీప్రవాహంలో ఉపనదులు వచ్చి కలిసినట్లు ఒక భాషాప్రవాహంలో అన్యభాషాపదాలు వచ్చి చేరుతూ ఉంటాయి. తమ రూపం కొంత మార్చుకొని దేశపదజాలంగా చెలామణి అయిపోతూంటాయి. భాషాశాస్త్రంలో ఇటువంటి ఆదానప్రదానాలను గూర్చి చెప్పడం జరుగుతుంది. కవిత్వంలో భాషావైవిధ్యం సమ

కూర్చుకోవాలంటే కవికి రెండుమార్గాలు కనబడుతున్నాయి. స్వభాషాసిద్ధమైన పద జాలాన్ని నేర్పరితనంతో వాడుకుంటూ క్రొత్త కలయికలు చేస్తూ, అర్థవంతమైన పద బంధాలు సృష్టిస్తూ రచన సాగించాలి. రెండవది పైనచెప్పిన ఆదానమార్గంగా తన భాషలో చేరిన పదజాలాన్ని సముచితంగా వాడుకోవచ్చును. ఏదేశపు సాహిత్య భాషైనా ఇట్లాగే సంపన్నమవుతుంది.

## కవి లక్ష్యము - సాహిత్య భాష

ఒక్కొక్క కవి పెట్టుకొన్న లక్ష్యాన్నిబట్టి అతడు నిర్మించిన సాహిత్యభాష భిన్నంగా ఉంటూంటుంది. కవి సమాజంలో మూడు రకాలు గుర్తించవచ్చు (1) కవికేంద్రవాదులు (2) ప్రజాకేంద్రవాదులు (3) ఉభయవాదులు. కవి తన సంతోషంకోసమై తన ఆత్మాభివ్యక్తికై తన ఇచ్ఛవచ్చిన మేరకు రచన చేయదగునని విశ్వసించువారిని కవికేంద్రవాదు లందాము. ఇదివరలో మనము చెప్పుకొన్న రాజస కవి ఈతెగకు చెందినవాడు. తెలుగులో ప్రబంధకవులను, ప్రబంధమార్గమునకు బాటలువైచిన పూర్వకవులను, ఈ వర్గంలో చేర్చవచ్చును. ప్రజాకేంద్రవాదులు ఆధు నిక కవు లందాము. ప్రజాభ్యుదయంకోసము, ప్రజానందంకోసం కవిత్వం వ్రాయా లంటారు వీరు. ఈ కవి ఆత్మాభివ్యక్తికి అంత ప్రాధాన్యం ఇవ్వక సమకాలికసమాజా నికి ఏది రుచిస్తుంది, ఏది అందుబాటులో ఉంటుంది అని చూసుకుంటూ రచన చెయ్యా లంటాడు. ఇతడు తనకు తాను అన్యాయం చేసుకుంటూ సమాజానికి అన్యాయం చేసినవాడవుతున్నాడు. ఎట్లాగంటే, ఉత్తమకవి క్రాంతదర్శి అంటున్నాము. అనగా జగత్సత్యాన్ని ఇతరులు తెలుసుకునేదానికన్న నిశితంగా అతడు తెలుసుకొనగలుగుతా డన్నమాట. మనము ఆస్తికులమైతే భగవదంశ ఇతర మానవులందు కన్న కవియందు అధికముగా భాసిస్తుందని చెప్పుతాము. ఇట్టి విశిష్టవ్యక్తి సత్యదర్శనమునందు, సత్య ప్రవచనమునందు అధికశక్తి, అధిక తాత్పర్యము కలిగిఉంటాడు. లోకానికి కర్తవ్యా కర్తవ్యములవిషయంలో సందేశం ఇవ్వడానికి అర్హత మహాకవికి ఉంటుందని అందరూ ఒప్పుకుంటున్నారు. Poets are the ligislators of mankind - కవులు లోకానికి ధర్మనిర్ణేతలు అని ఒక ఆంగ్లకవి అన్నాడట. కవులు ఋషులవంటి వారని మన పూర్వులు కూడా ప్రవచించారు. 'నానృషిః కురుతే కావ్యం' అని వారిసూక్తి. ఋషికానివాడు కావ్య నిర్మాణం చెయ్యలేడు. ఇది వ్యాసవాల్మీక్యాదుల విషయమే కావచ్చును. ఒక హోమరు కావచ్చును; వర్జిల్ కావచ్చును; మిల్టను కావచ్చును. పద్యమల్లిగల ప్రతివానికిని మనము ఇటువంటి అభ్యర్హితస్థానం ఆరోపించలేము. అయి

'సారమతింగవీంద్రులు ప్రసన్న కథా కవితార్థయుక్తి లో; నారసిమేలు నా ని తరులక్షర రమ్యత నాదరింప నానారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా భారత సంహితా రచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగన్'- నన్నయ. 'కావున భారతా మృతము కర్ణ పుటంబుల నారఁగ్రోలి యాంధ్రావళి మోదముం బొరయు నట్లుగ సాత్య వతేయ సంస్మృతి శ్రీ విభవాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వ దీక్షావిధి నొంది పద్యముల. గద్యములన్ రచియించెదంగృతుల్"—

తిక్కనసోమయాజి.

"ఇమ్మను జేశ్వరాధముల కిచ్చిపురంబులు వాహనంబులున్।
సొమ్ములు గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము వాసి కాలుచే।
సమ్మెటపోటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చిచెప్పె నీ
బమ్మెర పోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్॥ — పోతన.

ముగ్గురు మహాకవులు తాము ప్రజాహితంకోసం సాహిత్యసృష్టి చేస్తూన్నట్లు చెప్పు కొని యున్నారు. లోకహితాన్నే కోరి వారు భారత, భాగవతాలు వ్రాసినా సాహిత్యం యొక్క ఉదాత్త లక్షణాలనుగాని తమ ఆత్మధర్మాన్ని కాని వీడినట్లు కాన్పించదు. నన్నయ భట్టారకుడు తన కవిత్వలక్షణాలను సంగ్రహంగా చెప్పాడు. తిక్కనసోమయాజి వ్యాస మునీంద్రుని సంస్మరిస్తూ 'మహాకవిత్వ దీక్షావిధినంది'రచన సాగిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. తుచ్ఛమైన ఐహిక సంపదలకోసం గాక శ్రీహరి సమ్మతికోసము, లోకహితం కోసము వ్రాస్తున్నానని ఉద్ఘాటించాడు. ఇక్కడ ఒక ప్రశ్న కలుగుతూంది. పూర్వ మహాకవులు వారు చెప్పుకొన్నట్లుగా నిజంగా ప్రజాహితంకోరియేరచనలు చేసినట్లయితే వారి గ్రంథాలు ఇప్పటి ప్రజలకు యథాతథంగా అర్థం కావడంలేదేమిటి? ఇదినేతిబీరకాయ ప్రతిజ్ఞకదా అన వచ్చును. ఈ సందేహాన్ని మనము ఇట్లా పరిహరించాలి. వారు గ్రంథాలు వ్రాసి కొన్ని శతాబ్దాలు చెల్లిపోయాయి. భాషా స్వరూపం విస్తారంగా మారింది. ఎవరు కవిత్వం చెప్పినా సమకాలికుల్ని వారికి తెలిసినంతవరకూ శాశ్వత సత్యాలను దృష్టిలో పెట్టుకొని చెప్పుతారు కాని అనంతమైన భావికాలాన్ని అంతటినీ ఉద్దేశించి వ్రాయలేరు. అదిసాధ్య మును కాదు. అందుచేత ప్రాచీన కవిత్వంలో కొంతభాగం మనకు అస్పష్టంగానే ఉండి పోవచ్చును.

పోనివ్వండి. ఈ పూర్వకవుల కవిత్వం సమకాలంవారికైనా అందరికీ అర్థమయి ఉంటుందా. ఎవరో కొందరు పండితులకు మాత్రమే అర్థమయి ఉంటుంది.

"జలధివిలోలవీచి విలసత్కల కాంచి సమంచితావనీ
తల వహన క్షమం బయిన దక్షిణహస్తమునం దదున్నమ
ద్గళదురుఘర్మ వారికణ క్రమకరాబ్జము పట్టి నూతిలో
వెలువడఁ గోమలిం దిగిచె విశ్రుతకీర్తి యయాతి ప్రీతితోన్"

అని నన్నయ భట్టారకుడును,

"సింగంబాకటితో, గుహాంతరమునన్ జేడ్పాటు మైనుండిమా।
తంగస్ఫూర్జితయూథదర్శన సముద్యత్ క్రోధమై వచ్చునో।
జంగాంతార నివాస ఖిన్నమతినస్మత్సేనపై వీఁడె వ।
చ్చెంగుంతీ సుత మధ్యముండు సమరస్థేమాభి రామాకృతిన్॥

అని తిక్కన సోమయాజియు,

'లలితస్కంధము కృష్ణమూలము' ఇత్యాదిగా బమ్మెరపోతరాజు గారును వ్రాసినప్పుడు ప్రజాసామాన్యానికి ఇది అర్థమయి ఉంటుందా? ఏదో మసిపూసి మారేడుకాయ చేసినట్లున్నది, అనవచ్చును కొందరు. దీనిలో మోసగింపు ఏమీలేదు. కాని కవిత్వపు పరమార్థము, రహస్యము దీనిలో వ్యగ్యంగా ఇమిడి ఉన్నాయి. కవిత్వము యొక్క పరమార్థము ఏమని చెప్పుకొన్నాము. సహృదయుణ్ణి భౌతిక వాసనలనుండి సుకుమారంగం లేవనెత్తి రసబ్రహ్మాభి ముఖంగా పయనించేటట్లు చెయ్యడమని చెప్పినాము. ఈ రసమూ, బ్రహ్మమూ, లేవనెత్తడమూ ఇదంతా బూర్జువావాదము అని త్రోసిపుచ్చే వారితో మనము వివదించుట లేదు. ఉచితసమయంలో వారి పరిభాషలోనే వారికి నివేదించుటకు యత్నం చేద్దాము. రసాభిముఖంగా పాఠకుణ్ణి తీసుకువెళ్లేటప్పుడు రసానుకూలమైన రచన ఉండాలని సాహిత్య శిల్పవేత్తలు నాడూ నేడూ కూడా భావిస్తున్నారు. అందుచేత భాషా వైవిధ్యం ఏర్పడుతుంది. రెండవ ముఖ్య విషయం ఏమిటంటే, ఏకాలపు కవిత్వమైనా సరే- కవి, పాఠకునితో పాటు క్రిందికి దిగజారడం కన్న పాఠకుణ్ని తన భావ భాషాశ్రేణికి చేదుకోవడం ఉత్తమ కవిత్వం అవుతుంది. అట్లాచెయ్యక పోతే కవిత్వ లక్ష్యమే ఉపహతమవుతుంది. పాఠకుణ్ణి రెచ్చకొట్టే రచన అది కావ్యం కానివ్వండి, నాటకము, నవల, కథానిక ఏదైనా కావచ్చు ప్రచార సాధనము మాత్రమే అవుతుంది. కవిత్వము పని నల్లమందు వలె పని చేసి పాఠకుణ్ణి నిద్రపుచ్చడం కాదని పూర్వులు కూడా చెప్పారు. అతనిని కర్తవ్యాభిముఖుణ్ణి చెయ్యడం కావ్య లక్షణాల్లో ఒకటని వారు కూడా తలపోసారు. చూడండి విద్యానాథుడు ప్రతాపరుద్ర యశోభూషణంలో ఏమంటున్నాడో;

'కాంతా సమ్మితయా యయా సరసతా
మాపాద్య కావ్య[శియా క ర్తవ్యే కుతుకీ బుధో విరచిత స్తస్యై స్పృహాం
కుర్మహే"

అంటే కాంతా సమ్మితమైన కావ్యోపదేశం చేత సజ్జనుడు క ర్తవ్యము నందు ఉత్సాహము కల వాడుగా చేయబడుతున్నాడు. అట్టి కావ్య[శ్రీకి నమస్కారము. సాంఘిక సమస్యలను, సాంఘిక అన్యాయాలను, అసమానతలను. పీడనలను అన్నింటినీ కవిత్వంలో చర్చించ వలసే ఉంటుంది. అవి కావ్య వస్తువు కావచ్చును. [ప్రాచీన [గీకు అలంకారికులు భావించినట్లు 'To purge feelings through pity and fear' కవిత్వము కరుణ. భయానక రసముల ద్వారా భావ సంశుద్ధిని కలిగించవలెను. మానవుని భావములను సంశుద్ధము చేయవలెనే కాని అతని అసంస్కృత రాగ ద్వేషాలను రెచ్చగొట్ట కూడదు. ఏ కావ్యము పాఠకుని యందు భావ సంశుద్ధిని. సమస్త జీవుల యెడ దయా స్వభావమును (కరుణ), పాపము విషయంలో భీతిని (fear) కలిగించదో అది కవిత్వ ధర్మంలో విఫలమయిందన్నమాట.

పై చర్చ చేత కావ్యమునందలి భావం భాషకూడ పాఠకుణ్ణి ఉన్నత [శేణికి కొనిపోవునవిగా ఉండవలేనని తేలుతున్నది. భాషా విషయంలో కవితా శిల్పానికి వెలి కాకుండా పాఠకునకు ఎంత సన్నిహితంగా పోనగునో అంత సన్నిహితంగా పోవుటయే [ప్రాచీనుల లక్ష్యం. పాఠకునియందు కవి వెంటపోవుటకు కొంత [పయత్నం కావలెను. కవి తన మట్టానికి దిగాలని పట్టుపట్టకూడదు. ఆ [ప్రయత్నం కవి పాఠకుల కిరువురకును లాభదాయకం కాదు. అటువంటి ఉద్యమంలో ఉత్తమ కవిత్వం ఆవిర్భవింప నేరదు. ఈ పూర్వ రంగంతో సాహిత్య భాషగా తెలుగు ఎట్లు తీర్చి దిద్ద బడిందో అది తన లక్ష్యాన్ని ఎంత వరకు నెరవేర్చగలిందో పరిశీలిద్దాము.

## తెలుగులో సాహిత్య భాషావతరణము

తెలుగులో సాహిత్యం ఎప్పుడవతరించిందో అప్పుడే సాహిత్య భాష కూడా అవతరించిందని స్థూలంగా చెప్పవచ్చును. ఏ భాష విషయంలోనయినా అంతే. ఇప్పుడు మనకు తెలిసినంత వరకూ నన్నయ భట్టారకుని ఆంధ్ర మహాభారతమే తెలుగులో గల తొలి [గంథము. కవిజనా[శయ మనే చందో [గంథమూ, నన్నెచోడుని కుమార సంభవ కావ్యమూ నన్నయ్యకు ముందే వెలిశాయని కొందరు విమర్శకులు భావిస్తారు. కాని అత్యధిక సంఖ్యాకులైన మన సాహితీ వేత్తలు దీనిని ఆమోదించడం లేదు. ఇప్పు

టికి లభించిన దాని కన్న దృఢతర సాక్ష్యం లభించే దాకా నన్నయ భారతమే ఆది కావ్యము అని ఒప్పుకోవాలి. అయితే వసు చరిత్ర కారుడు 'మహిమున్ వాగను శాసనండు సృజియింపన్' అనే పద్యంలో చెప్పినట్లు నన్నయ ఆది కవియా? అంతకు ముందు తెలుగు కవులు లేరా? తెలుగు కవిత్వం లేదా? అంటే ఉన్నదనే సమాధానం చెప్పాలి. ఆరంభంలోనే ఒక చిన్న క్షమార్పణ రామరాజ భూషణునికి చెప్ప వలసి ఉంది. వాగనుశాసనుడు అనగా నన్నయ భట్టు ఆంధ్రోక్తిమయ ప్రపంచాన్ని సృష్టించినట్లు రామరాజ భూషణుడు చెప్పాడని అర్థం చేసి ఆ మహాకవిని తరుచు భాషావేత్తలు విమర్శిస్తూ ఉంటారు. ఎంత మహాకవియైనా భాషను సృష్టించ గలడా? రామరాజ భూషణునకు భాషా తత్వం తెలియదని అంటూంటాము. ఇదొక విధంగా ఆ మహా కవికి (వసు చరిత్ర కారునికి) అన్యాయం చెయ్యడమే అవుతుంది. ఎందు కంటే రామరాజ భూషణుడు తెలుగు భాషా చరిత్ర వ్రాయడానికి పూనుకోలేదు. ఒక వేళ పూనుకొన్నా ఈ కాలంలో మనకు లభించే విమర్శాత్మక సాధనాలు ఆయనకు అందుబాటులోనూ లేవు. 'ప్రమాదో ధీమతా మపి' అన్నట్లున్నా సాధనా భావం చేత నున్నా ఆంధ్రోక్తిమయ ప్రపంచము నన్నయతో మొదలైందని ఆతడు వ్రాసినా క్షంతవ్యమే అవుతుంది. వాస్తవానికి అతడు వట్టి ఆంధ్రోక్తి మయ ప్రపంచము అనలేదు. ఈ బహుళాంధ్రోక్తి మయ ప్రపంచమున 'దత్రాప్రగల్భ్య మూహించెదన్' అని వ్రాసినాడు. అతని దృష్టిలో ఉన్నది సాహిత్యో ప్రయోగియైన బహుళాంధ్రోక్తి మయ ప్రపంచము. నిజంగా నన్నయ భారతానికి ముందు ఈ బహుళాంధ్రోక్తిమయ ప్రపంచము లేదు. దానికాతడే చాల వరకూ రూపకల్పన చేశాడు. ఈనాడు మనము కూడా అదే భావిస్తున్నాము. అందుచేత వసుచరిత్రకారుని తేలికగా విమర్శించడం న్యాయం కాదు. అదియట్లుండె.

నన్నయ భట్టారకునకు ముందుడిన ఆంధ్రోక్తిమయ ప్రపంచమెట్టిది, దాని నాతడు సాహిత్య ప్రయోజనాలకు ఉపయోగపడేటట్లు ఎట్లా బహుళాంధ్రోక్తిమయ ప్రపంచంగా తీర్చిదిద్దాడు అనే ప్రశ్నకు సమాధానం అరయాలి. తెలుగు భాష ఎంత ప్రాచీనమైనది అనే విషయంలోనే అభిప్రాయ భేదాలున్నాయి. ఏమయినా సాత వాహన యుగాంతమునకు తెలుగుభాష అస్తిత్వంలోకి వచ్చింది. నాల్గవ పులుమావి జంగ్లిగుండు శాసనంలో వేపూరు శబ్దం వచ్చింది. ఇది క్రీ. శ. మూడవ శతాబ్ది ప్రారంభము. వేపూరు అనేది వేపచెట్లు అధికంగా గల గ్రామము అని అర్థంచేస్తే ఇందులో మేము ఊరు అనే రెండు తెలుగు పదాలు స్పష్టంగా కనబడుతున్నాయి.

కర్మ ధారయ సమాసంలో మువర్ణాంత శబ్దాలకు వచ్చే పుంప్వా దేశం కూడా వేపూరు శబ్దంలో కనపడుతూంది. కావున ఇది తప్పక తెలుగు పదమనీః ఇటువంటివి ఎన్నో ఉండి ఉంటాయనీ, దేశ ప్రజలకు సులభంగా తెలియడానికై తెలుగు స్థల నామం ప్రయోగించారని చెప్ప వీలవుతుంది. అప్పటికీ తెలుగు గ్రామ నామాలు వాడుకలో ఉండే వన్నమాట. ఇంతకన్నా పూర్వ కాలానికి చెందిన ఒక పదము అమరావతీ స్తూప శిల్పాలమీద కనబడింది. ఇది 'నాగబు' అనే పదము. ఇప్పుడు మనము వాడే నాగము (పాము) అనే శబ్దంయొక్క ప్రాచీన రూపము. ఇందులో నాగ అనే సంస్కృత పదమూ, దాని మీద అమహ ద్వాచక ప్రథమా భక్తి ఏక వచన ప్రత్యయ స్థానంలో 'బు' వర్ణమూ కనబడుతున్నాయి. తత్సమములైన అమహద్వాచక శబ్దముల మీద మనమిప్పుడు 'ము' వర్ణము వాడుతున్నాము. దాని స్థానంలో పూర్వకాలమున బు, ంబు, మ్ము వాడే వారన్న మాట. నాగబు, నాగంబు, నాగమ్ము, నాగము క్రమంలో ఈ ప్రత్యయం పరిణామం చెందినది. నాగబు అనే రూపం తప్ప తక్కిన మూడు రూపాలు మనకు కావ్యాల్లో లభిస్తూనే ఉంటాయి. వనంబు, వనమ్ము, వనము కూడా ఇటు వంటివే. అప్పటికే మహదమహద్వాచక భేదం చెయ్యడం, వాటిల్లో అమహ ద్వాచకాల మీద వచ్చే ప్రత్యయము మనకు దొరికాయి. ఇంకా ఎన్నో దొరికి ఉండు ననడం తథ్యము. శాసన లేఖకులకు అవసరం పడలేదు. తెలుగు వాక్య రచన ఉన్నట్లు నిదర్శనం ఇంకా లభింప లేదు.

ఉత్తరోత్తరంగా ఈ క్రమమే సాగింది. క్రీ. శ. 1వ శతాబ్ది నుండి 6వ శతాబ్ది మధ్య వరకూ తెలుగు వాక్య రచన ప్రత్యక్షం కాలేదు. ఈనాడుమ వెలసిన ప్రాకృత శాసనాల్లోను, సంస్కృత శాసనాల్లోను గ్రామ నామములు, మనుష్య నామ ములు, బిరుదు పదములు వంటి వ్యస్త రూపములు, తెలుగు శబ్దములు అని చెప్ప దగినవి బహుళ సంఖ్యలోనే కనబడుతున్నాయి. గ్రామ నామాల చివర-ఊరు, పట్టు పట్టుః పాక, కొండ, చెరువు వంటి పదాలు కనబడతాయి. ఒక విశేషమేమిటంటే తెలుగు వర్ణమాలలో మనకు ఇప్పటికే పరిమితమైన శకట రేఫము లేక బండి 'ఱ' ఈ మాటల్లో వస్తూంటుంది. సంస్కృతంతో పోల్చినప్పుడు తెలుగునకు ప్రత్యేకమైన ధ్వనులు ఏవంటే ఎ, ఒ, చ, జ. ఱ. అని చెప్పుతున్నాము. ఇవిగాక ఈ ప్రాచీన కాలంలో తెలుగు పదాల్లో 'ఴ' అనేధ్వని ఒకటి క్రొత్తగా మనకు తగులుతుంది. ఇది కొన్ని శతాబ్దాల దాకా తెలుగులో నిలిచి ఉండి నన్నయ సమీప కాలంలో కాబోలు భాషలో నుంచి నిష్క్రమించింది. నన్నయ భారతంలో ఈ ధ్వని

494.813
CA4
Acc NO. 6221



వినబడదుకాని ఆయన సమకాలిక శాసనాల్లోకూడా ఈ "ట" ధ్వనివాడబడుతూనే ఉండేది. అనగా వ్యవహార భాషలో ఉండేది. అగ్రవర్ణాల భాషలో తొలగినట్లుంది. ణకారము (అణావంటి మాటల్లోనిది) నన్నయ పూర్వభాషలో తరుచువాడబడేది. పని అనడానికి పణి అని పలికేవారు కావచ్చును. దంత్యనకారము, శకటరేఫ కలిసిన సంయుక్తవర్ణం "న్ఱు" అనేది కాలక్రమంలో "ండు, డు"గా మారింది. పుత్రున్ఱు అనేది పుత్రుండు, పుత్రుడుగా పరిణమించింది. దీనినే మనము మహద్వాచక ప్రథమ ఏకవచనంగా చెప్పుతున్నాము. కుంటి "ళ" అని మనము చెప్పుకొనే "ళ" వర్ణము కూడా నాడు విశేషప్రయోగంలో ఉండేది. కొఱుకళ్ అనే మాట ఇప్పటికొడుకులు అనే దానికి ప్రాచీనరూపం - ఇందులో చివరఉన్న కళ్‌ప్రత్యయము. బహువచన ప్రత్యయము. ఇదియే తరువాత ళు, లు గా మారింది. తరువాతి కాలంలో లు వర్ణమే బహువచన ప్రత్యయంగా ఎక్కువ వాడుకలోకివచ్చింది. పైన చెప్పిన "ఱ" ధ్వని అనంతర శతాబ్దాలో పెక్కు మార్పులకు లోనయి చివరకు నన్నయ భారత భాషలో విడువబడింది. ఇది ఒకప్పుడు రేఫగా మార్పుచెందింది. పుఱోలు అనే మాట వర్ణ వ్యత్యయంచేత ప్రోలు (పట్టణము)గా రూపొందింది. ఱ కారము ఱ, ర,గా మారిన దన్నమాట. ఒకప్పుడిది ద కారంగా తయారయింది చోఱి, కోఱి మున్నగు శబ్దాల్లో ఇది చోడి. కోడి రూపాలను ఎత్తింది. ఒకప్పుడిది పదారంభంలో కూడా వాడబడేది. దీని సరియైన ఉచ్చారణ ఇప్పుడు మనకు తెలియదు, తమిళభాషలోకూడా ఇది ఉండడంచేత దానికి దగ్గరయైన ఉచ్చారణ దీనికి ఉండేదని ఊహించాలి. "ఱేందు లూరు అనేది ఱెందులూరు, డెందులూరుఅయి ఇప్పటి మన దెందులూరు రైల్వేస్టేషన్ గా మారింది, ఇది ఏలూరు ప్రక్కన ఉన్న గ్రామము. ప్రాచీనాంధ్రభాషకు చెప్పబడిన విశేషవర్ణాలు - ఱ, ఱ, ణ, ళ - అరవ కన్నడభాషల్లోకూడా ప్రచురంగా ఉన్నాయి. అందుచేత తెలుగుభాష ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదని భాషా శాస్త్రజ్ఞులు నిర్ణయించారు. ఈ యొక్క సామ్యమే కాదు, ఇతర సామ్యములు చాలా ఉన్నాయి. పూర్వశాసనాల్లోని కొన్ని గ్రామనామములు - విరిపఱ (తరువాత విప్ర్రుగామారింది పాణూర, కూడుర. దాలూర, ఆతుకూరు. తాఱికొన్ఱ (తాడికొండ ఏలూరు, చెంచెరువ కంబురాంచెరువ (కమ్మరి చెఱవు), రేగోన్ఱమ్ (రేగొండ), పెణుకుపఱ్ఱు పులొంబూరు (పొలమూరు) ఇత్యాదులెన్నో కలవు. వ్యక్తి నామములు, అగ్గిజ్జ, భావజ్జ (అయకాపూర్వ రూపము అజ్జ), గొలశర్మ, కొట్టిశర్మ వంటివి. బిరుదుపదాలు మహా తలవర, మహాతగవర (తగవరి-న్యాయాధీశుడు) వంటివి.

క్రీ. శ. 6 వ శతాబ్ది చివరి భాగంలో చిన్నచిన్న వాక్యరచన తెలుగు శాసనాలు మనకు లభిస్తాయి. ఇవి కడప జిల్లా ప్రాంతంలో పరిపాలించిన రేనాటి చోళులవి. పరిశోధకులకు లభించిన మొదటి తెలుగు శాసన స్వరూపం చూడండి ఇది కడప జిల్లా ప్రాంతంలో కలమళ్ళ గ్రామంలో కనబడింది కాలము క్రీ.శ. 575 ప్రాంతము. శాసన పాఠము.

'కల్ము (తు) రాజు
ధనంజయుఌ రేనాండు ఏలన్
చిఱుంబూరి రేవణకాలు (పం)పు
చెనూరు కాజు అశికల (ఊ)రిందవారు
(పంచ) (మ) హాపాతకసకు

కుండలీకరణము చేయబడినవి అక్షరములు పోగా శాసన పాఠకులు సందర్భానుకూలముగా సమకూర్చినవి. దీని అర్థం ఇట్లా చెయ్యాలి "ఎరికల్ ముతురాజు ధనంజయుఌ రేనాడు ఏలగా అనగా పరిపాలిస్తూ ఉండగా చిరుంబూరి రేవణగారి పంపున ఆజ్ఞపై లేక ప్రేరణమీద చెనూరుకాజు, (మరియు) అశికళ ఊరివారున్నూ—ఏదో దానం ప్రకటించారు, ఆ ధర్మ ప్రతిష్ఠాపనకు విఘ్నము చేసిన వారికి పంచమహాపాతకములు అగు." శాసనంలో దానమిచ్చిన భాగము శిథిలమైపోయింది. దీనిలోని భాషా విశేషాలు కొద్దిగా గుర్తిస్తాము. ధనంజయుఌ అనే పదంలో 'రు' ప్రత్యయము గౌరవార్థక ప్రత్యయముగా గ్రహించాలి ఏకవచనమేకాని పూజ్యార్థమున బహువచనము. కృష్ణదేవరాయలవారు అన్నట్లు. ఇప్పుడు మనము దీర్ఘముమీద పూర్ణానుస్వారము వాడము. చిన్నయ సూరిసూత్రం కూడా అట్లాగే చేశాడు. కాని ప్రాచీన కాలంలో 'నాండు' నాడు, వాండు-వాడు అన్నట్లు పలికేవారు. వ్రాసేవారు అందుచేత రేనాడు రేనాండు అయింది. ఏలన్ ఏలుచుండగా. అన్నంత ప్రత్యయము సాహిత్య భాషలో తరుచు కనబడుతుంది. ఇప్పుడు మనము ఏలగా అని అంటున్నాము. చిరుంబూరి అన్నప్పుడు ఔపవిభక్తిక 'ఇ' వర్ణం కనబడుతూంది. రేవణకాలు అన్నది రేవణగారు కావచ్చును. కాలు అనేది సాధారణ గౌరవవాచక పదము. పంపు-పనుపు-పనుచు-ఆజ్ఞచే అనుట భారతంలో తరుచువస్తుంది. అశికళ ఊరిందవారు. అశికళ గ్రామవాసులు. ఊళ్ళోవారు అనుట. అందు, ఇందు, ఎందు- అనే స్థలవాచకములు నన్నయకు మిక్కిలి సమ్మతములు. దాన విఘాతకుడు పంచమహాపాతకుడగును అని శాసనంలో వ్రాయడం మామూలు. చిట్టచివరవచ్చిన 'అకు' అగు ధాతు ప్రాచీనరూపము. ఈ ధాతువులో నన్నయకాలం నుంచీ సరళ వర్ణం వచ్చింది. ద్రావిడ భాషా సంప్ర

దాయం ప్రకారం పరుషమైన 'కు' ఉండాలి, దీనికి ఒక నిదర్శనం ఏమిటంటే దీని మీద అన్నంత శబ్దించేసేటప్పుడు 'కాన్' అనియే అవుతుంది. ఇది మురిపెమైన చిన్న శాసనం. మనకాలపు భాషకు చాలా చాలాదూరంగాను, నన్నయ భాషకు కొంచెం సమీపంగాను ఉన్నది.

ఆరవ శతాబ్దం నాటిది నెల్లూరు జిల్లా భైరవుని కొండవద్ద దొరికిన ఒక శాసనం. ఒక్కటే వాక్యం ఉంది.

శ్రీ వేలు గుణ్ఱ ఆచార్లు పణికేసిరి.

వేలుగుంట ఆచార్యులు పనిచేసిరి. ఆచార్లు వ్యావహారిక రూపం. ఇప్పటికీ వాడుతున్నాము. పని అని దంత్యనకారంతో వ్రాయవలసినది మూర్ధన్యణకారంతో వ్రాశారు. అన్నిటికిమించి ఆశ్చర్యకరమైనది చేసిరి అనుటకు కేసిరి. ఇది చెక్కడంలో పొరపాటు కూడా కాదు. ప్రాచీన కాలంలో శబ్దాలు ఎక్కువగా కంఠ్యాదిగా ఉండేవి. తరువాత అవి తాలవ్యములుగా మారాయి. క-చగా మారింది. దీనినే తాలవ్యీకరణం అంటారు. భాషలో రెండవదశ. అకు-అగు అవడంపైన చూశాము. ఒక్కొక్కప్పుడు కంఠ్యములు సరళములవుతాయి. కడప-గడప,

ప్రాచీనభాషా పరిణామం తెలియడానికి మైలురాళ్లల్లా అక్కడక్కడ ఒక్కొక్క శాసనం చూద్దాము. క్రీ. శ. 8వ శతాబ్దినాటిది అని భావింపబడిన చిలంకూరు శాసనము, కడప జిల్లా,

"స్వస్తిశ్రీమత్ విక్రమాదిత్య చోళమహారాజుల ఏలన్ చోళమహాదేవుళ్ ఉత్తమాదిత్య సామంతకముళ్ చిఱుంబూరు ఏలన్ ఊరయేలుపాణ్ఱ పాకాటిఖానవణం (ప)రియారము మరుతుణ్ఱ ప్రసాదచేసిరి. ఆచంద్రార్కంబు నిల్వ - తొల్పకొమి రట్టగుళ్ళు చోళియరట్టగుళ్లు, అతిశయ రట్టగుళ్లు ఆళికొ - రిక్కి ప్రసాద పూర్వమ - తేనిళచ్చు-(మ)హాపాతక —."

విక్రమాదిత్య చోళమహారాజులు ఏలుచుండగా చోళమహాదేవియు, ఉత్తమాదిత్యుడును సామంతులుగా చిఱుంబూరునందు పరిపాలించగా, గ్రామమునందలి ఏడుగురు బ్రాహ్మణులకు పాకటూలునవణం (పన్ను) పరిహారమున్నూ, మఱుతురు (నేల) యున్నూ ప్రసాదంచేసిరి. ఆచంద్రార్కము నిల్చునట్లుగా, తొల్పకామి రట్టగుళ్ళు, చోళియరట్టగుళ్ళు, అతిశయరట్టగుళ్ళు-ప్రసాదపూర్వము. దేనికి విఘ్నముచేసె(నవారు) మహాపాతకులగుదురు.

విక్రమాదిత్య మహారాజు రాజ్యము చేయుచుండగా ఆయన రాణి చోళమహాదేవి, ఉత్తమాదిత్యునితో కలిసి (కుమారుడు కావచ్చును)

చిఱుంబూరు (చిలంకూరు)లో సామంత పరిపాలన చేస్తూ గ్రామంలోని ఏడు గురు బ్రాహ్మణులకు పన్నులలో కొంత రాయితీ చేసి ఒక ఎకరం భూమి ఆ చంద్రా ర్కంగా దానం చేశారు. దీనికి తొల్ప కామయరెడ్డి మున్నగు రెడ్లు సాక్షులై యుంటారు లేదా వారు వేరే దానం చేసి ఉంటారు. దాన విఘాతకులకు శాపోక్తి కలదు విక్రమా దిత్యుడు ప్రధాన నగరంలో ప్రభుత్వం చేస్తుండగా కుమారుడైన ఉత్తమాదిత్యుడు ఆయన అధికారానికి లోబడి యువరాజుగా చిలంకూరులో నిలపబడ్డాడు. ఈతడు ప్రాజ్ఞుడు కాకపోవడంచేత కాబోలు తల్లియైన చోళమహాదేవి అతనికి సంరక్షకురాలుగా వ్యవహరిస్తూంది. ఇది ఈ శాసనంలోని చారిత్రక సన్నివేశము.

వెనుకటి శాసనంలో కన్న దీనిలో తెలుగు వాక్యరచన క్రమబద్ధంగా నడిచింది. అసమాపక వాక్యం ముందు వచ్చి సమాపక వాక్యం తరువాత వచ్చింది. సమాపక వాక్యంలోని భాగమైన "ఆ చంద్రార్కంబు నిల్వ" అనేది ప్రసాదంచేసిరి అనే సమాపక క్రియ తరువాత రావడం కొంత విశేషం. ఇప్పటి తెలుగు వాక్యంలో సమాపకక్రియ చిట్టచివర వస్తుంది. అన్నంత క్రియయైన 'ఏలన్' తరువాత కా, గా అనేవి వాడబడడం లేదు. ఇవి అగుధాతు రూపాలు. ప్రసాద చేసిరి అన్నప్పుడు మువర్ణలోపము. భయము పడు-భయపడు అన్నట్లు. ఊర అన్నప్పుడు ఔపవిభక్తిక సప్తమారూపము. తృతీయా సప్తములకు ఆత్వం వచ్చుట కలదు. ఏడు అనుటకు ఏళుపాళ్ల అని వ్రాయుట ళ-డల అభేదాన్ని సూచిస్తుంది. పాఱ అనేది విచిత్రంగా వినిపిస్తుంది. పాఱుడు బ్రాహ్మణుడు. డు వర్ణ విరహితంగా పాఱ అనురీతిని ఈ శబ్దాన్ని వాడేవారు కాబోలు. దీని బహువచ నం పాఱ్లు. రట్టగుడు-రట్టగుళ్ళు రాష్ట్రకూటి శబ్దభావమనీ, రెడ్డి శబ్దానికి పూర్వరూప మనీ భావిస్తున్నారు. రాష్ట్రకూటులనగా గ్రామాధికారులు గ్రామపెద్దలు. వీరు ఈ దానా నికి సాక్షులో నిర్వాహకులో అయిఉంటారు. అమలుపరిచేవారని తోస్తుంది. అన్నింటి కన్న వింతయైన భాగము 'తేనిశచ్చు' 'తేని' అనేది 'దేని' శబ్దపు పూర్వరూపం. తెలుగు శబ్దాలు పరుషాదిగా ఉండేవని చెప్పియున్నాము. ఏది అను సర్వనామముయొక్క సంబంధార్థకరూపం. దీనిని బట్టి సంబంధార్థక సర్వనామాల్తో వాక్యాలను కలపడం అనాటికే ఉండేదన్నమాట. అందుచేతనే నన్నయభట్టు 'ఏయది హృద్యము-ఆ కథయ వినగ ఇష్టము మాకన్' అని వ్రాసినాడు. ఇంక శచ్చు పదము. ఇది బహుశా బచ్చు

రూపాంతరమని భావించబడింది. ధ్వంసము చేయుట, పాడుచేయుట అని దీనియర్థము. ప్రాచీనమైన ట ధ్వని డ, ర, ళ వర్ణాలుగా మారిందని ఇనివరలో చెప్పియున్నాము. టెందులూరు-ళెందులూరు, డెందులూరు ఈ క్రమంలో. మొత్తంమీద చిలంకూరు శాసనము భాషా ప్రగతిలో కొంతముందుకు నడిచినట్లే కనబడుతూంది.

క్రీ.శ. 9 శతాబ్ది మధ్య వెడలిన పండరంగుని అద్దంకి శాసనం తెలుగు భాషను సాహిత్యాభిముఖంగా ముందుకు నడిపిస్తూంది. పండరంగడు తూర్పు చాళుక్య ప్రభువు గుణగవిజయాదిత్యుని (క్రీ.శ. 848-92) సేనాని. ప్రభువుచే నియుక్తుడై ఇతడురాజ్య దక్షిణ భాగంలో విజయాలు సాధించి అద్దంకిలో శాసనం ప్రకటించాడు. ఈశాసనంలో మొదటిమాటు తెలుగు పద్యరచన ఆవిర్భవించింది. గద్యవనం లోంచి పద్యారామం లోకి అడుగుపెట్టినట్లయింది. అద్దంకి శాసనంలోని పద్యము తరువోజ అనిగుర్తించారు.

భూపాలకుండు

పట్టంబు గట్టిన ప్రథమంబునేణ్డు, బలగర్వమొప్పగ బైలేచి సేన
పట్టంబు గట్టించి ప్రభు బండరంగు, బంచిన సామంత పడువతోబోయ
కొట్టముల్ వంద్రెండు గొనివేంగినాంటి
గొఱల్చియ త్రిభువనాంకుశ బాణ నిల్పి
కట్టెపు దుర్గంబుగడుబయల్ సేసి' కందుకూర్చెబజవాడ గావించెమెచ్చి

పండరంగు పరమ మాహేశ్వరుణ్డు ఆదిత్య భటారనికి ఇచ్చిన భూమి ఎనుబోది వ్రడ్ల అడ్డు పట్టునేల. దమ్మవరంబున దమ్మువులు పిని రక్షించిన వారికి అశ్వమేధంబు ఫలంబగు "

ఈ శాసనంలోని చారిత్రకాంశాలు విశదంగానే ఉన్నాయి. భాషా విషయంగా ఇది అత్యంత ప్రాముఖ్యం వహిస్తూంది. మొదటిది దీనిలో పద్యము గద్యము ఉండి నన్నయ పాటించిన చంపూ కావ్య పద్ధతికి నాందిగా కనబడుతూంది. రెండవది దేశీయ చ్ఛందమైన తరువోజలో ఉండుట. ఇది రెండు ద్విపద పాదాలకూడికచే ఏర్పడుతూంది. అనంతర కాలంలో అనగా శివకవుల యుగంలో ద్విపదకు ప్రత్యేక స్థానం లభించింది. కొట్టముల్ వంద్రెండు అన్నప్పుడు ప్రథమ మీద గసడదవా దేశ కార్యం జరిగింది. కొఱల్చు-దహించు అను పూర్వక్రియ వాడబడింది. ఆదిత్య భట్టారునకు భూమి ఇచ్చెను అనుటకు బదులు ఇచ్చిన భూమిఅని క్రియాజన్య విశేషణ పూర్వకర్మ ధారయ సమాసం చెయ్యబడింది. ఎనుబోది వ్రడ్ల (ట్ల) అడ్డు పట్టునేల అన్నప్పుడు

డలకార సంయుక్త రూపం కనబడుతుంది. డ్లు వర్ణాంతర రూపాలు-గుడి-గుడ్లు,మడి-మడ్లు వంటివి. ప్రాచీన భాషలో తరచుకనబడతాయి. ఇప్పుడు మనం వర్ణ సమీకరణం చేసి-అళ్ళు (ధాన్యము) గుళ్ళు ఈ విధంగా వాడుతున్నాము. నన్నయలో కూడ డ్లు వర్ణాంత రూపాలులేవు. దమ్మువులు-ధర్మశబ్ద భవము. నన్నయ కూడ ధర్మువులు అని వాడినాడు. అశ్వమేధంబు ఫలంబు అన్నచోట నన్నయ రచన గుర్తుకు వస్తుంది. యోగ క్షేమంబున తెఱగు. షష్ఠీ సమాసమున నగాగమము. ప్రాకృత భాషా ప్రభావం కొంత కనబడుతుంది. దమ్మపురంబున-ధర్మపురమున అనుటకు. ఇందలి తరువోజ పద్యము ఎగుడు దిగుడులు లేకుండ సమరీతినే సాగిపోయినది. ఈ విధమైన పద్య రచన ప్రచారము లోనికి రావడానికి అంతకుముందే ఒక శతాబ్దమో దానికి మించియో పూర్వము పద్యరచన తెనుగులో అవతరించి ఉండాలని ఊహి-చగలము.

గుణగవిజయాదిత్యుని కాలంలోనే వెలసిన కందుకూరు శాసనంలో సీస పద్యం అస్పష్టంగా కనబడు తూంది.

శ్రీ నిరవద్యుండు-చిత్రజాతసముండు
శివపదవరభక్త సేవితుండ ఖిలుండు

మొదటి చాళుక్య భీమరాజు ధర్మవరం శాసనంలో కూడా సీసపద్య భాగం కనబడుతూంది.

ఎడరిన బోయల నడవి సొనిపె
లోహాసనం బెక్కి-రాహను నొడిచిన
వల్లభు కొల్పున నెల్లనెఱుగ
పణ్డరంగు చూరె వణ్డరంగు

దీనిలో ప్రాసయతి నియమమూ, పద్యాంతమున ఆటవెలది వ్రాయుట చూడ నగును.

ఈ కాలపు ధర్మవర శాసనంలో నన్నయభట్టారకుడొక్కొ-క్క-ప్పుడు రచించు ఉన్నత సంస్కృత రీతి రచన ప్రత్యక్షమవుతుంది. శాసనం చివర 'గద్య' అనేపదం వాడబడడం చేత ఈ రీతి రచనను అప్పటి విద్వాంసులు గద్యగా పరిగణించిరేమో అను ఊహ పొడముతూంది.

'విజయాదిత్యపాద పద్మభ్రమరాయమాన శ్రీమత్క-దెయరాజు, గుణగణాభరణుండు దనకేని ఈశ్వరునకుం గార్తికేయుండుంబోలె......గరణమ్మున పండ

రంగును ఈ ధర్మనిర్వాహణోద్యోగమునకు బృహస్పతి సమానుండైన పెర్గడ కడెయ గారి కొడుకు బెజెయరాజు సమర్థుండని ఆత్మానుమతంబునంబంచిన'

దీనిలో సంస్కృతాంధ్రములను చక్కగా మేళవించి సంస్కృత సమాస భరితంగా తత్సమ శైలిలో గద్యనడిపించడం కనబడుతుంది. అనగా నన్నయకు ఇంచుమించు నూటఏబది సంవత్సరములకు ముందే ఆయన మెచ్చుకోదగిన వచన రచనా పద్ధతి వాడుకలోనికి వచ్చినదని చెప్పవచ్చును.

పద్యరచనా మార్గమునందు యుద్ధమల్లుని బెజవాడ శాసనాన్ని రెండవ మైలు రాయిగా అనుకోవచ్చును. సాహిత్య వికాస చర్చయందు నీరసములైన ఈ శాసనాల ప్రసంగం ఎందుకు అనే సందేహం తోచవచ్చును. నిజమే. ఇవి ప్రత్యక్షంగా సాహిత్యోదాహరణాలు కాజాలవు. పరోక్షంగా మాత్రం ఇవి పరిగణించదగి ఉన్నాయి. సాహిత్యానికి ముడిసరుకులైన భాష, ఛందస్సు వీటిల్లో పరిణామరూపంలో మనకు కనబడుతున్నాయి. ఈ శాసనాలు కూడా పూర్తిగా రసవిహీనాలు అనడం న్యాయం కాదు.

ఇవి సాధారణంగా ధర్మోద్దేశంతో వెడలినవి గనుక వీటిల్లో ధర్మవీరం చూడవచ్చును, పండరంగని శాసనంలో ఆతని యుద్ధ విజయాలు ప్రశంసింపబడ్డాయి కనుక దానిలో యుద్ధవీరం చూడవచ్చును ప్రకృతమైన బెజవాడ శాసనము. ఇది రెండవ యుద్ధమల్లుడను రాజు కాలమునాటిది. కావున క్రీ. శ. 927-34 నడిమికాలమున చెక్కబడియుండును. ఇది నన్నయ భట్టారకునికి సరిగా ఒక శతాబ్దము వెనుక. శాసన విషయము ఏమన యుద్ధమల్లుడు కుమారస్వామికి బెజవాడలో గుడియు మఠమును కట్టించెను. ఈ మఠంలో గొరగలు అనగా శివభక్తులు కానివారు నివసింప కూడదు. శైవేతరులు దీనికి భిన్నంగా ప్రవర్తిస్తే ఊరి పెద్దలున్నూ ప్రభువైన రాజున్నూ వారిని వెళ్ళగొట్టవలెను. ఈ మొదలైన అంశాలు ఉన్నాయి. ఈ శాసనము మధ్యాక్కర ఛందస్సులో వ్రాయనైనది. ఇదికూడా దేశీయ వృత్తమే. ఉదాహరణకు రెండు పద్యాలు

వెలయంగనియ్యోట్టు బస్సిమలినురై విడిసిన్నబోల
గల తానపతులును రాజు పట్టంబు. గట్టిన పతియు
నలియబై వారల వెల్వరించిన. యశ్వమేధంబు
ఫలము పేక్షించిన లింగమటిసిన. పాపంబు దమకు"

జనునుతచే[బ్రో]లనుండి బెజవాడ. జాత్రకు వచ్చి
త్రినయనసుతుడొండు సోటుమెచ్చక. తివిరియిన్నెలవ
యనఘుండు నేకొనియిందు ప్రత్యక్షమైనను నిచ్చ
గని మల్లదెత్తించె గుడియు మఠమును గార్తికేయునకు"

ఈ మధ్యాక్కరలయందు ఐదవ గణము మీద యతి స్థానముండుట గమనింప దగినది. నన్నయ కూడ ఈ నియమమునే పాటించినాడు. ఎఱ్ఱాప్రగడ కాలముననే పద్ధతి మారి నాల్గవగణంమీదనే యతిపాటించడం జరిగింది. అట్లా చెయ్యడంచేత పద్యము సమవిభక్తంగా నిలుస్తుంది. ఇటీవల కవి సమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు నన్నయ మార్గాన్ని అనుసరిస్తూ మధ్యాక్కరలలోనే తమ భక్తి శతకాల్ని వెలయించారు.

యుద్ధమల్లుని శాసనంలోకూడా ప్రాచీనమైన టవర్ణము కనబడుతూంది. ఇయ్యోట్టుటస్సి - ఈ శపథాన్ని భంగంచేసి. లింగం బటిసిన - లింగము నాశనము చేసిన అనే అర్థాలు స్ఫురిస్తున్నాయి. అటియు ధాతువు నుండియే ఇప్పటి అడపు, అడచు, అణమ శబ్దాలు ఏర్పడి ఉంటాయి. అస్సి అనేది అటియుగా ఎట్లా మారినది అనే దానికి ఒక ఉపపత్తి చెప్పవచ్చును. ప్రాచీన ద్రావిడ భాషలో ట ధ్వని పదాది యందుండినప్పటికీ అనంతర కాలంలో ఇది ఉచ్చారణక్లేశం కలిగించడంవలన దాని ముందు అకారము చేర్చిపలకడం ఆరంభించారు. అప్పుడది అటియుగా మారింది. రాజు శబ్దము అరసుఅయినట్లు, భాషావేత్తలు దీనిని అగ్రవర్ణాగమము అని చెప్తారు. తానపతులు - స్థానపతులు, జాత్ర - యాత్ర, ప్రాకృతభాషా ప్రభావమును చూపును. ద్వంద్వసమాసమునందు గసడదవా దేశము మన మెరుగుదుము. అన్నదమ్ములు, ఊరు పల్లెలు. కర్మధారయమునందు ఈయాదేశము ప్రచురముకాదు. ఈ శాసనమున ఒండుసోటు అన్నప్పుడు చకు సాదేశము చేయనైనది. ద్రుతాంతమైన శబ్దముపైగూడ గసడదవా దేశము ఇక్కడచేయనైనది. ఇందు ప్రత్యక్షమై-తెలుగులమీది సాంస్కృతిక పరుషములకు గసడదవా దేశమురాదు అనుటకు ఇది అపవాదము, మలినురై అన్నప్పుడు బహువచనమున రకారము. చిన్నయసూరి ఈ కార్యాన్ని దీర్ఘపూర్వాలో పథశబ్దములకే పరిమితముచేసినాడు. మలినులు అనుటకు మలినురు. లకారము రెండు మార్లు వచ్చుటచే వర్ణవిభేదనము జరిగినది. సంస్కృతమునందు జుహోత్యాదులలో ఈ కార్యము కన్పించును. లకారము అవ్యవహితముగ రాకున్నను మార్పు జరుగుట విశేషము. త్రికసమాసములు నన్నయకు సమ్మతములు. ఈ శాసనమునందు

ఇయ్యోట్టు. ఇన్నెలవుపంటివికలవు. అవధారణార్థమునందు నన్నయ అకారము వాడు చుండును. నీవే అని మనమిప్పుడు అనుచోట పూర్వులు నీవ అనెడివారు. శాసనము లోని ఇన్నెలవ (ఈ స్థలమే) ఇట్టిది. రాజు పట్టంబుగట్టిన పతి అను మిశ్రసమాసం చక్కగా కూర్చబడింది. కర్మాదులకు ప్రాధాన్య వివక్షయందు ధాతుజ విశేషణంబులు కర్తతోడంబోలె వానితోడ సమసించు అని చిన్నయసూరి చేసిన వ్యవస్థకు ఉదాహరణము కాదగియున్నది. ఇక్కడ కర్తృప్రాధాన్యమేతోస్తూంది. అశ్వమేధంబునఫలము, లింగం బటిసిన పాపము అను చోటులందు అగు ధాతువులేకుండగనే అన్వయమగు చున్నది. ఇదియే తెలుగు పద్ధతి. నన్నయ అగు ధాతువుచేర్చి సమాపకక్రియాసిద్ధిని సాధిస్తాడు. ఇన్ని భాషా విశేషాలు, ఛందోవిశేషాలు నన్నయకు పూర్వమే వాడుకలో నికివచ్చి ఉత్తమ సాహిత్యనిర్మాణానికి పునాదులు అయాయి.

ఇంతవరకు చూపిన శాసన సాక్ష్యము పూర్వాంధ్రమునకు చెందినది. తెలంగాణమునందును పద్య చ్ఛందస్సులు కొన్ని యెడల తోచుచున్నవి. కరీంనగరము, నిజామాబాదు మండలములలో వేములవాడ చాళుక్యులు పరిపాలన చేశారు. వీరియాస్థానము లోనే కన్నడ మహాకవి పంపడు ఉండేవాడు. ఈయన విక్రమార్జున విజయమను ప్రసిద్ధ కావ్యం వ్రాసి వేములవాడ చాళుక్య వంశీయుడైన రెండవ అరికేసరికి (క్రీ.శ. 945) అంకిత మిచ్చినాడు. పంపకవియనుజుడైన జినవల్లభుడనునాతడు ఇచ్చిన గంగాధర శిలాశాసనంలో మూడు తెలుగు కంద పద్యాలు లభించడం విశేషము. మచ్చుకు ఒక పద్యము.

"జినభవనము లెత్తించుట
జినపూజల్సేయు చున్కి జినమునులకు న
త్తినయన్న దానమవుట
జినవల్లభు బోలగలరె జినధర్మపరుల్"

ఈ కందములందు కొన్ని చిన్నచిన్న లోపములున్నను నన్నయకు ముందే కందపద్య రచన కూడ ప్రచారంలోకి వచ్చినదనుట సత్యము. జనగామ తాలూకా గూడూరు గ్రామమునందు లభించిన విరియాల వంశము వారి శాసనంలో మూడు చంపకమాలలు రెండు ఉత్పలమాలా పద్యములు వ్రాయబడినాయి. ఈ శాసనకాలము క్రీ.శ. 1000 సంవత్సర ప్రాంతమని పరిగణిస్తున్నారు. కాకతి మొదటి బేతరాజు ప్రశంస దీనిలో కన్పించును. ఇందలి ఒక పద్యము

"అరుదగునట్టి యెఱ్ఱ నృపునంగన గామమసాని యొక్కమే
ల్గరుదని చేతభూవిభుని గాకతి
వల్లభు చిన్నవాసిదా।
బరగగ జేతబట్టి ఘను బల్లవరాయని యో నిజాబ్జభా।
స్కరనిభు చక్రవర్తి గని కాకతినిల్పుట గోటి సేయదే"

ఈ శాసనమునందలి కొన్ని దేశ్యపదముల యర్థము సులభ గ్రాహ్యముగాలేదు. అయినను చక్కని నడకగలిగి వృత్త రచనయందు కవుల ఆరితేరిన సన్నివేశమును ప్రదర్శించును. ఈ విధముగ దేశి పద్యములును సంస్కృత వృత్తములు కూడ నన్నయకు ముందే తెలుగు సాహిత్యరంగంలో అవతరించిన స్థితి చూసినాము.

## నన్నయ-సాహిత్య భాష

ఇటువంటి పూర్వరంగంతో నన్నయభట్టు మహా సాహిత్య సృష్టికి పూను కొన్నాడు. సాహిత్య భాష విషయంలో పూర్వుల అభిప్రాయాలు కొంతవరకైనా ఊహించవచ్చును.

1. సాహిత్య భాష ఉదాత్తంగా ఉండాలి. వారు సృష్టింపదలచిన ఉదాత్తసాహిత్యానికి అనుగుణంగా ఉండాలి.
2. అది దోషరహితంగా ఉండాలి. సామాన్య వ్యవహారానికి భిన్నంగా ఉండాలి.
3. సాహిత్య భాష అలంకృతమై యుండాలి.

ఈ భావాన్నే ఆంధ్రశబ్ద చింతామణి ఇట్లా ప్రకటించింది. 'తదదోషౌ, పరిష్కృతౌ చ వాగర్థౌ' విశ్వశ్రేయఃకావ్యమ్-కావ్యము సమస్త శ్రేయస్సులను ఇచ్చునది. ఆ శ్రేయస్సులివి: యశస్సు, అర్థలాభము, అమంగళశాంతి, అలౌకికానందము, ఉపదేశ ప్రదాయిత్వము. కావ్యము లోకహితం కొరకు అని ఆధునికులు దీనిని అన్వయిస్తున్నారు. అది కూడా గ్రాహ్యంగానే ఉంది. అట్టిలోకహిత ప్రయోజనం కల కావ్యము దోషరహితము, అలంకార సహితము అయిఉండాలని ప్రాచీనుల మతము. ఈ నిర్వచనము సంస్కృతాలంకారిక నిర్వచనాలకి అనుగుణంగా ఉంది. కావ్య ప్రకాశికా కారుడైన మమ్మటుడు చెప్పాడు:"అదోషములు, గుణసహితములు, ఎక్కడేనా అలంకార రహితములు అగుశబ్దార్థాలు కావ్యము". ఎక్కడేనా అలంకార రహితము అని చెప్పడం చేత

తరుచు అలంకార భూషితంగా ఉండాలనే ఆయన మతముగా తోస్తుంది. అయినా బలాత్కారంగా సందర్భరహితంగా అలంకారాలు చొప్పించకూడదనేది ఈయన హృదయంగా కనిపిస్తుంది. ఈ మతాన్నే ఆంధ్రశబ్ద చింతామణి కూడా ఈషద్భేదంతో ప్రవచించింది. నన్నయ ప్రసక్తిలో ఆంధ్రశబ్ద చింతామణి ప్రసంగమెందుకు అని ప్రశ్న వస్తుంది. ఈ గ్రంథం నన్నయ కృతమని కాదని వాదోపవాదాలు ఉన్నాయి. అది యెట్లయినా ఈ వ్యాకరణ గ్రంథము ప్రాచీనుల అభిప్రాయాలకు చాలా సన్నిహితంగా ఉండడం చేత దానిని మనం పరిగణిస్తున్నాము. కావ్య నిర్మాణంలో రససిద్ధియే ముఖ్యమని, కవులు యావచ్ఛక్తులు వినియోగించి కావ్యాన్ని రసవంతంగా చెయ్యాలని ఈ గ్రంథం ఉద్బోధించింది. 'సావా గ్యారసవృత్తిః । సాధ్యోహిరసోయథాయథం కవిభిః ॥' ఇది చాలా ప్రశంసనీయంగా ఉంది. ఆ కాలపు పెద్దల అభిరుచులెట్లాఉండేవో చింతామణి సూచిస్తూంది. 'స్వస్థాన వేషభాషాభి మతాస్సంతోరసప్రలుబ్ధధియః లోకే బహుమన్యంతే వైకృత కావ్యాని చాన్యదపహాయ' సజ్జనులు స్వదేశమునందును స్వవేషమునందును స్వభాషయందును అత్యంత ప్రీతిగలవారై ఇతర దేశవేషములను ఇతర భాషలను విడిచి రసలుబ్ధులై ఆంధ్ర కావ్యములను సబహుమానముగా ఆదరించుచున్నారు. నన్నయభట్టు ఈ సజ్జన కోటిలోని వాడేకదా. ఆయన స్వదేశాభిమానాన్ని మూలభారతంలో లేకపోయినా ఆంధ్ర మహాభారతం ఆది-8-139 'దక్షిణ గంగనా దద్దయు నొప్పిన' అనే పద్యంలో ప్రకటించుకొన్నాడు. ఆంధ్రదేశపునదియైన గోదావరిని, పుణ్యక్షేత్రములైన భీమేశ్వర శ్రీశైలములను కర్మభూమియైన వేగీదేశాన్ని ఎట్లో ప్రసక్తి కలిగించుకొని వర్ణించాడు. ఆయన స్వభాషాభిమానానికి ఆంధ్ర మహాభారతమే శాశ్వత సాక్ష్యము. ఆంధ్ర సజ్జనులు తెలుగు కావ్యాలనేకాక సంస్కృత భాషా కావ్యాలనుకూడా ఆదరిస్తారని శ్లోకంలోని 'చ' అనే సముచ్చయం సూచిస్తూందని అహోబలపతి వ్యాఖ్యానించాడు. ఇది యుక్తముగానే ఉంది. అన్యదపహాయ-ఇతరములైనవి విడిచి-అన్నప్పుడు ఆ ఇతరములేమై ఉంటాయి. ప్రాకృత కావ్యములు కావచ్చును. తమిళ కన్నడ కావ్యాలు కూడా కావచ్చును. ఎందుచేతనంటే చారిత్రకంగా తమిళులు, కన్నడులు రాజరాజ నరేంద్రుని కాలంలో తెలుగుదేశం మీద ప్రభావం కలిగించగలిగి ఉన్నారు. రాజరాజనరేంద్రుని తల్లి కుందవాంబ తమిళ చక్రవర్తికూతురు. రాజరాజ నరేంద్రుని భార్య అమ్మంగదేవి తమిళరాజ కుమార్తె. ఈ సంబంధాలచేత ద్రావిడజన, ద్రావిడ భాషా ప్రభావాలు ఆంధ్రదేశం మీదపడి ఉంటాయి. ఇంక కన్నడ దేశాన్ని పాలిస్తూన్న పశ్చిమ చాళుక్యులు వేంగి దేశంపై తరుచు దాడులు చేస్తూ రాజరాజుకు అలజడి కలిగించేవారు. రాజరాజనరేంద్రుని రాజ్యాంత కాలంలో ఈతడు

కర్ణాటకుల ఆధిపత్యాన్ని అంగీకరించవలసి వచ్చిందని వారి ప్రతినిధిగానే నారాయణ భట్టు వేగి దేశానికి వచ్చాడని చారిత్రకులు చెప్పుతున్నారు. వీరిమూలంగా ఆంధ్ర భాషకు కన్నడ సంబంధం తప్పక ఏర్పడి ఉంటుంది. ఇంత అయినప్పటికీ నన్నయ రాజరాజులు తమ ఆంధ్రదేశాభిమానాన్ని, ఆంధ్ర భాషాభిమానాన్ని వదులుకోక తెలుగులో స్వతంత్ర సారస్వత సృష్టికి బద్ధకంకణులయ్యారు. ఇతర భాషా కావ్యాల్ని వీరు విడిచినా వాటిలో ఉండే గుణాలచేత ఆకృష్టులై ఆ గుణాలను తెలుగు వాఙ్మయంలోకి ప్రవేశపెట్టడానికి. వెనుతీయలేదు. ఆంధ్రమహాభారత భాషను కల్పించుకోవడంలో నన్నయభట్టు కన్నడ మహాకవుల మార్గాలను ఆకళించుకొని స్వంతం చేసుకొన్నాడని తజ్ఞులు అంటున్నారు. విజ్ఞులు తమ వ్యక్తిత్వాన్ని త్యాగం చెయ్యకుండా గుణం ఎక్కడ కనబడినా దాన్ని గ్రహిస్తూనే ఉంటారు.

ఆంధ్ర శబ్ద చింతామణి ఉద్దేశించిన సజ్జనులలో ఇద్దరిని గుర్తుపట్టాము. వారు నన్నయ రాజరాజులు. ఈ విధంగా స్వదేశ స్వభాషాభిమానంతో దీపిస్తూన్న సజ్జనులు ఇంకా చాలామంది ఉన్నట్లు నన్నయభట్టారకుడు తెల్పుతున్నాడు. వీరి నాతడు 'సత్సభాంతరములు' అని నిర్దేశించాడు. ప్రత్యేకంగా వారినొక పద్యంలో స్తుతించాడు.

"పరమ వివేక సౌరభవిభాసిత సద్గుణపుంజ వారిజో
త్కర రుచిరంబులై సకల గమ్య సుతీర్థములై మహామనో
హర సుచరిత్ర పావన పయః పరిపూర్ణములైన సత్సభాం
తర సరసీవనంబుల ముదం బొనరంగొనియాడి వేడుకన్ ఆది-1-24

ఈ సత్సభాంతరములు ఆనాటి విద్వత్పరిషత్తులని భావించవలెను. వీరుకాక రాజరాజ నరేంద్రుని సభలో బహుశాస్త్ర పారంగతులైన విద్వాంసులున్నారు. 'దేవా నీయ నుమతంబునను విద్వజ్జనంబుల యనుగ్రహంబునంజేసి నా నేర్చిన విధంబున నిక్కావ్యంబు రచియించెదను' అన్నాడు భట్టారకుడు. వీరిలో కొందరు దేశభాషలో భారతము వంటి మహాగ్రంథము రచించుటను వ్యతిరేకించిన వారును ఉన్నట్లున్నారు. దీనిని కూడ కవియే సూచించియున్నాడు

'పాయక పాకశాసనికి భారత ఘోర రణంబునందు నా
రాయణునట్లు వాసిగ ధరామర వంశ విభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయ దురంధరుడుం దనకిప్పుడున్ సహా
ధ్యాయుడునైనవా డభిమతస్థితి తోడయి నిర్వహింపగన్॥ ఆది-1-25

దేశభాషా యుద్ధంలో భారత యుద్ధమునందు అర్జుననకు శ్రీకృష్ణునివలె నారాయణభట్టు అను మహావిద్వాంసుడు నన్నయకు అండగా నిల్చినాడట. దేశభాషా కావ్య రచనను వ్యతిరేకించిన విద్వాంసులు ఎందుకు వ్యతిరేకించారో నన్నయభట్టు చెప్పలేదు. ముఖ్యంగా రెండు కారణాలు చెప్పవచ్చును. (1) సంస్కృత భాషయందు వారికిగల అపార గౌరవము. విశ్వాసము. (2) మహాభారతం వంటి ఉద్గ్రంథ రచనకు దేశభాషయైన తెలుగు సమర్థమైనది కాదని ఇటువంటి చిత్తవృత్తి అన్ని కాలాల్లోను ఉంది. ఇన్నూరు సంవత్సరాలనుండి ఆంగ్లభాషా తేజస్సుచే మిరుమిట్లుగొన్న చూపులుకలవారు మనవారిలో చాలామంది దేశభాషలో ఆ విజ్ఞానాన్ని సంతరించడం అసాధ్యమని ఇప్పటికీ వాదించడం లేదా. ఆవేదనపడడం లేదా. నన్నయ రాజరాజుల కాలంలో కూడా ఇట్లాగే జరిగిఉంటుంది. వారి ప్రాతికూల్యము దేశభాషకు కాదు, దేశభాషా సామర్థ్యమునకు. నన్నయ నారాయణభట్టులు, ఈయుద్యమానికి సుముఖంగాఉన్న పండిత పరిషత్తులు అందరూకలిసి దేశభాషా సామర్థ్యాన్ని పెంపొందింప జేయడానికి పూనుకొన్నారు. విజయం సాధించారు. రామరాజభూషణుడు చెప్పినట్లు బహుళాంధ్రోక్తిమయ ప్రపంచాన్ని' ఆవిర్భవింపజేశారు.

## కావ్యభాషా నిర్మాణము

కావ్యోచితమైన దేశభాష నిర్మించుకోవడంలో నన్నయాదులు రెండు మూడు నియమాలు పెట్టుకొన్నారు:

1) సుశబ్దప్రయోగము లేదా ప్రామాణిక శబ్దప్రయోగము.

2) తెలుగులో కనబడక, కావ్య ప్రయోజనాలకు అవసరమైన శబ్దజాలాన్ని సంస్కృత భాషనుంచి అవతరింప చేసుకోవడం.

3) అట్లా ఎరువు తెచ్చుకోడంలో ప్రసిద్ధ సంస్కృత పదాల్నే ఎన్నుకుంటూ మారుమూలపదాల్ని పరిహరించడం.

విలోమక్రమంలో వీటిని కొంచెము వివరిస్తాము. మారుమూల పదాల్ని పరిహరించడం. ఆంధ్రశబ్ద చింతామణి ఈవిషయాన్ని స్పృశించింది.

'పేచోషాదికశబ్దాన్ ప్రవ్యాహరంతు శబ్దజ్ఞాః
ఇహతు ప్రవ్యాహార్యమే సంకేతిత సుప్రసిద్ధ మేవపదమ్'

పేచ, ఊష మున్నగు కొన్ని శబ్దాలు ప్రాచీన వేదభాషలో ఉండేవి. లౌకిక సంస్కృతంలో జారిపోయాయి. అందుచేత వీటిని అప్రయుక్త శబ్దములు అన్నారు. ఇటువంటి అప్రయుక్త శబ్దాలు రసప్రధానమైన కవిత్వంలో ప్రయోగార్హాలు కావు. వాటి అర్థం సులభంగా తెలియదు. తత్క్షణ రసస్ఫూర్తికి అవి విలంబ కారణములు అవుతాయి. శాస్త్రవిదులు, పండితులు తమ శాస్త్ర ప్రయోజనాలకు వాటిని వాడితే వాడుదురుగాక అందరికీ సులభంగా అర్థమయి రసచర్వణకు తోడ్పడే మృదుపదాలే వాడాలని ఈ సూత్ర పర్యవసానము. నన్నయభట్టు ఈమాట ప్రత్యక్షంగాచెప్పకపోయినా ఆచరణలో పాటించాడు. అందుచేతనే మృదు సులభసంస్కృత శబ్దాల్తోకవిత్వంకూర్చి తనకాలానికే కాక అన్నికాలాల వారికి మార్గదర్శకుడయ్యాడు. చింతామణి పేర్కొన్న పేచోషాదిక శబ్దాల పట్టికలో ఇంకా కొన్నింటిని చేర్చవలసి ఉంది. సంస్కృతంలో మల్లేనే తెలుగులో కూడా మిక్కిలి ప్రాచీనములయి సులభంగా అర్థంకాని పదాలను కూడా ఎల్లరకు తెలియవలసిన కవిత్వంలో పరిహరించాలి. అచ్చు, అస్సివంటి అప్రసిద్ధ రూపాలు, సర్వబాదా పరియారువు (సర్వబాధా పరిహారముగా) వంటి వ్యావహారిక రూపాలు కూడా నన్నయ ఇందుకే పరిహరించి ఉంటాడు. ఈ కోటిలోకే వస్తాయి అన్య భాషాశబ్దాలు. ఇక్కడ అన్యభాషా శబ్దాలంటే తమిళ కన్నడ భాషాపదాలు. కొన్ని సందర్ప్రాంతాల్లో కొన్ని సందర్భాల్లో కొందరు తెలుగువారు తమిళ కన్నడ భాషాపదాలను వాడవచ్చును. కాని తెలుగువారందరూ చదివి ఆనందించవలసిన కవిత్వంలో ఇవి అర్థావగతికి అవరోధంకలిగించి రసానందమునకు అంతరాయాలు అవుతాయి. కావున పరిహార్యములు, శివకవులు జానుతెనుగు అనే ఆదర్శంతో మారుమూల తెలుగు పదాలను, అన్యభాషా పదాలను కవిత్వంలో ప్రయోగించడంచేత వారి గ్రంథాలు సర్వజనాదరణను పొందలేక పోతున్నాయి. తిక్కన సోమయాజికూడా ఇటువంటి అప్రసిద్ధ పదాలను వాడడాన్ని నిరసించాడు. వాటిని ఆయన 'ప్రాతపడ్డమాటలు' అన్నాడు. నిఘంటు మాత్రదృశ్యములైన సంస్కృత పదాలు కూడా ఈ శ్రేణిలోకే వస్తాయి. మాండలిక పదాలు ప్రధాన భాషాంతర్గతాలయినప్పటికీ అవి అప్రసిద్ధములైన వైతే అర్థస్ఫురణకు విలంబ హేతువులే అవుతాయి. ఇన్నినిషేధాల్తో రచనచెయ్యడం సులభంకాదు. మహాకవికి అప్రయత్నసిద్ధంగానే రసానుకూలమైన పదం ద్యోతక మవుతుంది.

కావ్యభాషా నిర్మాణంలో నన్నయ కైకొన్న రెండవచర్య పదజాలాన్ని విస్తరింప చేసుకోవడము. భావపునరుక్తి మల్లేనే శబ్దపునరుక్తి కూడా కవిత్వంలో రక్తికట్టనీయదు. భావచమత్కృతి వలెనే శబ్ద వైవిధ్యం ఉంటే రచన అందగిస్తుంది. అదీగాక

మహాభారతంవంటి విజ్ఞాన సర్వస్వ గ్రంథంలో తెలుగుభాషలో అచుంబితము లైన ఎన్నో విషయాలున్నాయి. మతము, వేదాంతము,రాజనీతి, యుద్ధతంత్రము మొదలైన బహుళ విషయాలున్నాయి. వీటినన్నింటిని అప్పుడు తెలుగులో ఉన్న పదజాలంతో చెప్పడం సాధ్యపడియుండదు. అందుకోసమే నన్నయభట్టు ఆయా సందర్భాలకు అవసరమైన పదజాలాన్ని సంస్కృతభాషలోంచి ఎరువుతెచ్చుకున్నాడు. ఆయన ప్రదర్శించిన జాగరూకత ఏమిటంటే ఆ సంస్కృత పదాలు అనభ్యస్తాలు కాక తెలుగువారికి కొంతవరకైనా పరిచితమై ఉంటాయి. ఈ ప్రక్రియలో కన్నడభాషా మర్యాదలు నన్నయకు కొంత తోడ్పడి ఉంటాయి. 'ఇంచుక్' అనే ఆగమనాన్ని సంస్కృత పదాలకు చేర్చి వాటిని తెలుగులో ప్రయోగార్హాలుగా చేసుకొన్నాడు. ఈ విధానము నన్నయకు ముందు లేకపోలేదు. రక్షించు వంటి ధాతువులు శాసనాల్లో ఉన్నాయి. కొన్నిటికి తెలుగు ధాతువులను సహాయ ధాతువులుగా చేసి శబ్దపల్లవ ధాతువుల్ని కల్పించడము. ప్రసారంచేయు శాసన భాషలోనే కన్పించింది. సహాయ ధాతువులుగా చేయు, ఇచ్చు, ఇంచు, ఇల్లు, తెంచు (ఏకుదెంచు) పడు, పరచు, వంటివి పెక్కు ఉపకరించాయి. తత్సమధాతువు లేర్పడే విధానాన్ని ఆంధ్ర శబ్ద చింతామణి ఉపకృతి,సంవృతి, పరిణతి క్రియలక్రింద విభజించి నిరూపించింది. నామప్రకరణంలో అజంత హలంత శబ్దాలు ఏర్పడే విధమూ, వాటి బహువచనరూపాలు. విభక్తి ప్రక్రియ వీటినన్నింటినీ నన్నయ ప్రమాణీకరించాడు. వ్యాకరణ గ్రంథాల్లో ఇవి వివరింపబడిఉన్నాయి. నన్నయవాడిన కొన్ని విభక్తి ప్రత్యయాలు ఇప్పుడు వాడుకలోలేవు. చేసి, మెయి, పొంటెన్, కోలెన్ వంటివి. కారక విషయంలోకూడా అతడు పెక్కుచమత్కృతులు చేశాడు. సంస్కృత సంప్రదాయాన్ని మక్కువతో స్వీకరించాడు. ఉపయోగంబునందాఖ్యాతకు తోడవర్ధక మగుట. సంధి, సమాసము వంటి వాటిల్లో కూడా నన్నయ దిద్దిన మార్గమే శతాబ్దాల వరకూ నిలిచి పోయింది. అనగా తెనుగు భాష హృదయాన్ని ఆయన ఆకళింపు చేసుకున్నంతగా ఆతని పూర్వులుకాని అనంతరులుగాని ఆకళింపుచేసుకోలేక పోయారు. అందుచేతనే వాగను శాసన, శబ్ద శాసన బిరుదాలు ఆయనకు అన్వర్థమయి రూఢమయినాయి. విపుల శబ్ద శాసన బిరుదము తనకున్నట్లు నన్నయయే చెప్పియున్నాడు.

ఎటువంటి సంస్కృత పదాలు తెలుగులో ప్రవేశించవో శబ్దచింతామణిచెప్పింది. 'నపదాన్యవ్యయసుప్తిఙ్క్త్వాతుమునామ్' అవ్యయములు, సుబంతములు, తిఙంతములు, క్త్వాప్రత్యయములు, తుమున్నంతములు తెలుగులో వ్యస్తంగా వాడబడవు. సంస్కృత వాక్యాన్ని మొత్తంగా తీసుకొని దానికి అనుధాతువు చేర్చి వాడుకోవచ్చును. దీనినే అను

కరణం అన్నారు. దీని వలన సంస్కృత సూక్తులు అనుకరణం చేసి యథాతథంగా తెలుగులో వాడుకొనే సౌకర్యం ఏర్పడింది. 'అంగాదంగా త్సంభవసి' యను వేద వాక్యాన్ని (ఆది-1-36) నన్నయ వాడినాడు. ఆంధ్ర శబ్ద చింతామణిలో వాచ్యంగా చెప్పబడక పోయినా మణిప్రవాళ శైలి తెలుగులో నిషిద్ధమయింది. మణిప్రవాళ మనగా సంస్కృత విభక్తులతో కూడిన శబ్దాన్ని తెలుగులో యథాతథంగా వాడడం. ఆ శబ్దానికి తత్సమ రూపం చెయ్యకుండా సంస్కృత విభక్తితో ప్రయోగించడం. ఇట్టి శైలి కవిలోకంలో కొంత ప్రచారంలో ఉండేది. మలయాళ భాషయందు ఎక్కువగా కలదని చెప్పుతారు. తెలుగు శాసనాల్లో కూడా ఒకటి రెండు చోట్ల వచ్చింది. గొగ్గిభటరళ దక్షిణ భుజాయమానుంబయిన ఉజేని పిశాచనామధేయుంబు...ఏబువ విషయంబేళన్ తస్యమాతా (త్రా) దత్తం గోవృషాణ భట్టారహో శతపంచాశతిక్షేత్రం—విక్రమాదిత్యుని తురిమెళ్ళ శాసనము. నన్నయ ఇట్టి శైలిని ఆదరించలేదు. పాల్కురికి సోమనాథుడు తన వృషాధిప శతకంలో ఉదాహరణగా పేర్కొన్నాడు.

ఆంధ్ర శబ్ద చింతామణి సూత్రాల ప్రకారం సాధురూపాలుగా కనపడుతూ నన్నయలో నేడు కాన్పించనివి ఒకటి రెండు కలవు. పదాది యందు య కారముండడం సాధువవుతూంది. యెవడు, యెక్కడ, యెప్పుడు వంటివి. ముద్రిత భారతంలో ఇవి కనబడవు. అట్లే బహువచనంలో డ్లు వర్ణాంత రూపాలు ఇప్పుడు భారతంలో లేవు. శాసన భాషలో ప్రచురంగా ఉండేవని చూపెట్టి యున్నాము. ఆడ్లు, ఊడ్లు, ఎంగిడ్లు వంటివి. వీటి స్థానంలో ఊళ్ళు, ఎంగిళ్ళు రూపాలే చెల్లుతున్నాయి. ద్రుతానికి అచ్చు పరమైనప్పుడు ద్విత్వం రావడం కూడా నన్నపార్యునకు సమ్మతము. అను+ఇష్ట సఖియను దానిని అన్నిష్ట సఖి యని ఆచార్యుడు సంధి చేసినాడు. దీనిని బట్టియే పోతనాదులు 'సర్వమున్నతని దివ్యకళామయమంచు' వంటి ప్రయోగాలు చేశారు. అయినా ఇది సార్వత్రికము కాదు. కాదాచిత్కము.

కావ్య భాష విషయంలో ప్రాచీనులు పెట్టుకొన్న మొట్టమొదటి నియమము సుశబ్ద ప్రయోగము, అప శబ్ద నిరాకరణము. ఈ సుశబ్దాపశబ్ద విచారం సంస్కృతం నుంచి తెలుగుకు వచ్చింది. పతంజలి మహాభాష్యంలో దీనిని యుక్తి యుక్తంగా అసాధారణ వైదుష్యంతో సుదీర్ఘంగా చర్చించి నిర్ణయించారు. సుశబ్ద ప్రయోగాన్ని ఇట్లా ప్రసంసించారు. ఏకశ్శబ్దః సమ్యక్ జ్ఞాతః సుష్ఠు ప్రయుక్తః స్వర్గే లోకే కామధుగ్భవతి" అపశబ్దం ప్రయుంజానో రౌరవంనరకం వ్రజేతి-నమ్లేచ్ఛితవై నాప భాషి

తమైె" ఇత్యాదివాక్యాలు ఉన్నాయి. ఒక సుశబ్దాన్ని చక్కగా ప్రయోగిస్తే అది కామ ధేనువు వలె స్వర్గ లోకము నందును భూలోకము నందును అన్ని కోరికలకు ఇస్తుంది. అపశబ్ద ప్రయోగం చేత రౌరవాదినరకములు పొందుతారు. మ్లేచ్ఛుల వలె ఆచరింప కూడదు. అపశబ్ద ప్రయోగం చెయ్యరాదు, ఇంతగా సుశబ్దాపశబ్ద స్తుతినిందల చేత ప్రాచీనులు భాషా పారిశుద్ధ్యాన్ని సంరక్షించడానికి యత్నించారు. అయితే ఒక సమస్య వారినే ఎదుర్కొన్నది. ఈ నిష్ఠ ఎల్లప్పుడూ సాధ్యమా. నిత్యజీవితంలో అనగా నిత్య వ్యవహారంలో అపశబ్దం ప్రయోగించకుండా జరుగుతుందా. ఇది ఆచరణ సాధ్యమా అని ప్రశ్నించుకొని సమాధానం కూడా వారే ఇచ్చారు.'సర్వోప్యప శబ్దనిషే ధంః క్రతు విషయఏవ న తు వ్యవహార విషయః' అపశబ్ద ప్రయోగ నిషేధము యజ్ఞ సంబంధి అయినది. వ్యవహార విషయము కాదు అని పరిష్కారం చేశారు,

అయితే సారస్వతమునందే నియమము పాటించాలి. ఇది క్రతువుకాదు. నిత్య వ్యవహారమా ? అదీకాదు. సాహిత్య సందర్భంలో ఏ నియమం పాటించాలి అన్న ప్పుడు వాల్మీకి దగ్గరనుండి కవిసమాజం అంతా సుశబ్ద ప్రయోగంవైపే మ్రొగ్గింది. కాళిదాసమహాకవి రూపకాన్ని 'కాంతం క్రతుంచాక్షుషం' అని వర్ణించాడు. దేవతలు నాటకప్రయోగాన్ని మనోజ్ఞము, కంటికి సంబంధించినది అయిన క్రతువుగా మునులు పరిగణిస్తారు అన్నాడు మహాకవి. సారస్వతము రసప్రమేయము కలది. రసము బ్రహ్మ స్వరూపము. అందుచేత కావ్యమునందలి భాషకూడా సుశబ్దఘటితమై యుండాలి అనేది అనాదిగా కవిలోకంలో ఏర్పడిన అలేఖ్య నియమము. కావ్యనిర్వచనంలో దీనిని అలం కారికులు ఘటించారు. తద దోషౌ శబ్దార్థౌ. క్రతు విషయంలో అపశబ్ద ప్రయోగం వలన దేవతలు అసంతృప్తి చెందుతారు. లౌకికమైనకావ్యంలో ఏమాత్రపు అపశబ్దం దొర్లినా అది కావ్యసౌందర్యాన్ని విచ్ఛేదం చేస్తుంది. నన్నయభట్టారకునకు ఎన్నో శతాబ్దాలముందే ఈ సంప్రదాయం ఏర్పడి ఉంది. ఆతడు దాన్ని విశ్వసించినాడు. అనుష్ఠించినాడు. ఆతడు అన్యథాచేస్తే సమకాలిక విద్వాంసులు ఆ కావ్యాన్ని మెచ్చరు. 'దేవా ః నీయనుమతంబునను, విద్వజ్జనంబుల యనుగ్రహంబునను నానేర్చిన విధంబున నిక్కావ్యంబు రచియించెద' అన్నాడు నన్నయ.

ఈ సుశబ్ద నిర్ణయం చెయ్యడం ఎట్లాగ. భాష ఎక్కడ ఉన్నది. వైయాకర ణులు దానిని సృష్టించగలరా ఇత్యాది ప్రశ్నలకు ప్రాచీన భారతీయులు శాస్త్రీయమైన సమాధానాలు కనుగొన్నారు. మహాభాష్యమునందు 'సిద్ధే శబ్దార్థ సంబంధే' అనే ఘట్టంలో తలస్పర్శగా దీనిని చర్చించారు. లోకంలో కొన్ని వస్తువులు ఉత్పాద్యము

లైనవి ఉన్నాయి. కుండలు కావలసినవాడు కుమ్మరివాని వద్దకుపోయి తనకు కొన్ని కుండలు మూకుళ్ళు చేసి ఇమ్మని అడుగవచ్చును. ఆ విధంగా ఒక కవిగాని రచయిత గాని వైయాకరణుని దగ్గరకు వెళ్ళి నాకు కొన్ని శబ్దాలు నిర్మించి పెట్టమని అడగడం లేదు. ఘటశరావములవలె శబ్దములు ఉత్పాద్యములు కావు. అది లోకమునందే ఉన్నాయి. వాటి అర్థాలు కూడా నియతమై ఉన్నాయి. లోకమునుండే భాషా సామగ్రిని గ్రహించి ప్రయోగించాలి కాని ఎవరికి వారు ఎంత గొప్పవారైనా భాషను క్రొత్తగా నిర్మించలేరు. ఈ భావాన్నే ఆంధ్ర శబ్ద చింతామణి కూడా 'సిద్ధిర్లోకాత్ దృశ్యా, లోకోనన్యాదృశశ్చ నిత్యశ్చ' శబ్ద సిద్ధి లోకమునందే చూడవలెను. లోకము మార్పు నొందునదికాదు. నిత్యమైనది. భాష యొక్క ఆద్యంతము లెవరికీ తెలియవు గనుక అది నిత్యమని ఒప్పుకోవచ్చును. భాష మార్పు నొందదు అనే విషయం అధుని కులు ఒప్పుకోవడం లేదు. కాలక్రమాగతంగా భాష మారుతూనే ఉంది. వేద భాష కును తన కాలపు సంస్కృతానికి గల భేదాన్ని పాణిని మహర్షి గుర్తించి సూత్రబద్ధం చేసియే ఉన్నాడు. వేదభాషను ఛందస్సు అనీ తనకాలపు పలుకుబడిని 'భాష', అనీ ఆయన సంకేతం చేసుకొన్నాడు. లోకంవలనే శబ్ద సిద్ధి అవుతూంటే ఇంక వ్యాకరణం వ్రాసే శ్రమ అధ్యయనం చేసే శ్రమ ఎందుకని ప్రశ్నించుకొని పతంజలి దానికి సమాధానం చెప్పాడు, సుశబ్దాపశబ్ద జ్ఞానం కోసం వ్యాకరణం తెలుసుకోవాలి. వ్యాకరణము వినా ఈ జ్ఞానం కలిగే మార్గం లేదు. అన్నాడు.

చింతామణికారుడు కూడా దీనినే అనుకరించాడు. 'అని యమాద్గ్రామ్యంహి-యత్వాపభ్రంశః'. భాషా ప్రయోగమును వ్యాకరణాదులచే నియమింపకపోతే అది గ్రామ్యముగా తయారవుతుంది. దానినే అపభ్రంశమంటారు. అది ప్రయోగార్హము కాదు. ఆంధ్ర భాష నాలుగు విధములని చెపుతూ-తజ్జా, సమా, దేశ్యా, గ్రామ్యా—తద్భవ, తత్సమ, దేశ్య, గ్రామ్య విభాగాలను చింతామణి పేర్కొంది. ఇందులో గ్రామ్యం కావ్య ప్రయోగార్హం కాదని ప్రాచీనుల మతము. అథర్వణుడనే మరియొక వైయాకరణుడు-తిక్కన కాలము వాడని భావిస్తారు-ఈ విషయంలో మరికొంత విశాల దృష్టిని ప్రకటించాడు.

"పామరాది ప్రయుక్తం యత్తద్గ్రామ్యమభిధీయతే కవితోపాశ్రితం దోషం నైవకించిత్సహామహే అహేయ మన్యదేశీయం యత్తదేవ ప్రయుజ్యతే గ్రామ్యమ్ తత్ర ద్విధే సాధు కరకంఠీ ముఖాహితాః"

పామరులు వాడుకునే శబ్దరూపం గ్రామ్యమని చెప్పబడుతూంది. కవిత్వంలో దోషాన్ని ఎంత మాత్రమూ సహింపము. అన్యదేశ్య శబ్దాలు కూడా రసవంతమైన వైతే వాడుకోవచ్చును. గ్రామ్యం కూడా కొన్ని సందర్భాల్లో ప్రయోగార్హము అవుతూంది. కరకంఠుడు వంటి శబ్దాలు మాకు సమ్మతములు అని భావము. వ్యవహారంలో ఉండే భాష అంతా గ్రామ్యమని అథర్వణుడు నిరసించక పామరులు మాట్లాడే శబ్ద రూపం గ్రామ్యమని వివరించడం బాగుంది. ఇటువంటి గ్రామ్యాన్ని కూడా కొన్ని సందర్భాలలో కావ్యంలో వాడవచ్చును అన్నాడు. అనగా గ్రామ్య పాత్రల సంభాషణ మును అనుకరించి చెప్పేటప్పుడు వారి భాషయే వాడితే రసవంతంగా ఉంటుంది. పామరజనుడు శుద్ధ గ్రాంథికంగా మాట్లాడితే ఎబ్బెట్టుగా ఉంటుంది. ఇది గమనించియే వేదం వెంకట్రాయ శాస్త్రిలవారు తమ నాటకాల్లో నీచ పాత్రలకు వ్యావహారిక భాష వాడి రక్తి కట్టించారు.

సుశబ్ద నిర్ణయంలో నన్నయయు ఆనాటి విద్వత్పరిషత్తులును ఏ సూత్రాలు పాటించారో తెలుసుకునే అవకాశం లేదు. ఆంధ్ర శబ్ద చింతామణి నన్నయ పూర్వ వ్యాకరణమని విమర్శకులు అంగీకరించడం లేదు. అందులో అక్కడక్కడ ఉదాహరింపబడిన వైయాకరణులు-అథర్వణుడు, కవి భల్లటుడు మొదలైనవారు నన్నయకు అర్వాచీనులే కాని పూర్వులుకారు. త్రిలింగ శబ్దాను శాసనములోను ఆంధ్ర కౌముది యందును బృహస్పతి, కణ్వుడు అనువారు తెలుగునకు ప్రాచీన వైయాకరణులైనట్లు చెప్పబడినను వీరి యునికి నిర్ధారితము కాలేదు. వారు రచించిన గ్రంథములును కనబడవు. నన్నయ భట్టారకునకు నూటయాభై సంవత్సరాలకు ముందే పద్యరచనా వ్యవసాయం దేశంలో సాగుచుండడం చేత ఏదైనా వ్యాకరణ రచనా ప్రయత్నం జరిగినా ఆశ్చర్యపడవలసినది లేదు. కాని స్థిరమైన సాక్ష్యమేమీ మనకు లభించక పోవడం చేత నన్నపార్యుడే తన మహోద్యమానికి అవసరమైన భాషా నియమాలు చేసుకొని ఉంటాడని అనుకోవలసి వస్తూంది. ఈ నియమాలు రెండు రకాలుగా ఉండి నట్లు ఊహించవచ్చును.

1. తనకు పూర్వముండిన శబ్ద స్వరూపాన్ని ప్రామాణికంగా గ్రహించడం.
2. సమకాలిక శిష్ట సమాజంలో వ్యాప్తి యందున్న భాషా రీతిని అవలంబించడం.

నిత్య వ్యవహారంలోని భాష ఝరివేగంతో మార్పును పొందుతూంటుంది. భాషా ప్రయోక్తల అనవధానత, ఉచ్చారణలోని అసామర్థ్యము. ఉచ్చారణ వేగము

మొదలైన కారణాలచే శబ్దస్వరూపం అప్రయత్నంగానే మార్పుకు లోనవుతూ ఉంటుంది. 'ప్రవాహినీ దేశ్యా' అన్నారు గనుక దేశభాష ప్రజల నోళ్ళలో క్రొత్తరూపాన్ని సంతరించుకుంటూ ఉంటుంది. పండితులు సాధారణంగా పూర్వతరపు రూపాల్ని ఆదరిస్తూ ఉంటారు. అవి కొంత స్థైర్యమును సంపాదించుకొని ఉంటాయి. శిష్టజనము ఉచ్చారణలో భాష స్తిమిత వేగంతో మారుతూంటుంది. వారు అవధానముతో మాట్లాడునప్పుడు మూలశబ్దరూపం భాసిస్తూనే ఉంటుంది. ఈ నాటి వ్యవహారంలో కూడా వచ్చాడు, వచ్చినాడు రూపాలు శిష్ట వ్యవహారంలోనూ, ఒచ్చాడు, అచ్చాడు, అచ్చిందు వంటి రూపాలు పామరజన వ్యవహారంలోనూ వినబడతాయి. నన్నయ నాడు కూడ ఈ స్థితియే జరిగి ఉంటుంది.

3. ఆయన ప్రతిభా విశేషం. మిత్రుడు అష్టభాషాచక్రవర్తి అయిన నారాయణ భట్టు సహాయం. నన్నయనాటికే కన్నడ కవిత్వం పరాకాష్ఠచెంది ఉన్నది గనుక సాహిత్య భాషను రూపొందించడంలో రత్నత్రయ మహాకవులు అవలంబించిన రీతులు నారాయణభట్టు నిర్దేశించి ఉంటాడు. వాటిని యథోచితంగా నన్నయ తెనుగునకు అనువర్తింపచేసి ఉంటాడు. నన్నపార్యుని భాషాసంబంధియైన విజ్ఞత, సూక్ష్మదర్శిత్వము, రసానుకూల పదస్వీకార సామర్థ్యము ఇవి ఆయనకేకాక తెలుగు భాషకు కలకాలమూ శ్రీరామరక్షగా పనిచేశాయి. మహాకవి మనస్సు, శ్రవణేంద్రియము అలోకసామాన్య మైత్రితో పనిచేస్తాయి. ఏరూపం బాగుంటుందో, ఏది నప్పదో వ్యాకరణం నుంచి మహాకవి నేర్చుకోనక్కరలేదు. అది స్వతస్సిద్ధమైన 'భాషా పరశేషభోగిత్వము'. గుణదోష విచారణచేసి మాత్సర్యంలేకుండా మేలైనదానిని నిరూపించిచెప్పే పండిత పరిషత్తులు ఆయనకు లభించాయి. లేదా ఆయన సమకూర్చుకొన్నాడందము. పరమ ఛాంథసుడైనా నన్నయభట్టు మృదుభాషి. మితహిత సత్యవాక్య రచనా చతురుడు. అట్టి సజ్జనునకు శత్రువులు ఉండబోరు. "వాక్పారుష్యము చనెమహాదారుణ మది విషముకంటె దహనముకంటెన్" (సభా-2-17) అనేది ఆయన భవ్యవాఙ్నియమము.

ఆయా సాధన సంపత్తిని జతచేసుకొని విపుల శబ్దశాసనుడు బహుళాంధ్రోక్తిమయ ప్రపంచానికి శాశ్వతమైన బాటవేసిపోయినాడు. ఎవరెంత చీదరించుకొన్నను ఆయన పన్నిన భాషావ్యూహంలో కాలుపెట్టక తప్పడంలేదు. కాలుపెట్టి మొగ్గరము గడిచిరావడం సాధ్యం కావడంలేదు. అది శివకవులు కానీండి, సంస్కృతాన్ని అనుసరించడం భాషాదాస్యమని డిండిమములు వాయించిన ఆధునికులు కానీండి— నన్నయ నుడికారపుగిరిలో పడడం తప్పడంలేదు. అనగా అది నన్నయచేసిన భాషా

ద్రోహంకాదనీ, తెలుగుభాష నైజమే అటువంటిదనీ విజ్ఞులు తెలుసుకోగలరు. మనమిన్ని ఊహలు కల్పనలుచేసినా నన్నయ ఇది యిట్లని ఏమీ పలుకలేదు. తన భవ్యకవితా లక్షణాన్నిమాత్రం సంగ్రహంగా నిర్దేశించాడు.

"సారమతిం గవీంద్రులు ప్రసన్నకథా కలితార్థ యుక్తిలో
నారసిమేలు నా నితరులక్షర రమ్యత నాదరింప, నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్" ఆది-1-26

ఆతని కవిత్వ గుణములు ముచ్చటగా మూడు. 1. ప్రసన్న కథాకలితార్థ యుక్తిత్వము 2. అక్షర రమ్యత 3. నానారుచిరార్థ సూక్తి నిధిత్వము. ఇందులో కడపటి రెండును సాహిత్య భాషా లక్షణములు.

కథానిర్వహణము ప్రసన్నముగా ఉండడం, పూర్వాపర వైరుధ్యాలు సరి చెయ్యడము, ఉపకథలను హద్దులో ఉంచడము, దీర్ఘ వేదాంత రాజనీతి ప్రసంగాలను సంక్షేపించడం, వర్ణనలను తగుమాత్రంగా కుదించడము-ఈ మొదలైనవి కథాప్రసన్నతను సాధించడానికి నన్నయ అవలంబించిన పద్ధతులు. మితరచన చెయ్యడం నన్నయ కవితా రహస్యము. దేవయాని వృత్తాంతము చూతము. కచుడు ప్రొద్దుగ్రుంకినను ఆశ్రమమునకు రానందుకు దేవయాని ఆతురత. ఈ షత్కారుణము.

"వాడిమయూ ఖముల్ గలుగు వాడపరాంబుధి గ్రుంకె ధేనువుల్
నేడిటవచ్చెనేకతమ, నిష్ఠమెయిన్ భవదగ్నిహోత్రముల్
పోడిగ వేల్వగాబడియె, బ్రొద్దును బోయెకచుండునేనియున్ ।
రాడువనంబులోన మృగరాక్షస పన్నగ బాధనొందెనో" ఆది-3-112

దీనిలో సంధ్యావర్ణనము, దేవయాని ఉత్కంఠ రమ్యముగా సంగ్రహింపబడ్డాయి.

సంవరణుడను రాజు తపతియను కన్యతో తనకామెయందు గలిగిన ప్రేమను ప్రకటించుట-శృంగార సన్నివేశము.

"ధరణి నతిప్రతాప బలదర్పములన్ విననేన పెద్ద నె
వ్వరికినిమున్ భయంపడనివాడ భయార్తుడనైతి నిప్డు పం
కరుహదళాయతాక్షి దయగావుమునన్నుభవన్నిమిత్త దు
ర్భరతరపంచబాణహతి బంచత బొందక యుండునట్లుగాన్" ఆది-7-79

నన్నయ పేర్కొనిన అక్షరరమ్యత శైలికి సంబంధించినదని చెప్పవచ్చును. మనోహరమైన అర్థముగల సూక్తులు కూడ దీనిలో భాగముగానే పరిగణించవలెను. ప్రసిద్ధములు సులభార్థ బోధకములు అగు పదాలు ప్రయోగించడము, సంస్కృత సమాసాలైనా ఎక్కువ జటిలంగా కూర్చలేకపోవడము, చిన్నచిన్న దేశ్య సమాసాలు కూర్చడము, అన్వయ కాఠిన్యం లేకుండా రచన సాగించడము, ఇత్యాదులు అక్షర రమ్యతకు హేతువులు. సూక్తులు, లోకోక్తులు, జాతీయములు వ్యవహార భాషకుదగ్గరగా ఉండే పదబంధాలు-ఇవి కూడ నన్నయ శైలిని ప్రసన్నరమణీయం చేశాయి అర్థాంతర న్యాసాలు చక్కగా ప్రయోగిస్తాడు. 'ముగ్ధులధిపులు, మఱవరె బహుకార్యమగ్నులు కారే' ఆది-4-69; గత కాలము మేలువచ్చు కాలముకంటెన్, ఆది-5-159; రోయు తీగ కాళ్ళందవలెన్ ఆది-5-220 వృద్ధుల బుద్ధులు సంచలింపవే సభా-2-9. ఇట్లాంటివి పెక్కులు.

లోకసిద్ధములు ఈయున్న పౌష్య ప్రోలికి, నిలువుండ; కానవచ్చిన. వడవడ వడంకు, ఎవ్వరిని మెచ్చక, ఇందుండి నవయక, ఋణము తీఱుట, కొడుకులనిల్లడ యిడి, పీపులొలియ, కొలది యెఱుంగక, కలధనమెల్ల. నాలుగేన్ పాడి కుఱ్ఱులు, వల్లె యని, నీ కోరినవరంబు, చూతము రండు, ఇట్టివి లెక్కలేనన్ని. సూక్తులను గూర్చి నన్నెచోడుడు, ఎఱ్ఱాప్రెగడ మొదలైన వారు కూడా చెప్పారు.

## దేశి-మార్గములు-జాను తెనుగు

నన్నయ భట్టరకుని తర్వాత ఒక శతాబ్దిలోనే తెలుగు కవిత్వానికీ, తెలుగు సాహిత్య భాషకూ ఒక క్రొత్తమలుపు ఇవ్వదలపెట్టినవారు శివకవులు. శివుని పర దైవంగా ఆరాధించేవారు శివకవులు. నన్నయ, తిక్కన, ఎఱ్ఱాప్రెగడ, బమ్మెర పోతరాజు మొదలైన వారంతా అద్వైతపరులు. వారు శివకేశవుల్ని ఉభయుల్నీ ఆయా సందర్భాల్లో పరదైవతములుగా కొలిచేవారు శివకవులు వీరి పేరు ఎత్తకపోయినా వీరందరిని భవి కవులుగా భావిస్తారు. అభవుడు ఈశ్వరుడు తద్భిన్నులు భవులు,

అజ్ఞులు, సంసారలంపటులు అని కావచ్చును; శివకవుల్లో కూడ రెండుమూడు ముఖ్య భేదాలు కనబడుతున్నాయి. ఒక తెగవారు సాధారణ శైవులు. శైవము వంకకు మొగ్గు అధికంగా చూపిస్తారు పరమ మాహేశ్వరులమని చెప్పుకుంటారు. కాకతీయ చక్రవర్తులు వారి అనుయాయులు ఇటువంటి వారు. వీరు విష్ణువును నిరసించరు. వేదమతాన్ని కాద నరు. ఈ పరమ మాహేశ్వర బిరుదము కాకతీయులకు చాలా పూర్వమే ఉండింది. గుణగవిజయాదిత్యుని సేనాని పండరంగు పరమమాహేశ్వరుడని అతని అద్దంకి శాస నం ప్రకటిస్తుంది. శైవుల్లో రెండవరకం వారు శివనిష్ఠనే పాటిస్తారు. విష్ణువు మహే శ్వరుని పరివార దైవముల్లో ఒకణ్ణిగా మాత్రమే ఒప్పుకుంటారు. చాతుర్వర్ణ్యవ్యవస్థను అంగీకరిస్తారు. ఇంక మూడవ తెగవారు వీర శైవులు. వీరు శివపారమ్యమునే పరిగ ణిస్తారు. వేద ప్రామాణ్యాన్ని, వర్ణాశ్రమ ఆచారాల్ని ఖండిస్తారు. రెండు, మూడు తెగల శైవులనే మనం శివకవులంటాము. వీరు తెలుగు సాహిత్యంలో ఇతివృత్తం విష యంలోనూ, భాష విషయంలోనూ కూడా అపూర్వ విప్లవం తేవాలని జెండాయెత్తి, కొంత కృషి చేసి, స్వల్ప విజయం సాధించారు. ఈ సందర్భంలో వీరు క్రొత్త సంకే తాలు ప్రవేశపెట్టారు. దేశి-మార్గ అనే పదాల్ని కవిత్వరంగంలోకి దింపారు. ఈ మాటలు ఎక్కువగా సంగీత శాస్త్రంలో ప్రమేయం కలిగి ఉన్నాయని తజ్ఞులు చెప్పు తున్నారు. శాస్త్ర బద్ధమైన సంగీతాన్ని మార్గమనీ, దానికి భిన్నమై ప్రజాసామాన్యంలో కనబడే దానిని దేశి అని అక్కడ వ్యవహరించారు. వాల్మీకి నాడే ఈ భేదము గుర్తింప బడింది. లవకుశులు రామాయణాన్ని మార్గ సంగీతంతో గానం చేసినట్లు ఆ మహర్షి ప్రశంసించాడు. 'అగాయతాం మార్గ విధాన సంపదా' మార్గ విధానం ఉన్నప్పుడు దేశి విధానం కూడా ఉండేదని ఒప్పుకోవాలి. ప్రాచీనమైన ఈ భేదాన్ని శివకవులు తెలుగులో ప్రవేశపెట్టడానికి పూనుకున్నారు. ఇతివృత్తంలోనూ భాషలోనూ కూడా దేశి మహ త్వాన్ని ప్రతిష్ఠించాలని వీరు తలపెట్టడం ప్రశంసాపాత్రంగానే ఉంది. ఆచరణలో ఇబ్బందులు ఏర్పడ్డాయి.

మొట్టమొదట ఈ క్రొత్త సంకేత పదాల్ని మనకు పరిచయం చేసినవాడు నన్నెచోడకవి, కుమార సంభవ కృతిపతి. ఈయన కాలం విషయంలో ఎంతో చర్చ జరిగి ఈ కవి నన్నయ తిక్కనలకు నడిమి వాడని అత్యధిక సంఖ్యాకులైన విమర్శ కులు భావిస్తున్నారు ఇతడు నన్నయ కంటె ప్రాచీనుడని కొందరు తలిచారు. నన్నె చోడుడు సుకవిస్తుతిలో ఉత్తమమార్గ సత్కవీశ్వరులను దేశి సత్కవులను ఉభయుల్నీ సంభావించాడు. కాని ఆ మార్గ సత్కవీశ్వరులెవరో దేశి సత్కవులెవరో ఒక్క పేరు

కూడ మనకు అనుగ్రహించాడుకాడు. వాల్మీకి, వ్యాస, కాళిదాస, భారవి, బాణ, ఉద్భటుడు-ఇంతమంది సంస్కృత కవులపేర్లు చెప్పుతూ ఒక్క దేశి సత్కవిని కూడా పేరు ఎత్తాడు కాడు చాళుక్యులు తెలుగును నిలిపారని ప్రశంసించాడు. ఆ చాళుక్య రాజు పేరు చెప్పడు, ఈయన చేపట్టిన వస్తువు శివలీలలు, కుమారస్వామి జననము-ఇవి మార్గకవితావస్తువులే కాని దేశీయములు కావు. పురాణ ప్రసిద్ధమైన కథలు. అయితే నన్నెచోడుడు చేసిన దేశి కృషి ఏమిటంటే ఈ పూర్వకథనే దేశీయ పద్ధతుల కనుగుణంగా మలవాలని ప్రయత్నించాడు. ఈ సంద్భంలోనే ఇతడు జాను తెనుగుప్రశంస తెచ్చాడు.

సరళము గాగ భావములు జానుదెనుంగున నింపు పెంపుతో
బిరిగొనవర్ణనల్ ఫణితి పేర్కొన నర్థములొత్త గిల్లి బం
ధురముగ బాణముల్ మధుమృదుత్వ రసంబున గందళింప
నక్షరములు సూక్తులార్యులకు గర్ణర సాయనలీల గ్రాలగాన్. కుమార. 1-35

ఇతడు నన్నయ చెప్పని అలంకార శాస్త్ర నియమాల్ని చాలా పేర్కొన్నాడు. కావ్యంలో అది పాటించాలి అంటాడు ఇందులో అక్షరములు సూక్తులు మాత్రమే నన్నయ ప్రత్యేకంగా పేర్కొన్నాడు. నన్నెచోడుడు ఉద్దేశించిన జాను తెనుగు స్వరూపం ఎటువంటిదో అతడు వివరించలేదు. ఆతని గ్రంథాన్నిబట్టి కొంతకు కొంత ఊహించవలసిందే. మార్గ కవితా వస్తువు వలెనే మార్గశైలిని కూడా నన్నెచోడుడు నిరసింపలేదు. నన్నయమల్లేనే సంస్కృత సమాస నిబిడమైన రచన సాగించాడు. సామాన్య జన వ్యవహారానికి ఎక్కువ సన్నిహితమగు ప్రయోగపద్ధతిని అవలంబించాడు. లోపదీర్ఘ రూపాలు, మోము-మొగము అనుటకు, వైరాన-వైరమున అనుటకు, ఇటువంటి రూపాలు శాసనాల్లో కనబడతాయి. మొదవులు అనుటకు మోదాలు. తిక్కన కాలానికి ఇవి ప్రామాణికత్వం సంపాదించుకున్నాయి. ప్రాణానంగలవె అని తిక్కన ప్రయోగించారు. ఇకారసంధి. వాయుడుపక, వాయి + ఉడుపక. మంచాలవు-మంచి + ఆలవు. క్వార్థేతో నథవేత్సదా-క్వార్థక ఇకారమునకు సంధిరాదని ఆంధ్రశబ్దచింతామణి. నామగతమైన ఇకారానికి అప్పుడప్పుడు కనబడుతూనే ఉంది. షష్ఠీ అకారసంధి-దేహేంద్రియబులిచ్చలు. సంస్కృత శబ్దములలో స్వరభక్తి చేసిన రూపముతో సమాసము చేయుటకు కలుహార గంధి (కల్హార అనుటకు). ఇటే బరిహి కేశభరంబు; హరుషాశ్రుధారలు వంటివి. తద్భవ రూపంతో సమాసం చెయ్యడం, అరదాశ్వభట తతి.

రథ-అరద. షష్ఠీ కువర్ణకమునకు పూర్వము నగాగమము చేయకుండుట. నభసు కు నభమునకు బదులు-వైరిసమాసములు-అమరలేమలు. అమర సంస్కృతము. లేమ దేశ్యము. ఇట్టిదే మంత్ర కాటుక ఇటువంటి రూపాలు శాసనభాషలో తరుచువస్తాయి, వ్యవహారభాషకు సమీపంగా వెళ్లుటకు నన్నె చోడుడు ఇట్లాంటి ప్రయోగాలు చేసి ఉంటాడు. ఇదియే జాను తెనుగని అతని భావమైయుండవచ్చును. అచ్చపు తెలుగుబడి నుడికారపు సొంపు కుమార సంభవంలో బాగా కనబడుతుంది. పండిత వర్గము వారు మాత్రము ఈప్రయో గాలను హర్షింపరు.

శివకవులలో అత్యంతప్రసిద్ధుడు, బహుగ్రంథప్రణీత పాల్కురికి సోమనాథుడు. మల్లికార్జున పండితారాధ్యుడు, యథావాక్కుల అన్నమయ్యకూడా శివకవుల్లో గణ్యులే; అయినా వారిరచనలు చాలా తక్కువ. సోమనాథుడు బసవపురాణము, పండితారాధ్య చరిత్రము, చతుర్వేదసారము, వృషాధిపశతకము, చెన్నమల్లు సీసములు, ఉదాహరణ ములు, రగడలు వంటి పెక్కు తెలుగు కృతులు వ్రాశాడు. వీటిల్లో మొదటి రెండు తెలుగు వాఙ్మయంలో గొప్పస్థానం ఆక్రమిస్తున్నాయి. పాల్కురికి సోమనాథుడు కాక తిరుద్రదేవుని కాలము (క్రీ.శ. 1158-95) వాడని కొందరును, ప్రతాపరుద్రుని కాలము వాడని (క్రీ. శ, 1295-1323) కొందరును భావిస్తున్నారు రెండవ మతాన్నే పలువురు విశ్వసిస్తున్నారు. దేశి-జాను తెనుగు-ద్విపద ఛందస్సు-ఈ త్రిపుటి విషయంలో సోమ నాథుడు అసాధారణమైన పట్టుదలగలవాడు. ఇతివృత్తము, భాష, ఛందస్సు అన్నీ కూడా దేశీయములుగానే ఉండాలనే దృఢదీక్ష కలవాడు. వీరశైవమతాభిమాని అవడం చేత సాంఘిక ఆచారాల్లోకూడా ఇతడు విప్లవవాదియే. మనకు ప్రకృతమైనది సాహిత్య భాషకనుక ఈ విషయంలో ఈయన ఆశయాలను, ఆచరణలను సంగ్రహంగా పరి కిద్దాము. నన్నెచోడుని వలెనే ఇతడును జానుతెనుగు వాదియే. ఏది జానుతెనుగు అనే అంశంపై నిర్దిష్టమైన నిర్వచనము-అనుష్ఠానము శివకవుల్లో కూడా కనబడడంలేదు. మొత్తంమీద నన్నయ ప్రవేశపెట్టిన తత్సమ శైలికి కొంత భిన్నమైన మార్గము, తత్కా లవ్యవహారానికి దగ్గరగా ఉండే భాషారీతి శివకవులకునూ, అందులో కొట్టవచ్చినట్లు పాల్కురికి సోమనాథునకును సమ్మతమని అతని మహాగ్రంథ ద్వయం వలనా మనము ఊహింపవచ్చును. ఈతడు తన వృషాధిపశతకంలో ఒక పద్యము అచ్చ తెలుగులో వ్రాస్తూ దాన్ని జానుతెనుగు అన్నాడు.

బలుపొడతోలు సీరమును బాపసరుల్ గెలుపారుకన్నువె
న్నెలతల సేదుకుత్తుకయు నిండిన వేలుపుటేరు పల్గుపూ

సలుగలరేని లెంకవనిజానుదెనుంగున విన్నవించెదన్
వలపు మదిన్ దలిర్ప బసవా, బసవా, బసవా వృషాధిపా'

ఈ పద్యరచనను బట్టి జానుతెనుగుగంటే అచ్చతెలుగు కాబోలు అనే భావం ఏర్పడుతుంది కాని అదిసరికాదు. తన మహారచనల్లో సమకాలిక వ్యవహారభాషకు చాలా దగ్గరగా రావాలని ఎంతప్రయత్నం చేసినా సోమనాథుడు అచ్చతెలుగు శైలి వ్రాయలేదు-నన్నయ, నన్నెచోడులు ఆదరించిన ఉన్నత సంస్కృత శైలిని విసర్జింపలేదు.

"భవి కృతారంభ సంభవ ధాన్యనిచయ
భవినిరీక్షణ రసపాకవితాన
భవిహస్తగత ఫలపత్రశాకాది
భవిగృహ క్షేత్రాంఘ్రిపథన వర్జితుడ
భవిజన దర్శన స్పర్శనాలాప
వివిధ దానాదాన విషయ దూరగుడ"

పండితారాధ్య చరిత్ర

ఈ విధంగా గుక్క తిప్పుకోకుండా సంస్కృత సమాసాల్లో ఇతడు విహరించనూగలడు తోచినప్పుడు చాల సులభంగా తేట తెనుగులోనూ పరుగెత్తగలడు.

"బసవగోత్రుండను బసవనికరుణ
బసవేశు శ్రీపాద పద్మసేవకాడ
బసవన్నదూత, నే బసవన్న బంట
బసవన్న వెంకనే బసవన్న లెంగి
బసవన్న యిలుపుట్టుబానిసకొడుక
బసవన్న పన్నుల పన్నగావునను"

అందుచేత

"అరూఢ గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠరచన
మానుగా సర్వసామాన్యంబుగాదు
జానుతెనుగు విశేషము ప్రసన్నతకు"

అని ఇతడు చెప్పిన దానినిబట్టి తత్సమ శైలి పరిహరించడం ఇతని మతంగా అనుకోకూడదు.

తత్సమ శైలి తెలుగులో రూఢమైపోయింది. శివకవులు కూడ దానిని తోసి రాజని అనలేకపోతున్నారు. అయితే వీరుచేసినమేలు ఏమిటంటే సంస్కృతం మీది దురభిమానం చేత తేటతెలుగు శైలిని తృణీకరించకుండా సమసంస్కృతాంధ్ర రచన సాగించడానికి గట్టిబాటలు వేశారు వాదతీవ్రతలో గీర్వాణశైలిని ఖండించినా దానిని బొత్తిగా విడిచిపెట్టలేదు.

తనశైలిని నిత్యవ్యవహారానికి అత్యంత సన్నిహితంగా తేవడానికి సోమనాథుడు పాటించిన కొన్ని మార్పులను గుర్తింపవచ్చును. ఇవైనా నన్నెచోడునకు అవిదితములు కావు. ఆతని మార్గాన్ని విస్తృతపరచి భాషలో గాటంగా స్థాపించడమే పాల్కురికి కవి ప్రశంసనీయమైన సేవ. ద్రావిడభాషలకు సామాన్యమై, ప్రాచీనకాలమున తెలుగున ఉండిన 'ఱ' ధ్వని సోమనాథుని కాలమునకు జనవ్యవహారము నుండి కూడా తొలగి యుంటుంది. కావున ఆతడు దానిని పేర్కొనలేదు-ల,ళ వర్ణముల కభేదమని చెప్పినాడు. సాధురేఫ శకటరేఫల ఉచ్చారణ (ర,ఱ) శ్రూయమానముగా ఉండేదికావలెను. అందుచే వీటికభేదము చెప్పలేదు. యతిప్రాసలయందు వీటి సాంకర్యము ఆతనికిని సమ్మతము కాదు. ఆంధ్ర శబ్దచింతామణి ఈ వర్ణద్వయ సాంకర్యం నిషేధించింది. 'నాన్యేషాం వైదర్మ్యమ్ లఘ్వలఘూనాం, రయోస్తునిత్యంస్యాత్'అని ఇచ్చటి వ్యవస్థ. దీర్ఘముమీద నిండుసున్న ఉండదు, అరసున్న ఉండవలెను అనునియమము ఆకాలమునలేదు. నిండు సున్నను ఊది పలకడం తేల్చి పలకడం మాత్రం చేసేవారు. లేఖనమునందు పూర్ణాను స్వారము ఉద్దేశించినచోట దాని యనంతర వర్ణాన్ని ద్విత్వంచేసి వ్రాసేవారు. కుండ్ద అన్నట్లు వ్రాయవలెను. నిండుసున్న ఉద్దేశింపబడనిచోట ద్విత్వము వ్రాయరు: 'వాండు'. జనవ్యవహారంలో దీర్ఘంమీద కూడా పూర్ణానుస్వార ఉచ్చారణ కనిపించేది. శాసన భాషలో ఇది సాధారణస్థితి. నన్నయ భాషలో అనగా శిష్టజన వ్యవహారంలో దీర్ఘము మీద పూర్ణానుస్వారము లేకుండడంచేతనే ఆయనదీనిని పరిహరించాడు. నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు జనవ్యవహారం దృష్టిలో ఉంచుకొని దీర్ఘంమీద సాధ్య పూర్ణము ప్రదర్శించారు.

"పాండురాంగం బైనపడఁతి గర్భమున
పోండిగా వెలుఁగుచుఁ బుత్తుఁడీక్రియను"

బసవపురాణము

శబ్దములను వ్యవహార సిద్ధరూపములతో వాడుట, చార్వాకుడు అనుటకు చాకుడు. త్రేది, ద్వేది-త్రివేది, ద్వివేది అనుటకు. కొన్ని శబ్దాలకు 'డు' వర్ణమురాదని వ్యాకరణములు: మను, వటు, పటువంటివి. సోమనాథుడు పటువుడు అని ప్రయోగించెను. బమ్మెర పోతరాజు వటు శబ్దంమీద ప్రథమాడుజ్ వర్ణకం ప్రయోగించాడు: 'ఇంతింతై వటుడింతయై'. ఈయ ప్రత్యయాంతములను ఇయ్యగా పలుకుట. మహనీయ అనుటకు మహనియ్య, త్వదీయ-త్వదియ్య ఇట్లాంటివి. అమహద్వాచకము వర్ణము లోపింపచేయుట: తుది ఖండములు అనుటకు ఖండలు; అర్ణవఘోషణము అనుటకు ఘోషణ. వ్యాకరణాలు దీన్ని గుర్తించాయి. దర్భాదులకు మువర్ణ లోపము. కొన్ని చిత్రరూపములు-కాళిదాసి, భక్తసమూహి (సమూహము అనుటకు). లింగవ్యత్యయము: వనితయ పూర్వలాంఛనధారిణి యనుటకు లాంఛనధారి అని ప్రయోగించడం; వల్లభకు వల్లభి. సంధియందును వ్యవహారానుసారిగా అధిక స్వేచ్ఛ పాటింపనైనది. కూడడుకుట (కూడు+అడుకుట), పదమూడవేట (పదుమూడగునేట), ఒప్పారివటూరి (ఒప్పారు నివటూరి) స్త్రీవాచకములపై సంధి. మగ్గళవ్వనియే; చీరెల్ల (చీర+ఎల్ల). క్త్వార్థక ఇకార సంధిచేయనైనది: వెఱచుండుము. ఒల్చీడె (ఒలిచి+ఈడె), ఏతెంచారగించి, కూడుండు (కూడి+ఉండు). ఇకారాంత నామవాచకములమీదకూడ ఇట్టి సంధి కన్పించును: బగితేడ (బగితి+ఏడ), వావెఱుగని, కాకఅపులు. కడాది శబ్దములమీద తత్సమములు పరమగునపుడుకూడ ద్విరుక్తటకారం చెయ్యడం. కట్టగ్రము, కట్టుగ్రలీల. కడాదుల మీద తెలుగు శబ్దములు వచ్చినప్పుడే ద్విరుక్తటకారము వచ్చుట వైయాకరణమతము. సమాస వైచిత్రి. కర్మధారయ సమాసమున మహత్ శబ్దమునకు 'మహా' ఆదేశము చేయకుండుట. మహద్గురుపుత్రుడు. నన్నెచోడుడుకూడ 'సుమహత్కాశసనౌఘంబు' అని ప్రయోగించియున్నాడు. షష్ఠీనగాగమవిరహితరూపము; కరికాలచోడకు-చోడునకు అనదగినచోట. చోడ అను రూపమును కలదు. అప్పుడు చోడనికి కావలసి ఉంటుంది. తరువాతి కవులు కొందరు దీనిని ఆదరించారు. బచ్చింటి (బచ్చునింటి) అని తెనాలి రామకృష్ణుడు. షష్ఠీ సమాస సంధిలోకూడ విశేషం కనబడుతుంది మహేశ్వరుల యిండ్ల అనుటకు మహేశ్వరులిండ్ల; యజమానులిండ్ల, కులహీనులెంగిళ్ళు. ఇంచుగాగమముతో సంస్కృత శబ్దాలను తెలుగు ధాతువులుగా మార్చుకోవడంలో సోమనాథుడు నన్నయాదుల పద్ధతినిదాటి వెళ్ళిపోయాడు. ఉత్సాహించు, అలంకారించి, అహంకారించి, శాపించు ఇత్యాదులు. ఉపకృతి, సంవృతి, పరిణతిభేదమును విస్తరించుటచే ఇట్టి రూపములు సిద్ధించును.

తెలుగు శబ్దాలలో పద మధ్యాచ్చులను లోపింపచేయుట తరుచు కన్పించును. కుర్వ్వర్, కుస్వ్వ, కడ్గి, తగ్గు, కుర్యునే, కన్నెర్క్రము, ఇస్మ్మ, ఉర్కు వంటివి. అంత్యవర్ణ లోపము చేయుట-ఏగెడువార్ జంగములు, అనియెదర్. బహువచన రువర్ణమున నన్నయకూడ ఉకారలోపము చేసెను: తత్పాలుర్ భయంబందగన్. కర్మణ్యర్థమునకు. స్వార్థముననుకూడ పడు ధాతుప్రయోగము సోమనయందు కలదు. సంబోధనమునందు పురుషవాచకములపై 'రో' వాడుట: బసవరో, వీరభద్రయ్యారో. తరువాతి కాలమున ఇది మహతీవాచకములమీద వచ్చును: అమ్మరో, చెలియరో. కారకవైచిత్రి కనిపిస్తుంది: జన్నంబు వెడలన్, నీకు మెచ్చితి, వ్యవహారమేగు. పోదండు (మనము పోవుదము), చూతండు (మనము చూతము). అవధారణార్థకము 'అ' యనియె సోమన వాడాడు. 'తత్వామృతంబయ చన్నుబాలు', తాను, నేను అనునవి కళలుగా పరిగణింపబడి గసడదవాదేశం చెయ్యడం కనబడుతుంది: ఏను వోయెద. ఈ యాదేశముసాంస్కృతిక పరుషములకును వచ్చును: ముల్లోక విభుండు సక్రి. వ్యవహారమునందు సంస్కృతాంధ్రపద సమ్మిశ్రమముచే ఏర్పడిన సమాసములు కన్పింపగా సోమనాథుడు వానినట్లే గ్రహించి ప్రయోగించినాడు. ఇవి వైరిసమాసములని వైయాకరణులుభావింతురు. ఆదికుమ్మరి. ఇతరవేల్పులు, చౌపళాబ్జము, దీపగంబములు. ధర్మకపిలె, నిత్యపడి పంచవన్నియలు, పుడమీశుడు ఇత్యాదులు పెక్కులు. సోమనాథుడు ప్రయోగించినంతగా దేశి-తెలుగు పదాల్ని తెలుగు సాహిత్యంలో మరెవ్వరూ వాడలేదు. ఆయా విద్యలు కళలకు సంబంధించిన పదాలు ఎన్నో ఆతడు వాడినాడు. అవి యిప్పుడు వ్యవహారభ్రష్టములవడంచేత అతని భాషాప్రయోగమంతా మనకు అర్థంకాదు.

మొత్తంమీద నన్నయభట్టుకు సమీపకాలంలోనే శివకవులు దేశి-జాను తెనుగు ఉద్ఘోషణముతో ఆతని సాహిత్య భాషమీద బలవత్తరమైన తిరుగుబాటునే లేవదీశారు నన్నయ మార్గము విస్మృతమయే స్థితివచ్చింది. ఇంతలో కవిబ్రహ్మ తిక్కన సోమయాజి వ్యూహముఖమున నిలిచి అచంచలస్థైర్యంతో నన్నయ భారత భాషకు బ్రహ్మాండమైన బలము కల్పించాడు. తిక్కన సోమయాజికూడా శివకవుల ప్రాసుపక్షంలో నిలబడినట్లైతే తెలుగు సాహిత్య భాషావికాసము మరొకలాగ ఉండేది. జాను తెనుగుపేరట అప్రసిద్ధ వ్యవహారరీతులు సాహిత్యంలో కాలూది నిలబడేవి. దానివలన సార్వజనికంగా ఉండవలసిన సాహిత్యభాష మాండలికదశకు దిగబడి సాహిత్యం ఇవ్వవలసిన నిర్మలా

నందం ఇవ్వలేకపోయేది. తెలుగు సాహిత్యాన్ని ఈ ప్రమాదాన్నుంచి తిక్కన సోమయాజి ఎట్లా తప్పించాడో చూద్దాము. ఇట్టి మహత్తరసేవకే కవులు ఈయనను కవి బ్రహ్మ అని ప్రశంసించారు. రామరాజభూషణుడు 'కుందలీంద్రుండు తన్మహనీయస్థితి మూలమై నిలువ' అని జోహారులర్పించాడు.

## తిక్కన సోమయాజి

ఈ మహాకవి తెలుగు సాహిత్య భాషను విషమ మార్గాల నుంచి తప్పించి విశాల సమసుందరమైన మైదానంలో తెచ్చి విడిచాడు. తెలుగు సాహిత్య భాషా ప్రగతిని రేఖా చిత్రంగా గీయాలంటే ఈ విధంగా ఉండవచ్చును. నన్నయకాలంలో ఈ బాట సమరుచి రగతితో కొంత దూరం నడిచింది. ఇంతలో శివకవి భాషా విప్లవం అనే ఒక లోయ లోనికి దిగింది, అక్కడ పారిజాత వృక్షాలూ ఉన్నాయి, తుమ్మిచెట్లు ఉన్నాయి. విషమ మార్గము. తెలుగు సాహిత్యపు బాట తిక్కన సోమయాజి మహాభారత రచనలో తిరిగి సమరుచిర విశాల సూర్యాతపోజ్జ్వలమైన మైదానాల్లోంచి సాగిపోయింది. వెళ్ళి వెళ్ళి నాచన సోమనాథ, శ్రీనాథ కవులనే మైలురాళ్ళ వద్ద కొండలెక్కడం ప్రారంభించింది. చరియలు ఎక్కి ఎక్కి ప్రబంధయుగంలో పర్వతశిఖరాన్నంటి భూమి మీద చూడక చుక్కలవైపే చూస్తూ సాగిపోయింది. మళ్ళీ దిగుడు ఆరంభించి తంజావూరు యుగంలో చేమకూర వెంకటకవి అనే మైలు దగ్గర సమతలం మీదకి అవరోహణ చేసింది. ఆధునిక యుగంలో గురజాడ రేవునుంచి మృదుపవన సంవాసితమై చుక్కలు కనపడని రమ్యోద్యాన వీథుల్లోంచి ప్రయాణం సాగిస్తూంది.

తిక్కన పేర మిగిలిన రెండు గ్రంథాల్లో-నిర్వచనోత్తర రామాయణం, ఆంధ్ర మహాభారతం-ఆయన తన మొదటి గ్రంథంలో సాహిత్యభాషా స్వరూపాన్ని కొంత చర్చించాడు. దిక్ప్రదర్శనంగా కొన్ని నియమాలు ప్రకటించాడు. మలిగ్రంథమైన మహాభారతంలో విజ్ఞతా భరితమైన మౌనం పాటించి, ఆచరణలో ఉత్తమ సాహిత్య భాషా లక్షణాలు ప్రదర్శించి, నిర్వచించుకొనేభారం పాఠకునికే వదిలివేశాడు. తొలి గ్రంథంలో ఆయన పెట్టుకొన్న నియమాలు కొన్ని "కవిత్వము తనకు నచ్చితే చాలదు. ఎవరి కవిత్వం వారికి ఇంపుగానే ఉంటుంది. అది భూరివివేకచిత్తుల హృదయానికి ఎక్కాలి, తామర పువ్వు విచ్చుకునే దళాల ద్వారా తనలోని సౌరభం

ఎట్లా ప్రకటిస్తుందో అల్లాగే కవియైన వాడు తన భావ సౌరభాన్ని మాటలనే రేకుల ద్వారా సున్నితంగా ప్రకటించాలి. కుకవియైనవాడు పాతబడి పోయిన మాటలు ప్రయోగిస్తూ రసభంగం చేసి నవ్వుల పాలవుతాడు అతనికి మార్గపద్ధతి కాని దేశి పద్ధతికాని సరిగా అవగతం కాదు. తెలుగు కవిత్వం చెప్పేటప్పుడు వళి ప్రాసనియమాలు పులిమిపుచ్చకూడదు. సంస్కృత శబ్దాలు తెలుగులో ప్రయోగింప దలచినపుడు లింగవచన వ్యత్యయం చెయ్యకుండా వ్రాస్తే బుధజనము మెచ్చుకుంటారు ఇక్కడ తిక్కన ఏమి ఉద్దేశించాడో నిష్కర్షగా చెప్పలేము కాని విశేష్య విశేషణ సంబంధంలో లింగవచన నియమం తప్పక పాటించాలని ఆయన భావంగా తోస్తుంది. ఉదాహరణకు శివకవులు తెలుగు విశేష్యంతో సంస్కృత విశేషణం మార్చేటప్పుడు లింగనియమాన్ని ఉపేక్షించారు. 'వనిత-లాంఛనధారి' అని పాల్కురికి సోమనాథుడు ప్రయోగించాడు. నియమానుసారంగా లాంఛన ధారిణి అని స్త్రీ పత్యయం చేయవలసి ఉండెను. బహుశా ఇట్టి లింగవ్యత్యయాల్నే తిక్కన ఉద్దేశించి ఉంటాడు ఈ సందర్భంలో ఒక్క విశేషం గుర్తించాలి. 'లింగవచనములు భేదింపమికి' అని తిక్కన చెప్తూ విభక్తివ్యత్యయాన్ని పేర్కొనకపోవడంలోని ఆంతర్యంఏమిటంటే తెలుగు నుడికారం ప్రకారం సంస్కృత పదాల్లో కూడా విభక్తి వ్యత్యయం సమర్థనీయం అవుతుంది. 'పార్థివప్రాగ్రసరుండు ధర్మసుతుపన్ను' అనే ప్రయోగంలో షష్ఠీవిభక్తిగతమైన ధర్మసుతు అనే దానికి విశేషణమైన పార్థివప్రాగ్రసరుండు అనేది ప్రథమా విభక్తిలో ఉంది. కేవల సంస్కృతంలో పార్థివ ప్రాగ్రసరుని పనుపు అని షష్ఠిగతంగా ప్రయోగించవలసి వస్తుంది. తెలుగులో ఆ నియమం లేదు. బుద్ధిమంతుడు రామునకు అంటాముకాని బుద్ధిమంతునకు రామునకు అనవక్కరలేదు. దీనిని మనస్సులో పెట్టుకొనియే కాబోలు తిక్కన లింగవచనములు భేదింపమికి అని వ్రాశాడు. మరొక పద్యంలో 'జాత్యముకామి నొప్పయిన సంస్కృత మెయ్యెడజొన్ప' అని వ్రాశాడు. సంస్కృత భాషలో లింగవచన విభక్తులచే ఒక శబ్దము నిర్దుష్టమయినప్పటికీ తెలుగు నుడికారానికి అది కుదరనప్పుడు సంస్కృతముమీది గౌరవంచేత దానిని ప్రయోగించను అని కవియుద్దేశంగా తోస్తుంది. ఈ నియమము మణిప్రవాళశైలి నివారించుటకని విజ్ఞులు భావిస్తున్నారు. అట్లాగే 'నపదాన్యవ్యయ' ఇత్యాది సూత్రంచే ఆంధ్ర శబ్ద చింతామణి నిషేధించిన కేవల సంస్కృత ప్రత్యయవంతములైన శబ్దాలుకూడా రావచ్చును. వచనంలేకుండానే పూర్వాపర సందర్భాలు కలుపుతూ కవిత్వం చెప్పవచ్చుననీ,

తానట్లుచేయుదునని మహాకవి తన మొదటి గ్రంథంలో ప్రతిజ్ఞచేసి నిర్వహించుకున్నాడు. కాని 'అష్టాదశ పర్వనిర్వహణ సంభృతమై పెనుపొందు' మహాభారతంవంటి హద్దులు కనబడని సాహిత్యసాగరంలో విహరించేటప్పుడు ఇటువంటి చిల్లర ప్రతిజ్ఞలు అనవసరమని భావించి ఉంటాడు. ఆ మాట ఎత్తలేదు. ఆ నియమం పాటించలేదు. తుదిమాటగా తిక్కన అన్నాడు. లలితములు హృద్యములు అయిన పద్యములతో చిన్న చిన్న ఖండములకూర్పుతో నాగటిచాలువలె రచన సాగిస్తానని చెప్పాడు. తిన్నగా తీర్చిదిద్దినట్లు అని భావంగా తోస్తుంది. స్వర్గీయ సురవరం ప్రతాపరెడ్డిగారు ఇక్కడ కాహల(శ) సంధించిన విధముగా అని ఉపమాన స్వారస్యం చెప్పేవారు. బాకా ధ్వని మొదట చిన్నచిన్న తుంపులుగా మొదలిడి చివరకు దీర్ఘస్వరంతో విరమిస్తుంది ఇదొక చమత్కారము. చిన్నచిన్న సమాసాలతోను వ్యస్తపదాలతోను పద్యం మొదలు పెట్టి ఉత్తరార్ధంలో దీర్ఘపటిష్ఠ సమాసంతో ముక్తాయింపు పలికించడం. విరాటపర్వం-2-133 భీమునికోపం వర్ణిస్తూ 'కనుగొని కోపవేగమున' అనే పద్యంలో ఈ చమత్కారం చూపెట్టాడు. అయితే కావ్యం అంతా ఇట్లా ఉండదు. ఉంటే రసభంగం అవుతుంది. కావ్యంలో అనేక విధములైన శిల్పాలు ఉంటాయి. 'అమలోదాత్త మనీష' (నిర్వ-1-13) అనే పద్యంలో తాను ఉభయ కావ్య ప్రౌఢి బాటించు శిల్పములో పారగుడు అని ఆయన చెప్పుకొన్నాడు. పాల్కురికి సోమనాథుడు మహా విద్వాంసుడు, అమిత వచోవేగం కలవాడైనప్పటికీ ఆతనియందు మత ప్రచారదృష్టి శిల్పదృష్టికన్న బలీయమవడంచేత కవిత్వంలో ప్రసన్నత కొరవడింది.

మహాభారత రచనా ముహూర్తమునకు తిక్కన సోమయాజిలో వేదాంతపరమైన అద్వైతమే కాకుండా భాషా పరమైన అద్వైతం కూడా కుదురుకొంది. తిక్కన గారి హరిహరాద్వైతము సర్వవిదితము. కావ్యభాష విషయంలో కూడా ఈయన సంస్కృతాంధ్ర భాషా సామరస్యాన్ని సాధించడానికే మహాభారతంలో పూనుకొన్నాడు తెలుగు కవిత్వానికి నన్నయ తీసిన దారులే ప్రశస్తమైనవనీ, ఫలవంతములైనవనీ, తెలుగు భాషా జీవితానికి ఆయువు పట్టులనీ కవిబ్రహ్మ దీర్ఘాలోచన మీద నిర్ణయించాడు. ఒక జాతి రసహృదయాన్ని పసిబట్టడం ఆ జాతి భాషాకవులకే కుదురుతుంది. ఇది ఇట్లా అని సూత్రీకరించడం సాధ్యంకాదు. శివకవులు నన్నయ పేరు కూడా ఎత్తడానికి ఇష్టపడలేదు. ఆయన మార్గాన్ని అన్యాపదేశంగా నిరసించి క్రొత్త మార్గం తొక్కారు. కాని ఆంధ్రుల హృదయం తత్సమ భాషాభిముఖంగా

ఉందనే రహస్యం తిక్కన గ్రహించాడు, నన్నయ 'ఆంధ్ర కవిత్వ విశారదుడు, విద్యాదయితుడు, మహితాత్ముడు' అని మిత గంభీరంగా ప్రశంసించాడు. కవిత్వ పథంలో తిక్కన సోమయాజిని మెప్పించడం దుస్సాధ్యం అన్నాడు కేతన కవి.

'కవిత జెప్పి యుభయ కవి మిత్రు మెప్పించు టరిది బ్రహ్మకైన'అని బెరుకుగా అన్నాడు. అటువంటి ఉభయ కవి మిత్రుడు మహాభారతాన్ని నన్నయభట్టు దక్షతతో వ్రాశాడని తలయూపడము ఏతన్మాత్రస్తుతి కాదు. మహా భారత రచనా సందర్భమున తిక్కన సోమయాజి ఎటువంటి భాషా నియమాలు ప్రకటించ లేదు. అసలు లేవని కాదు. వాటిని ఇదమిత్థమని ప్రకటించకుండా వ్యంగ్యంగా సహృదయులకే వదలి వేశాడు. భారతము నందు కుకవి నిరాసనము కూడ చేయలేదు. రెండు పద్యాల్లో మాత్రం తన ధ్యేయాన్ని ముక్తసరుగ చెప్పాడు. 'తుదిముట్టన్‌రచియించు టొప్పు బుధసంతోషంబు నిండారగన్' (విరాట-1-7) అనిన్నీ.'భారతామృతము గర్ణపుటంబులనారగ్రోలి యాంధ్రావలి మోదముంబొరయ' (విరాట-1-30) అనిన్నీ మాత్రమే పలికాడు. బుధులు సంతోషించాలి, జనసామాన్యం దేశం నాలుగు మూలల వారు సంతోషించాలి. తనకు 'జన్మాంతర దుఃఖముల్ దొలగునట్లుగ' (విరాట-1-12) మరియొక ఉదాత్త లక్ష్యము పీఠికి తగ్గ భాష సంస్కృతాంధ్రముల వివేక యుతమైన సమ్మేళనము, అట్లే దేశి మార్గముల సంయోజనము అని ఆయన నిశ్చయించుకొని రచన సాగించాడు. మరి శివకవుల జాను తెనుగు - దేశి లక్ష్యము మాటేమిటో. వీటి విషయంలో తిక్కన సోమయాజి దృష్టి ఎటువంటిది అని ప్రశ్నిస్తే, ఆ పదముల పేరు ఎత్తకుండానే వాటి తత్వాన్ని తన కవిత్వంలో ఇమిడించాడు. రసమును రసశబ్దంతో చెప్పకూడదట. ఇది శృంగార రసము. ఇది కరుణ రసము అని పేరెత్తి చెప్పుట వాటిని వాచ్యము చెయ్యడం అవుతుంది. ఆ సందర్భాన్ని చిత్రించడంలో చూపిన నైపుణ్యం చేతనే అది శృంగారమని, కరుణమని సహృదయ హృదయవేద్యం కావాలి. నన్నెచోడుని వలె తిక్కన ప్రబంధోచిత వర్ణనలూ చేశాడు. ఉదా॥ సింహబలుడు ద్రౌపది విషయమై విరహం అనుభవించడం. దేశీయాచారములను చక్కగా చిత్రించి దేశ్యతాసిద్ధిని ప్రదర్శించాడు. అభిమన్యు వివాహఘట్టంలో ఆంధ్రుల వైవాహిక మర్యాదలను చొప్పించాడు. యుద్ధఘట్టాల్లో వీర రసానుగుణంగా ఓజశ్శైలిని కొంత చిందించాడు సంభాషణల్లో ఉక్తిప్రయుక్తిని, నానుడులు, సామె

తలు, దేశ్యపద బంధాలు కూర్చాడు. అవసానపర్వాల్లో రాజనీతి, వేదాంత ప్రసంగాలు విస్తారంగా వచ్చినప్పుడు తెలుగు సంగ్రహణ శక్తిని రుచిచూపించాడు ఈ వైవిధ్యాన్నిబట్టి మనం గ్రహించదగిన అంతరార్థం ఏమిటంటే సాహిత్యభాష అనేది అన్ని సందర్భాల్లోను ఏకరీతిగా ఉండదు ఒకే ఛందస్సుకూడా అన్ని శైలులకు అనుకూలంగా ఉండదు. ఇదే తిక్కన సోమయాజి తెలుగువారికిచ్చిన భాషా సందేశం. శతాబ్దులుగా తెలుగువారు దీనికి కట్టుబడియే ఉన్నారు. కవిబ్రహ్మ దేశిశైలికి మచ్చుగా రెండు మూడు పద్యాలు.

"ఎదురిం దమయట్టులకా ।
మది దలచిన బొసగుగాక, మాకుంగుడుమిం ।
డిదెమీరు వ్రక్కగొనుడని ।
చదురడిచిన, మనసుపొందు చక్కంబడునే !"

విరాట. 1-313

"పరుసదనముమెయి నరిగొన ।
జొరదగదది, పొదుగుగోయుచొప్పగు, వినుపా ।
ల్గురియించు కొనదలంచిన,
నరయవలదె గోవుప్రజయు నట్టిద యధిపా!"

శాంతి. 2-299.

"కోరి తోటవాడు కుసుమఫలంబులు
గోయునట్లు రాజు గొనగవలయు
నప్పనములు, నటికి యంగారములు సేయు
భంగియైన భూమి పాడుగాదె".

శాంతి. 2-300

చిన్నచిన్న తెలుగు సమాసాలు, తెలుగు కృత్తద్ధితాలు, జాతీయాలు, పదబంధాలు వీటిమూలంగా జాను తెనుగు లక్షణాన్ని తిక్కన నిలబెట్టాడు. శివకవుల అసాధారణ ప్రయోగాలు, వైరి సమాసాలు, మారుమూల పదప్రయోగాలు, ఏకైక ఛందోనిరతి ఇత్యాదులు దేశ్యతా సిద్ధికి ముఖ్య సాధనాలు కావని ఆయన నిరూపించాడు. ఇటు బుధ జన సంతోషమూ సాధింపబడింది; అటు సామాన్య ప్రజలకు సాహిత్యం అందుబాటులోనికి వచ్చింది.

# నన్నయ తిక్కనల వారసులు

అనంతర కవులంతా ఒక విధంగా నన్నయ్య తిక్కనల వారసులే అయినా ఇద్దరు కవులు వారి భావాలను భాషను పుణికి పుచ్చుకొన్నారు. ఎఱ్ఱాప్రగడ, బమ్మెర పోతరాజు నన్నయ తిక్కనలమీద అపార భక్తిశ్రద్ధలు కలవారు. అందులోను ఎఱ్ఱనార్యుడు పుంజీభవించిన వినయమూర్తి. నోరార నన్నయ తిక్కనలను తన గ్రంథాల్లో పొగిడాడు. అంతేకాక నన్నయ కవితా రీతి కొంత కనబడునట్లు ఆరణ్యపర్వశేషం వ్రాశాడు. హరివంశంలో తిక్కనసోమయాజి పథము వెంట నడిచి సంస్కృతము పాలుతోపాటు చిక్కని తెలుగురచనకూడా సాగించినాడు. గోప జీవితమును ఈయన పరిశీలించినంత సన్నిహితంగా ఏ తెలుగు కవీ పరిశీలించలేదు. ఆ ఘట్టాలు వర్ణించడంలో చక్కని తెలుగు నుడికారాన్ని ప్రదర్శించాడు. మానవ హృదయాన్ని, మాతృ హృదయాన్ని ఈయన అచ్చపు తెలుగుతనంతో వర్ణించాడు. యశోద బాల కృష్ణునకు వెన్నలు పెట్టడం

> " ముదముతో గడ్పునకుబెట్టి మూతిజిడ్డు మోమునను మేనజమరి యమ్ముదిత యక్కు గలయ నిమురు, నేనుగుదిన్న వెలగపండు నాగనొప్పు గృష్ణుడు చారునయనుడగుచు. "

(హరివంశము)

బమ్మెరపోతరాజు కూడ నన్నయ తిక్కనలయందపారమైన భక్తిగలవాడే. తన్ను అనుగ్రహించుటకై వారు భాగవతంకూడా వ్రాసిపెట్టకుండా మిగిల్చారని కృతజ్ఞతతో చెప్పుకున్నాడు. సంస్కృతప్రియులను సంస్కృత భూయిష్ఠరచనతోను తెనుగువచ్చే వారిని తెలుగు నుడికారంచేతను ఆరాధిస్తానని ప్రతిజ్ఞచేసి నిలుపుకొన్నాడు. అయినప్పటికీ పోతనమీద ఆయనకు కొంత ముందర వర్ధిల్లిన నాచన సోమనాథుని ప్రభావం అధికంగానే పడింది. పోతన రచనలో సంస్కృతపు పాలు కొంత ఎక్కువగా కనబడుతుంది. కవుల పాండిత్య ప్రదర్శనానికి వచనము ఒక రంగంగా తయారయింది. దీర్ఘములైన పట్టికలు, శ్లేష యమకాదులు గుప్పించడానికి వచనము ఒక సాధనంగా దిగజారింది. వచనంలో ఉండవలసిన ప్రసన్నత, వైశద్యము లుప్త ప్రాయములయాయి. ఆలంకారిక రచనమీద మోజుకూడా విస్తారమయింది. నన్నయ భట్టు వచన రచన పద్యరచనలాగే చాలవరకు సులభంగా ప్రసన్నంగా ఉన్నా కద్రూ వినతల ఘట్టంలో సముద్ర వర్ణనచేస్తూ చమత్కారంకోసం రెండు మూడు శ్లేష వాక్యాలు మార్చాడు.

" ఉద్యానవనంబునుంబోలె బహువిద్రుమలతాలంకృతంబైనదాని, నాటకప్రయోగంబునుంబోలె ఘనరసపాత్ర శోభిత రంగరమ్యంబైనదాని, దివంబునుంబోలె నహిమకరభరితంబైనదాని "

( ఆది 227 )

దీని నాధారంగా చేసుకొని అనంతర కవులు వచనంయొక్క ముఖ్య ప్రయోజనం బలిచేసి భాషా సంబంధమైన గారడీలు చేస్తూవచ్చారు. పోతరాజుగారి పద్య రచనలో కొట్టవచ్చినట్లు కనపడేది అంత్యానుప్రాస ప్రీతి. ఇది సార్వత్రికంగా ఉంది.

'పుణ్యుడు రామచంద్రుడటువోయి ముదంబున గాంచె దండకా
రణ్యము, తాపసోత్తమ శరణ్యము నుద్ధత బర్హి బర్హ లావణ్యము'

ఇట్లాంటి రచనపై ఆయనకు మక్కువ. నన్నయ కాలపు భాషకూ ఇప్పటికీ క్రియారూపంలో స్వల్పమైన మార్పు వచ్చింది. భూతార్థాన్ని ఎను ప్రత్యయంతోకాని క్రియాజన్య విశేషణ పూర్వక తచ్ఛబ్దంతోగాని ప్రకటించడం నన్నయ పద్ధతి. చేసినవాడు, చేసినయది ఈ విధంగా. ఉండినవాడు అనే రూపం బమ్మెరపోతన నాటికి సమీకరణం చెంది ఉన్నాడుగా మారింది.

" ఉన్నాడా బలభద్రుడుగూడి సుఖియై యుత్సాహియై ద్వారకన్'

భాగవతము

ఈ మహాకవి రేఫఱకార సాంకర్యం చేశాడనీ, అందుచేత ప్రామాణిక కవిగా పరిగణింప బడడం లేదన్నట్లు అప్పకవి ఒక అభాండం వేశాడు. కూచిమంచి తిమ్మకవి దానిని ఖండించినాడు. దీనికి మరొక విధంగాకూడా సమాధానం చెప్పవచ్చును. రేఫద్వయ స్ఫుట శ్రవణము పోతన నాటికి అస్తమిస్తూందని, లోకమర్యాదనే ఆయన పాటించాడనీ కూడా భావించవచ్చు. ఏమైనా నన్నయ తిక్కనల తర్వాత సర్వాంధ్ర జనామోదం పొందిన కవి ఆంధ్ర భాగవత కర్త యనడంలో రెండు మతాలు లేవు. ఆయన శిల్పించుకొన్న సాహిత్య భాష తెలుగువారి హృదయాలకు మిక్కిలి సన్నిహితం అవడంలో విప్రతిపత్తి లేదు.

నన్నయ తిక్కనల వారసులము అని చెప్పుకొంటూనే వారి మార్గానికి దూర రేఖలలో ప్రయాణించినవారు నాచన సోమనాథుడు, శ్రీనాథుడు. నాచన సోముడు ఎఱ్ఱాప్రెగడకు అవర సమకాలికుడగుచున్నాడు. బమ్మెర పోతరాజు శ్రీనాథుని పూర్వవయస్సులో పైకి వచ్చుచున్నాడు. నాచన సోముడు కవిత్రయమునకు దీటైన

మహాకవియని కొందరును, వారికన్న ఒక చూపువాసి అధికుడు కావచ్చునని కొందరును విద్వాంసులు ప్రశంసించారు. పండితలోకంలో అతడట్టివాడే అనుట నిర్వివాదము. కాని పాఠక సామాన్యము ఆతనివైదుష్య స్థాయిని అందుకోవడం కష్టసాధ్యము. పద్యశిల్పాన్ని అతడు నిశితంగా ఉపాసించి అనుష్ఠించాడు. ఉత్తరహరివంశము చిన్న గ్రంథం అవడంచేత దానిలో శిల్పాన్ని ఎంతో తరిమెన పెట్టడం సాధ్యం అయింది. అదే కనుక అష్టాదశ పర్వ నిర్వహణ సంభృతమై పేరుపొందు మహాభారతమైతే తిక్కన సోమయాజికి సాధ్యపడని శిల్పవిన్నాణము సోమునికి సాధ్యమవుతుందనుకోడానికి వీలులేదు. అపారమైన సంస్కృతాంధ్ర వైదుష్యము, గంభీరమై విశృంఖలమైన భావవిహారము, వక్రోక్తినిబిడమైన భాషాకల్పనము, కుప్పలు తిప్పలు తెలుగు సామెతలు ఇవి నాచన సోముని కవితలో కొన్ని స్ఫుట రేఖలు. ఒక్కొక్క సన్నివేశాన్ని స్థూలంగా ఆకారచిత్రముగాకాక అంగప్రత్యంగ వర్ణనలతో, ఆయా సందర్భాలకు అవసరమైన పరిభాషా పదాల్తో చిత్తజల్లుగా వర్ణించడం ఇతని పద్ధతి. పరిమిత విస్తీర్ణంగల కావ్యంలో ఇది సాధ్యము. ఇదే ప్రబంధ రచనకు పురోచన అయింది. సీసపద్యాన్ని సమ విభక్తాంగములు కలుగునట్లు, తూగుతో, శబ్దాలంకార ఆవృత్తితో రచించే నేర్పు కవులకు ఈతడు నేర్పినదే అంటారు. వీటిల్లో ఒక్కొక్క పదం ఆరంభమునందో, మధ్యమందో, అంతమందో మళ్ళీ మళ్ళీ వచ్చి పాఠకుణ్ణి జోకొట్టినట్టు తట్టుతుంది.

' అభ్రంకషంబైన యాలపోతునితండు
పెంచినాడాతడు త్రుంచినాడు. ఉ|| హరి||

తిక్కన సోమయాజికి ఈ శిల్పం తెలియనిది లేదు.

' ఎవ్వని వాకిట నిభమద పంకంబు
రాజభూషణ రజోరాజి నడగు'

ఇట్టి సమాంతర రచనను స్పృశించి విడిచినవారు పూర్వ కవులు. గాఢాలింగన బంధములో చొక్కినవారు ప్రబంధకవులు. నన్నెచోడుడు, నాచన సోముడు. శ్రీనాథుడు, పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుడు, అల్లసాని పెద్దన ఈ క్రమంగా ప్రబంధమాకందము సంవర్ధితమయింది. ప్రబంధ భాషలోని బలదౌర్బల్యాలు నాచన సోముడు ఆనంతరికులకు సమర్పించిన వారసత్వము. గాఢ చింతనముచే సోముని కావ్యంలో కలిగిన సాహిత్యానందము 'లంకమేతకు - ఏటి ఈతకు సరి' యన్న సామెతకు లక్ష్యం అవుతుంది.

పాకనాటివాడును కమలనాభామాత్యుని పౌత్రుడును అయిన శ్రీనాథుడు మహా విద్వాంసుడు. జీవిత దృశ్యాన్ని గ్రంథాలనుండి వినుకలిచేత కాక యావదాంధ్ర పర్యటనంచేతా కనుకలిచేత, సూక్ష్మంగా అవగతం చేసుకున్నాడు. పెద్దలలో పెద్ద; చిన్నలలో చిన్న. శృంగార నైషధము, కాశీఖండమువంటి పాషాణ సదృశకావ్యాలూ వ్రాయగలడు. పల్నాటి వీర చరిత్రవంటి దేశిఛ్ఛందోమయ రచన కూడా చెయ్యగలడు. ఇంకా చిల్లర మనస్తత్వంకూడా చూపించగలడు. కవుల్లో అపురూపమయిన సున్నితమైన హాస్యం విసరగలడు.

" రసికుడు పోవడు పల్నా
డెసగంగా రంభయైన నేకులె వడకున్
వసుధేశుడైన దున్నును
కుసుమాస్త్రుండైన జొన్నకూడే కుడుచున్ " చాటువు.

"ముగురంగూర్చిన ముండదైవమునకున్ మోమోట లేదోకదా" భీమ,

ఇప్పటి నుంచీ కవులు వినయంకన్న ఆత్మవిశ్వాసము కొంత అహంకృతి బాహాటంగా ప్రదర్శిస్తూంటారు.

"బ్రాహ్మీదత్త వరప్రసాదుడ వురుప్రజ్ఞా విశేషోదయ్యా జిహస్వాంతుడ వీశ్వరార్చనకళా శీలుండ వభ్యర్హిత బ్రహ్మాండాది మహాపురాణ చయ తాత్పర్యార్థ నిర్ధారిత బ్రహ్మజ్ఞాన కళానిధానమవు నీ భాగ్యంబు సామాన్యమే"

అన్నాడు కృతిపతి ఈయనను గురించి. బ్రహ్మాండాది పురాణాలు నన్నపార్యుడు కూడా పరిశీలించాడు, "బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతు" అని భయంతో ఒక విద్యార్థి గురువు గారికి నివేదించినట్లు నివేదించుకున్నాడు. నీయంత వాడు లేడని కృతిపతి చేత చెప్పించుకొన్నాడు శ్రీనాథుడు. ప్రబంధ పూర్వయుగం నుంచీ కవుల మనఃప్రవృత్తులలో కలిగిన మార్పే వారి శైలియందు, తదధీనమైన, తత్కాల సాహిత్య భాషయందు ప్రత్యక్షమవుతుంది.

పూర్వమహాకవుల శైలీ విభేదాల్ని తాను చక్కగా ఆకళింపు చేసుకున్నాడని శ్రీనాథుడు పేర్కొన్నాడు.

" వచియింతు వేములవాడ భీమన భంగి
ఉద్దండలీల నొక్కొక్కమాటు

భాషింతు నన్నయభట్టు మార్గంబున
　　ఉభయ వాక్ప్రౌఢి నొక్కొక్క మాటు
వాక్రుత్తు తిక్కయజ్వ ప్రకారము రసా
　　భ్యుచితబంధముగ నొక్కొక్క మాటు
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవ
　　సూక్తి వైచిత్రి నొక్కొక్క మాటు"

శ్రీనాథుని శక్తి సామర్థ్యాలు ఎట్లా ఉన్నా సాహిత్య శైలులు ఎన్నివిధాలుగా ఉండాలో మనకు చక్కగా తెలిపాడు. దానిలో ఉద్దండరీతి, ఉభయవాక్ప్రౌఢి, రసాభ్యుచిత బంధము, సూక్తి వైచిత్రి ఇన్ని ఉండాలి. కవిత్వం తేలికగా సర్వజనులకు అర్థ మయేటట్లు ఉండాలనడం కొంతవరకూ మాత్రమే గ్రాహ్యమవుతుంంది. అది వట్టి పేలపిండివలె ఆద్యంతం ఉంటే అది మాత్రం నిలుస్తుందా? నిలువదు, తెలిసిన వారి చేత, తెలియని వారి చేతకూడా ఔననిపించుకునేటట్లు ఉండాలి. శ్రీనాథుని కాల నుంచీ కవిత్వం విద్వాంసులు మెచ్చుకునేటట్లు ఉండాలనే భావం నిరూఢమం. సామాన్య సాహిత్యానందం విస్మరింపబడింది. ఇక్కడే మనము వారితో భిన్నిస్తున్నాము. భీమేశ్వరపురాణంలో సత్కావ్యం ఎట్లా ఉండాలో శ్రీనాథుడు చెబు తున్నాడు.

"హరచూడా హరిణాంక వక్రతయు
　　కాలాంత స్ఫురచ్చండికా
పరుషోద్గాఢ పయోధరస్ఫుట తతీ పర్యంత కాఠిన్యమున్
　　సరసత్వంబును సంభవించె ననఁగా సత్కావ్యము ల్దిక్కులం
జిరకాలంబు నటించుచుండుఁ గవిరాజీగేహ రంగంబులన్".

భీమఖండము 1.11

కవిత్వ భాష 'కట్టె కొట్టె తెచ్చె' అన్నట్లు సూటిగా ఉండదు. అది ఈశ్వరుని మౌళియందలి అర్ధ చంద్రునివలె వక్రంగా ఉండాలి. కాలభామినీ స్తనతటమువలె మృదు కఠినంగా ఉండాలి. దానిలో రసానుకూలత ఉండాలి. లేకపోతే ఆ కావ్యము కవి సమాజము వారి హృదయగేహములలో కలకాలం నివాసం చెయ్యదు. నిజమే. మహా కవి వచించినది ప్రత్యక్షర సత్యమే. నైషధము, భీమఖండ కాశీఖండములలో శ్రీనాథుని భాష రెండు పాళ్ళు ఉన్నత సంస్కృతంగాను, ఒకపాలు మురిపెమైన తెలుగుగాను

ఉంటుంది. హరవిలాసం శివకవి సంప్రదాయాలకు దగ్గరగా ఉండి దేశీయతాముద్ర ఎక్కువ కలిగి ఉంటుంది.

శ్రీనాథుని కాలానికి ఆంధ్రదేశంలో మునల్మానుల ప్రమేయం అధికమయింది. కాకతీయ సామ్రాజ్యం అస్తమించి ఇంచుమించు ఒక శతాబ్దం కావచ్చింది. దాని స్థానంలో ఏర్పడిన ప్రాగాంధ్రమునందలి రెడ్డిరాజ్యము పశ్చిమాంధ్రమునందలి పద్మ నాయక రాజ్యము బహమనీ సుల్తానులతో ఒకప్పుడు మైత్రి ఒకప్పుడు వైరమూ వహించేవి. వారియాస్థానమునకు వీరును, వీరి సభాంతరములకు వారును వచ్చిపోవుట జరిగేది. ఈ విధంగా ఏర్పడిన రాకపోకలచే సాంఘిక సంబంధాలుకూడా ఏర్పడ్డాయి. ఒకరి భాషలు ఒకరు నేర్వవలసివచ్చేది. శృంగారనైషధ కృతిపతియు పెద్దకోమటివేమా రెడ్డి మంత్రియు ఐన మామిడి సింగనామాత్యుడు తురుష్కభాషలు కొంత నేర్చినాడు. బహమనీవారి సభాంగణంలో ఆయన పారసీ భాషలోనే ప్రసంగించి యుండవచ్చును. కావుననే 'యవనాధీశసభా నిరంకుశవచోవ్యాపారపారాయణా' అని ఈ మంత్రి సత్తముడు సంబోధింపబడ్డాడు. రాజమహేంద్రవర రెడ్డి రాజ్యపు అమాత్యుడైన బెండ పూడి అన్నమంత్రి బహుభాషావేత్త. ఈయనకు అరబీభాష, పారసీ, ఓఢ్రము, కర్ణాట భాష మొదలైన పెక్కుభాషలు చక్కగా వచ్చును. వాటిని వ్రాయడం చదవడం ఆయనకు బాగా పట్టుబడ్డాయి. రాజకీయ సంబంధాల మూలంగా హిందువులకు మున ల్మానులకు ఆచార వ్యవహారాల్లోను భాషాపద్ధతుల్లోను కొంత ఆదాన ప్రదానం జరగడం ప్రారంభించింది. శ్రీనాథుడు శుద్ధశైవుడూ, నైష్ఠికుడైననూ వ్యవహారజ్ఞానం కలవాడు. సమయానుకూలంగా వేషం మార్చగలవాడు. విజయనగర ఆస్థానా కి వెళ్ళినప్పుడు శుద్ధశ్రోత్రియ వేషంమార్చి దర్బారీవేషం ధరించినట్లు 'కుల్లాయుంచితి, కోకచుట్టితి, మహాకూర్పాసమున్ దొడ్గితిన్' అనే చాటువులో చెప్పుకొన్నాడు. ఆంధ్ర భాష తురుష్కభాషలూ కొన్ని పదాలు ఇచ్చిపుచ్చుకోవడం కూడా ప్రారంభమయింది. అన్యదేశ్యాలు తెలుగులోకి రావడానికి ఇది అరుణోదయ సమయము, బ్రాహ్మీ దత్త వరప్రసాదుడైనా శ్రీనాథుడు పరివర్తన సహమైన సంస్కారం కలవాడు. అతనికి నచ్చిన మ్లేచ్ఛపదాల్ని మిక్కిలి సహజంగా తెలుగు పద్యాల్లో పొదిగి సంస్కృతీ సమన్వయానికి బీజాలువేశాడు. హరవిలాసంలో బహమనీరాజు ఫిరోజుషాను గురించి ప్రసంగంరాగా, "ఖుసిమీరన్ సురధాణి నిండుకొలువై కూర్చొన్నచో" అని ఖుషి సంతోషము అనే శబ్దాన్ని ఒడుపుగా వాడుకొనున్నాడు. ఈ యాదానప్రదాన పదతి ఉత్తరోత్తరా చాలా బలపడింధి.

ఉద్దండ సంస్కృత విద్వాంసుడయినప్పటికీ శ్రీనాథుడు తోచినచోట తెలుగు నుడికారము పుణికిపుచ్చుకొన్నట్లు వ్రాయగలడు. సంభాషణశైలి ఈతనిది మిక్కిలి సహజంగా ఉంటుంది. కాశీఖండం చతుర్థాశ్వాసంలో గుణనిధి కథయందు యజ్ఞదత్తుడు భార్యతో పలుకుట "యజ్ఞదత్తుం దర్ధముండితంబైన మూర్ధంబున సీర్కావిధోవతి నతిముటిజుట్టుకొని యింటికేతెంచి మొగంబుగంటువెట్టుకొని సోమిదమ్మ ! ఏమిచేయు చున్నదానవు ! ఇటురమ్మ, నీ కొడుకెక్కడంబోయె, పోవుగాకేమి, వినుమని యిట్లనియె"

## ప్రబంధయుగము – సాహిత్యభాష

కవుల భావములనుబట్టి, లక్ష్యాలనుబట్టి సాహిత్య భాష మారుతూండడం కడు సహజమైనది. నన్నయాదుల సాహిత్య లక్ష్యాలు కాలంగడచిన కొద్దీ మారుతూ వచ్చాయి. సంఘజీవితమే క్రొత్తరూపుధరించింది. నన్నయ తిక్కన్నల నాటి వేగి దేశము కాని, పాకనాడు గాని ఇప్పుడు లేవు. 'అనఘమై, శిష్టాగ్రహార భూయిష్ఠమై, ధరణీ సురోత్తమాధ్వర విధాన సమృద్ధమైన' పుణ్యదేశములు కావు అవి ఇప్పుడు. దేశం చాలా భాగం ముసల్మానుల యేలుబడిలోకి వచ్చింది. వైదిక ధర్మానికి ఎట్టి దుర్గతి పట్టిందో ముసునూరి ప్రోలయనాయకుని విలస తామ్రశాసనము, అనితల్లి కలువ చేరు శాసనము వంటి వానివలన తెలుస్తుంది. తుంగభద్రకు దక్షిణాన ఇంకా వేదాది విద్యలు విజయనగర సామ్రాజ్యంలో తలదాచుకుని ఉన్నాయి. ప్రభువుల యొక్కయు ప్రజల యొక్కయు చిత్తవృత్తులు, వేషభాషాదులు, అభిరుచులు మారిపోయాయి. భోగ పరాయణత్వం తలయెత్తింది. పెద్దపెద్ద రాజ్యాలవడం చేత రాజులకూ ప్రజలకూ నడుమ ప్రత్యక్షసంబంధం తగ్గింది. ప్రజాభ్యుదయ దృష్టి కొంత సడలింది. ప్రజలను వెంట తీసుకువెళ్ళే పరిస్థితులిప్పుడు లేవు. రాజధానీనగరానికి, రాజాంతఃపురానికి ప్రాధాన్యం అపారమయింది. నగరము అభిరుచులే పల్లెలకు మార్గదర్శకములు.

ఇటువంటి సాంఘిక రాజకీయ పరిస్థితుల్లో కవులు గంటంపట్టి వ్రాస్తున్నారు. వారు మహారాజులు, సంపన్నులైన సామంతుల కోసం వ్రాయాలి. వారి అనుగ్రహం కలిగితే అగ్రహార, ఆందోళికాచ్ఛత్ర చామరాదులు లభిస్తాయి. లేకపోతే నిప్పచ్చర మైన పేదరికం అనుభవించాలి. రాజసభాంతరాళములందలి విద్వాంసులే కావ్యశ్రోతలు. వాటి గుణదోషనిర్ణేతలు. ఆస్థానపండితులు కాదంటే సాక్షాత్తు ఈశ్వరుడు వ్రాసిన పద్యానికైనా రాజసన్మానం దొరకదు.

"ఈ రాజన్యుని మీద నే గవిత సాహిత్య స్ఫురన్మాధురీ, చారుప్రౌఢిమ జెప్పి పంప విని మాత్సర్యంబు వాటించి నత్కీరుం డూరకె తప్పువట్టెనటయేదీ యలంకారంబో పదబంధమో రసమొ చక్కంజెప్పుడా తప్పునన్ అని ధూర్జటి కవీంద్రుడు పరమ శివునిచేత రాజుసభలో ఫిర్యాదు చేయించాడు. పింగళి సూరనార్యుడు కూడా కళా పూర్ణోదయంలో ఇటువంటి సన్నివేశాన్నే కల్పించాడు. ఈ కారణం చేత కవులు ఒక రిని మించి ఒకరు వైదుష్యం ప్రదర్శించడానికి, చమత్కారిత్వం చూపడానికి తాప త్రయ పడేవారు. ఈ ప్రయత్నంలో సాహిత్య భాష ఉన్నతోన్నత శిఖరాలకు అధిరో హించి, కొంత కృతకము, సామాన్యులకు దుర్గ్రాహ్యముగా పరిణమించింది. పూర్వ యుగాల్లో మృదు, కఠిన, కఠినతర భాషా శ్రేణులుండేవి. ఇప్పుడు కఠిన, కఠినతర శ్రేణులు రెండేమిగిలాయి. సంభాషణా ప్రధానమైన కవిత్వంలో కొంతమార్దవం, జాతీ యత, సామెతలు తప్పవు. ప్రబంధకవిత్వం విస్తారంగా వర్ణనాత్మకంగా ఉండడం చేత శైలిని మృదువు పరచవలసిన ఆవశ్యకత తగ్గింది. కవిదారి కవిది. పాఠకుని దారి పాఠ కునిది.

సాహిత్య లక్ష్యమేమిటి అనే విషయంలోకూడా కవుల్లో పెద్ద మార్పు వచ్చింది. జగద్ధితము, జన్మాంతర దుఃఖరాహిత్యము అనే లక్ష్యాలు సడలి పోయాయి. శ్రీ కైవల్య పదంబు చేరుటకునై చింతించెదన్' అనే ప్రయత్నము వెనుక పట్టింది. అపూర్వ భావాలతోను అద్భుత సమాస ఘటనలతోను సభను దద్దరిల్ల చేయడమే కవి కోరు కొనేది. దాని వలన రాజసన్మానం లభిస్తుంది. ధర్మబుద్ధి తగ్గక పోయినను దానిపై అంతనిష్ఠ లేదు. కావ్యము ఉపదేశమియ్యవలెనను దృష్టి సన్నగిల్లింది. అల్లసాని పెద్దనగారు దిద్ది తీర్చిన ప్రవరుడు, శ్రీ కృష్ణదేవరాయలవారు వర్ణించిన విష్ణుచిత్తుడు వంటివారు బొత్తిగా లేకపోలేదు. వేదాంతము, రాజనీతి ప్రసంగాలు ఆముక్తమాల్యద లోనే వినవస్తున్నాయి. కృతికర్తలయు, కృతిభర్తలయు దృష్టి శృంగార రస పోష ణముపై లగ్నమైయున్నది శృంగారము వివిక్తముగా నుండదగినదే కాని బట్టబయలు చేయదగినది కాదు. ఈ కారణంచేతకూడా భాష గోప్యంగాను వక్రోక్తి ప్రాచుర్యం గాను ఉండవలసిన ఆవశ్యకత ఏర్పడినది. అలంకారాల్లో ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, శబ్దచిత్రాలు కవులకు శ్రోతలకు ఎక్కువగా రుచించినాయి. ఈ యుగ నాయకులని చెప్పదగిన అల్లసాని పెద్దన, శ్రీకృష్ణదేవరాయలు వీరిద్దరియందును ఈ లక్షణాలు చూడనగును. వీరిలో ఒకరిపై ఇంకొకరికి అపారమైన గౌరవ ప్రేమలు. వీరిద్దరు ఒక నాణెముయొక్క రెండువైపులుగా కనిపిస్తారు. ఒకరిది మింటిచూపు. మరొకరిది

మంటిచూపు. సామాన్య సంసారియైన పెద్దన భోగ జీవితాన్ని ఊహిస్తాడు. చక్రవర్తియైన కృష్ణదేవరాయలు దారిద్ర్యాన్ని, కాయక్లేశాన్ని ప్రత్యక్షీకరించుకోడానికి యత్నిస్తాడు. రాయలు పెద్దనామాత్యుని ఇట్లా సంభావించాడు.

హితుడవు, చతురవచోనిధి
వతుల పురాణాగమేతిహాస కథార్థ
స్మృతియుతుడ వాంధ్ర కవితా
పితామహుడ వెవ్వరీడు పేర్కొన నీకున్.

'శిరీషకుసుమపేశల సుధామయోక్తుల'లో స్వారోచిష మనుసంభవము వ్రాయమని కోరాడు. అయినా ఈ పేశలోక్తులు సంభాషణల్లో మాత్రమే కొంత లభిస్తాయి

'ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ యొంటిజరించె దోటలే కిప్పవనభూమి'

'పాటున కింతులోర్తురె కృపారహితాత్మక, నీవు త్రోవ ని
చ్చోట భవన్నఖాంకురముసోకె గనుంగొనుమంచు జూపియ
ప్పాటల గంధివేదననెపంబిడియేడ్చె'

మనుచరిత్ర

విష్ణుచిత్తుడు మన్నారుదేవునితో విన్నవించుట
'గృహ సమ్మార్జనమో జలాహరణమో శృంగార పల్యంకికా
వహనంబో, వనమాలికా కరణమో వాల్లభ్యలభ్యధ్వజ
గ్రహణంబో, వ్యజనా తపత్రధృతియో, ప్రాగ్దీపికారోపమో
నృహరీ ! వాదము లేల లేరె యితరుల్ నీలీలకున్ బాత్రముల్'

ఆముక్తమాల్యద

వర్ణనా సందర్భములందు తెలుగును విడిచి కవులు సంస్కృతాన్నే ఎక్కువగా ఆశ్రయించడం ఈ ప్రబంధయుగ సాహిత్యలక్షణము. ప్రవరుణ్ణి వర్ణిస్తూ పెద్దన 'ఆ పురి బాయకుండు మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి' అని సమాస గంభీరంగా వ్రాస్తే, విష్ణుచిత్తుణ్ణి వర్ణిస్తూ 'అందుండున్ ద్వయ సద్మ పద్మవదనుండ ద్వంద్వాడ శ్రాంతయో గాందూబద్ధ మధుద్విషద్విరదుడు' అంటూ రాయలవారు ప్రౌఢతరంగా సాగిస్తారు. హిమవత్పర్వతాన్ని వర్ణిస్తూ పెద్దన 'అటచనికాంచె భూమిసురుడంబర చుంబి శిరస్సరజ్ఝరీ పటల ముహుర్ముహు ర్లుఠ దభంగ తరంగ మృదంగ' ఇత్యాదిగా అనుప్రాస మోహనంగా వ్రాస్తే, రాయలవారు మాలదాసరి చూచిన మట్టిచెట్టును 'కాంచెన్ వైష్ణవు డర్ధయోజన' ఇత్యాది శార్దూల వృత్తం అంతా నిండే ఏకసమాసఘటన

చేశారు. ఇట్లు చూపెట్టడం ఈ మహాకవుల సారస్వత సృష్టికి న్యూనత ఆపాదించుట కొరకుగాదు. ఏనాడు తెలుగుభాష హిమాలయ తుంగ శృంగసమున్నతమైన ఈ రచనల్ని ఉపేక్షిస్తుందో అది తెలుగుభాష దారిద్ర్యానికే కాని ఆసారస్వతమూర్తుల ఇద్ధకీర్తికెట్టి క్షతియులేదు. ప్రభుచిత్తవృత్తితో రాయలు కొంత భాషా స్వాతంత్ర్యం కూడా పాటించినట్లు లాక్షణికులు భావిస్తారు. స్త్రీ వాచకములకు అకారాంతములకు సంధిచెయ్యడం. గంగనుకాసె, శ్రీరంగభర్తంచు, లఘిమందు, చేష్టుడిగివంటివి. అన్య దేశ్యాలు, వైష్ణవపరిభాషాపదాలు, అప్రసిద్ధ సంస్కృతపదాలు వాడడం ఈయన రాజసలక్షణం. నానావిధ మనుష్యజీవితాన్నేకాక పశుపక్ష్యాదుల స్వభావాన్ని కూడా గుర్తించి వర్ణించడం ఈయన సల్లక్షణము. ప్రకృతి పరిశీలనలో కృష్ణరాయలను మించిన తెలుగుకవి లేడు.

ప్రబంధయుగంలో రెండు భాషా ప్రయోగాలు జయప్రదంగా నిర్వహింపబడ్డాయి. అందొకటి ఆంధ్రభాషకుగల ద్వ్యర్థి సామర్థ్యము. రెండవది శుద్ధాంధ్రభాష సమగ్ర కావ్యరచనానుకూలమని నిరూపించడం. సంస్కృతాంధ్ర పదజాలము యొక్క కలయికచేత ఈ భాషకు అపూర్వమైన శ్లేషఘటనాశక్తి అబ్బినది. దీనిని మొదట గుర్తించిన వాడు మహామేధావియైన పింగళి సూరనార్యుడు. తాను రచించిన రాఘవ పాండవీయమనే ద్వ్యర్థికావ్యంలో సూరనార్యుడు ఈ యద్భుత ప్రయోగంచేసి ఆమూలాగ్రంగా నిర్వహించినాడు. ఇదియెంత కష్టసాధ్యమో కృతిపతిచేత చెప్పించాడు.

> "రెండర్థంబుల పద్యమొక్కటియు నిర్మింపంగ శక్యంబుగా
> కుండుండ్దగ్గతి కావ్యమెల్లనగునే నోహో యనంజేయదే
> పాండిత్యంబున నందునుందెనుగుకబ్బంబద్భుతం బంద్రు ద
> క్షుండెవ్వాడిల రామభారత కథల్ జోడింప భాషాకృతిన్"

దానినెట్లా సాధించాడో ఆయనే వివరించాడు. సభంగశ్లేష, అభంగశ్లేష, సంస్కృతాంధ్రభాషాశ్లేష మొదలైన పెక్కు రీతులు కల్పించుకొని నైపుణ్యంతో రెండర్థాలు జోడిస్తూ రామాయణ భారతకథలు ఏకకావ్యంగా కూర్చాడు. ఉదాహరణకు - వినియతనిందనపై నిడుకొని - అనేదాన్ని (1) విని, అతనిన్. తనపై నిడుకొని అనియు (2) వినియత, నిందన, తనపై నిడుకొని అనియు వేర్వేరుగా పదచ్ఛేదం చేసుకొని రామభారతకథల పరంగా అన్వయించుకోవాలి. పింగళి సూరనకు సమకాలికుడైన రామరాజభూషణుడు తన హరిశ్చంద్రనలోపాఖ్యానంలో ఇటువంటి ప్రయో

గాన్నే గొప్ప పాండిత్యంతో నిర్వహించాడు. రానురాను ఈ ప్రక్రియ నాలుగర్థాల కావ్యాలదాకా వ్యాపించింది. మొదటి ద్వ్యర్థి కావ్యాల్లో స్పష్టాస్పష్టంగా ఉండే రస ప్రమేయం బొత్తిగా అదృశ్యమయింది. తిక్కన సోమయాజి తరువాత స్వతంత్ర భావనా సంపదగల మహాకవి పింగళి సూరనార్యుడే అని విజ్ఞులు భావిస్తారు.

ఇక రెండవ భాషాప్రయోగం అచ్చతెలుగు కావ్యం వ్రాయడం. ఇక్కడ అచ్చతెనుగు అనగా తత్సమశబ్దరహితమైన భాష అన్నమాట. దానిలో తద్భవాలు, దేశ్యాలు, అన్యదేశ్యాలు కూడా చేరుతాయి. తత్సమ శబ్దరహితంగా కూడా కావ్యం అంతా వ్రాయవచ్చునని నిరూపించిన బుద్ధశాలి పొన్నికంటి తెలగనార్యుడు. ఇతడు గోల్కొండ రాజ్యంలో వర్ధిల్లినవాడు. ఇబ్రహీమ్ కుతుబుషా అనుచరుడైన అమీను ఖాను అను సర్దారుకు తన అచ్చతెలుగు కావ్యమైన 'యయాతిచరిత్ర' ను అంకితం చేశాడు. శుద్ధాంధ్ర కావ్యాన్ని గూర్చి కృతిపతి ఈ విధంగా అన్నాడు.

"అచ్చతెనుంగు బద్దె మొకటైనను గబ్బములోన నుండినన్
హెచ్చని యాడుచుందురది యెన్నుచు నేర్పున బొత్తమెల్ల ని
ట్లచ్చ తెనుంగునన్నొడువ నందుల చంద మెఱుంగువారెదన్
మెచ్చరొ యబ్బురంబనరొ మేలనరో కొనియాడరో నినున్"

ఇదికూడా చమత్కారమైన ప్రయోగమే. సంస్కృతభాషా సహాయం లేకుండా తెలుగు కొంతైనా తలయెత్తి తిరుగగలదని నిరూపించినమాట నిజమే. తరువాతి కాలంలో కూచిమంచి తిమ్మకవిసార్వభౌమునివంటి వారు దీనికి బలంచేకూర్చారు. ఇది వేరింటి కాపురం పెట్టగలమని నిరూపిస్తుందేకాని స్థిరమైన సంతోషం ఇవ్వజాలదనడం ఈ జాతి కావ్యాలు వ్రేళ్ళమీద లెక్కింపదగినవిగా ఉండడమే నిదానము. పరిమితమైన కావ్యప్రయోజనాలకు ఇది సరిపడినా విస్తృతము, అనంతముఖము అయిన భాషా ప్రయోజనాలకు అచ్చ తెలుగు చాలదని పూర్వులే గుర్తించారు. అచ్చ తెలుగు భాషలో ఒక చిన్న కథగాని లేఖగాని వ్రాసినా మనమిప్పుడు అర్థంచేసుకోలేము. 'ప్రొదెనుగు కమ్మ' అని గిడుగు రామమూర్తి పంతులుగారు వ్రాసిన రచనయే దీనికి సాక్ష్యము.

## తంజావూరు యుగము

విజయనగర పతనానంతరము దక్షిణ భారతదేశంలో అనగా తమిళదేశంలో నాయకరాజుల ఆస్థానాల్లో తెలుగు సాహిత్యం 17వ శతాబ్దంలో చక్కని ప్రకాశం

చెందింది. అందులో తంజావూరు రాజ్యం విశిష్టస్థానం అలంకరిస్తూండడంచేత దీన్ని తంజావూరు యుగము అన్నాము. మధుర, మైసూరు, పుదుచ్చేరి మొదలైన సంస్థానాలు కూడా ప్రశంసనీయమైన సేవచేశాయి. ఈ యుగంలో చిరకాలం నుంచి వస్తూన్న ప్రబంధ ప్రక్రియయేకాక ఎన్నో ఇతర ప్రక్రియలు ఆచరణలోకి వచ్చాయి. ముఖ్యంగా వచనము. ఇదివరలో చంపూకావ్యాల్లో అక్కడక్కడ చిలకరించినట్లు మాత్రమే కన్పడే గద్య ప్రక్రియ ఈ యుగంలో ప్రత్యేక రూపందాల్చి సంపూర్ణ వచనైక గ్రంథాలుగా అవతరించింది. రామాయణ భారత కథలూ, తీర్థమాహాత్మ్యాలు వంటి గద్య రచనలు బయలుదేరాయి. యక్షగానము అనే పేరుతో నాటక ప్రక్రియ కూడా విరివిగా వ్యాపించింది. ఇది దేశీయ నాటక పద్ధతి. సంగీత బహుళమై కొన్ని నాటక లక్షణాలు గలిగిఉంటుంది. సంస్కృత నాటకం అంత శాస్త్రీయ పద్ధతిమీద ఉండదు కాని దేశీయమగుటచేత ప్రజల్ని, ప్రభువుల్ని కూడా చాలా ఆకర్షించింది. శతక రచన ప్రాచీనం నుంచీ ఉంటూన్నా అప్పుడు విరళ విరళంగా ఉండేది. ఈ యుగంనుంచీ అది బాగా వ్యాప్తిచెంది ఎన్నో శతకాలు వెలువడ్డాయి. ఇవి కాక పాటలు, కృతులువంటి గేయ సాహిత్యం విస్తారంగా ఉద్భవించింది. తెలుగురాజుల ఆస్థానాల్లో తెలుగు రాజభాషగా చెల్లుతూండేదని మనం ఉహించవచ్చును. రాయ వాచకంవంటి రచనలు దీనికి ఉదాహరణంగా చెప్పవచ్చు. ఇన్ని బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడవలసిన తెలుగుభాష పూర్వం పురాణాల్లో ప్రబంధాలలో మాత్రం వ్రాసినదినాల్లో ఉన్నంత శుద్ధంగాను ఉన్నతంగాను, సుశిల్పితంగాను ఉంటుందనడం సాధ్యంకాదు. ఆయా నూతన ప్రయోజనాలకు తగినట్లు క్రొత్త క్రొత్త శబ్దాలు భాషలోవచ్చి చేరకతప్పదు. కేవలం పండితులకేకాక పామరులకూ, సాధారణ పరిజ్ఞానం కలవారికీ కూడా భాష అందుబాటులో ఉండాలి. అందుచేత వ్యావహారిక ప్రయోగాలు, పూర్వ వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలు రచనల్లో చోటుచేసుకొనక తప్పలేదు.

మరొక విశేషం కూడా జరిగింది, అన్యభాషా శబ్దాలు ఈ కాలంలో విస్తారంగా తెలుగును ప్రవేశించాయి. తెలుగులో కలిసిపోయి అవినాభావ సంబంధంతో నిలిచి పోయాయి. దీనికి పెక్కు కారణాలు ఉన్నాయి. ఇప్పుడు తెలుగు సాహిత్యానికి దక్షిణ దేశం ప్రధాన రంగము అయింది గనుక అక్కడి ప్రజాభాషయైన తమిళము తెలుగులో కొంతకలిసింది. ముఖ్యంగా యక్షగానాల్లో ఇది కనబడుతుంది. యక్షగానాలు ప్రదర్శనానికి ఉద్దేశింపబడడంచేత దక్షిణదేశంలో తెలుగువారికి పరిచితమైన అరవ పదాలు తెలుగులో వాడితే ప్రేక్షకులు సంతోషించేవారు. ఆ విధంగా తమిళ పదాలు

తెలుగులోకి వచ్చి చేరాయి. మరిన్ని, ఈ కాలంలో శైవమతం కొంత తగ్గుముఖంలో ఉండి వైష్ణవమతం రాజాస్థానాల్లోను ప్రజల్లోను ఎక్కువ ఆదరం పొందడం జరిగింది. వైష్ణవమతాచార్యులు తత్వవేత్తలు ప్రధానంగా అరవదేశాన్నుంచి వచ్చేవారు కనుక ఆ మత పరిభాషా పరంగా కూడా కొన్ని తమిళశబ్దాలు తెలుగులో చేరాయి. కన్నడ దేశంతోను వీరశైవంతోను గాఢ సంబంధం ఉండినకాలంలో కన్నడపదాలు కొన్ని ఇట్లాగే తెలుగులో ప్రవేశించాయి. దేశంలో ముసల్మానులతో సంబంధం ఏర్పడి మూడు నాలుగువందల సంవత్సరాలు గడిచిపోయాయి. మొదట మొదట వారికీ మన వారికీ మూషకమార్జాల సంబంధమే ఉండినా కాలంగడిచినకొద్దీ వారూ మనమూ కలిసి పోక తప్పలేదు. ఒకేగాలి పీలుస్తూ, ఒకేనీరు త్రాగుతూ ఒక మట్టిలోనే పండిన పంటలు తింటూ శాశ్వత శత్రుత్వం సాగించాలన్నా సాధ్యంకాదు. ప్రభుత్వాలమధ్య ఇప్పటికీ వైరాలు యుద్ధాలు సాగుతూన్నా ప్రజానీకం క్రమంగా ఏకమవడం తప్ప లేదు. హిందూరాజ్యాలు పడిపోయిన తర్వాత పాశ్చాత్య ప్రభుత్వం ఏర్పడేదాకా ముసల్మానులు విస్తృతమైన దేశభాగంలో ప్రభుత్వం చేశారు. ముఖ్యంగా గోల్కొండ సుల్తానులు తెలుగుదేశంలో చాలా భాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకొన్నారు. పాలకులు ముసల్మానులవడంచేత వారి భాషలైన పార్సీ ఉర్దూ భాషలు రాజభాషా స్థానంలో నిలిచాయి. తత్కారణంగా అసంఖ్యాక ఉర్దూ—పార్సీ పదాలు తెలుగు భాష లోకి వచ్చిపడ్డాయి. వచ్చి స్థిరంగా నిలిచిపోయాయి. ఇవి యెక్కువగా వ్యవహార భాషలోనే వాడబడినా కొన్ని కొన్ని సాహిత్య భాషలో కూడా అప్రయత్నంగా దూరాయి.

చిట్ట చివరికి తెలుగు సాహిత్యపు కంచెలను దిగ త్రొక్కుకుంటూ వచ్చి పడ్డాయి పాశ్చాత్య భాషా పదాలు. క్రీ.శ. 16 వ శతాబ్దం ప్రారంభం నుంచీ ఒక్కొ రొక్కరుగా సముద్రాల మీదుగా వచ్చి పాశ్చాత్య దేశీయులు మనతో, మనదేశంతో వర్తకం ప్రారంభించారు. వీరిలో పోర్చుగీసువారు ముందు వచ్చారు. వీరిని మనవారు బుడతకీచులు అనేవారు. తరువాత డచ్చివారు వాణిజ్యం కోసం వచ్చారు. హాలండు దేశీయులవడం చేత వీరిని మనవారు ఒలాందులు అని పిలిచేవారు-వీరిద్దరి తరువాత వచ్చారు ఫ్రెంచి వారు, బ్రిటిషువారు. ఫ్రెంచివారిని పరాసులు అనేవారు. బహుశా వారి ముఖ్యపట్టణమైన పారిసునగరం పేర ఈ తద్భవ పదం ఏర్పడి ఉంటుంది. మనకు ఇప్పటికీ సుపరిచితులైన వారు ఆంగ్లేయులు. వీరిని ఇంగిరీజులని పిలిచేవారు. వర్తకం కోసం వచ్చిన వీరందరూ, మత ప్రచారకులుగానూ, రాజ్య సంస్థాపకులుగానూ వ్యవ

హరించిన విషయం చరిత్ర ప్రసిద్ధము. ఆంగ్లేయులు 1947 వరకూ ఈ దేశపరిపాలకులుగాను ఇప్పుడు మిత్రదేశీయులుగాను ఉన్నారు. ఈ సందర్భంలో మరొక్క భాషనుకూడా, తెలుగునకు కొన్నిపదాలు ఎరువు ఇచ్చిన దానిని స్మరించవచ్చును. అది మహారాష్ట్ర భాష. మనకు ఉత్తరాన పొరుగువారైన మహారాష్ట్రులతో కాకతీయుల కాలాన్నుంచి కొంత సంబంధం ఉంది. కాకతీయులకు సామంతులై మహారాష్ట్రనాయకులు కొందరు అద్దంకి ప్రాంతంలోను, తెలంగాణాలో నల్లగొండ ప్రాంతంలోను పరిపాలన చేసేవారు. ఇంతకన్న ముఖ్యమైన సంబంధం తంజావూరు రాజ్యాన్ని మహారాష్ట్రులు ఏకోజీ మున్నగువారు పాలించినప్పుడు ఏర్పడింది. తంజావూరులో చెవ్వప్ప వంశీయులైన తెలుగు వారు క్రీ.శ. 1674 దాకా పరిపాలన చేశారు. రఘునాథనాయకుడు, విజయరాఘవనాయకుడు ఈ వంశం వారే. తెలుగు నాయక వంశం అంతమొందిన తరువాత మహారాష్ట్రులు తంజావూరు రాజ్యాన్ని ఆక్రమించుకొని సుమారు ఒక శతాబ్దం ఏలుబడి సాగించారు. వీరి భాష మహారాష్ట్ర భాష అయినప్పటికీ తంజావూరు మరాఠా రాజులు ఆంధ్ర భాషా సంపదకు ముగ్ధులై తాముకూడ తెలుగును ప్రేమించి తెలుగులో యక్షగానాలు మొదలైన రచనలు చేశారు. ఈ విధంగా కొన్ని మహారాష్ట్ర శబ్దాలు తెలుగులో ప్రవేశించడానికి మార్గం ఏర్పడింది. నిజాము నవాబుల కాలంలో తెలంగాణమునందు మహారాష్ట్రుల ప్రాబల్యం అధికంగానే ఉండేది. మహారాష్ట్రులు ఉన్నతోద్యోగాల్లో నియుక్తులయేవారు వారికి పూనాపీష్వాల దర్బారు నుండి రాజకీయ బలం చేకూరేది. ఈ విధంగా కూడా మహారాష్ట్ర ఆచారాలు, సంప్రదాయాలు, భాషాపదాలు తెలుగును కొంత ప్రభావితం చేశాయి.

ఇదంతా ఒకనాటిలో జరిగిన పరిణామం కాదు. మూడు శతాబ్దుల కాలంలో అనగా 16, 17, 18 శతాబ్దుల్లో పెక్కు అన్యభాషా ఉపనదులు వచ్చి ఆంధ్రభాషా మహానదిలో సంగమించి దానిలో అంతర్లీనమై పోయాయి. వీటిల్లో మేలైన శబ్దాలు కొన్ని సాహిత్యంలోకి కూడా ప్రవేశించాయి. సాధారణంగా ఇవి విదేశాలనుంచి దిగుమతి అయిన భోగ్యవస్తువుల పేర్ల రూపంలోను, పడవలు, యుద్ధసాధనాలు, సైనికోద్యోగుల హోదాలు మొదలగునవిగా కనబడతాయి. శాసనాల్లో తురుష్కభాషా పదాలు విస్తారంగా వస్తాయి. తెలుగులో ప్రవేశించిన అన్యదేశ్యాల్లో తురుష్కపదాలే హెచ్చుగా ఉంటాయి. ఇవి దేశీయులకు బాగా అలవాటు పడిపోవడంచేత ఈ శబ్దాలు కొన్ని ధాతురూపాలుగా వాడుకలోనికి వచ్చాయి. పిలాయించు, రుకాయించు, బనాయించు, దవుడాయించు ఇత్యాదిగా ధాతు వ్యవహారం కూడా తెలంగాణాలో బాగా వినబడుతుంది.

తక్కిన అన్యదేశ్యాలకు ఇంత ఆత్మీయత తెలుగుతో ఏర్పడలేదు. అవి నామములైనా, ధాతువులైనా, అగు, చేయు, ఇచ్చు మొదలగు తెలుగు సహాయ ధాతువుల చేర్పుతో మాత్రమే తెలుగులో చెల్లుతాయి. ప్రోపోజుచేయు, ప్యాస్అగు, ప్రొమోషను ఇచ్చు- ఈ విధంగానే వాడబడతాయి. తురుష్కేతర పదాలకు కూడా ఇంచు గాగమం చేసి తెలుగులో ప్రయోగించడానికి కొందరు ప్రయత్నం చేశారుకాని ఆ ఉద్యమం జయప్రదం కాలేదు. ప్రొపోజించు మొదలైన వ్యవహారం తెలుగులో కుదరలేదు. తెలుగులో ప్రవేశించిన అన్యదేశ్యాలను గురించి పరిశోధకులు కృషిచేస్తున్నారు. శుకసప్తతి, హంసవింశతివంటి కథాకావ్యాల్లో వాణిజ్య సంబంధమైన అన్యదేశ్యాలు కనబడతాయి. దిట్టకవి నారాయణకవి రచించిన రంగ రాయ చరిత్రలో (బొబ్బిలియుద్ధ వృత్తాంతము) ఫ్రెంచి సైనికపదాలు వాడడం జరి గింది. డాక్టరు కొత్తపల్లి వీరభద్రరావుగారి సిద్ధాంతవ్యాసగ్రంథంలో (the Influence of English on Telugu) పోర్చుగీసు, డచ్చిభాషాపదాలు సేకరింప బడ్డాయి. ఆంగ్లపదప్రయోగం మనకు ఇప్పటికీ పరిచితమే. ఇది మన నిత్యజీవి తాన్ని, సాహిత్యాన్ని, విజ్ఞానాన్ని అన్ని రంగాలను గాఢంగా స్పృశించింది.

16–18 శతాబ్దాలు - సాహిత్య భాష కొంచెం వెనకకు మరలి ఈ మూడు శతాబ్దాలల్లో సాహిత్యభాష పొందిన పరిణామాన్ని పరికిద్దాము. విజయనగరయుగంలో కృష్ణదేవరాయలు, అల్లసానిపెద్దన అలంకరించిన సాహిత్యసింహాసనాన్ని తంజావూరు యుగంలో రఘునాథ భూపాలుడు, చేమకూర వెంకటకవి అలంకరిస్తున్నారు. రఘునాథరాయలు చేసిన వివిధ రచనల్లో ప్రసిద్ధమైనది వాల్మీకి చరిత్రము. చేమకూర వెంకటకవి విజయ విలాసము, సారంగధర చరిత్ర సాహిత్యపరులందరి మన్ననలనూ పొందాయి. ఇదివరలో మేము చెప్పినట్లు ఆంధ్రసాహిత్య వాహిని తంజావూరుయుగం నాటికి ప్రబంధ పర్వత శిఖరాలనుండి సమతలంమీదికి దిగి జనులకు ఉపాసనాయోగ్య మయింది. ఉన్నత సంస్కృత శైలి సడలింది. తెలుగుమార్దవాన్ని, భావ ప్రకటన సామర్థ్యాన్ని, చమత్కార శీలతను కవులు అనుభవంలోకి తేవడానికి పూనుకున్నారు. జానుతెనుగు అని శివకవులు పూర్వం భావించిన దానినే ఈనాడు కవులు ఆ పేరు పెట్టకుండా చిలుకుతున్నారు. కవిత్వము వినగానే రసానందం కలిగించాలనీ, పరిమళాలు గుబాళించాలనీ రఘునాథనాయకుడు వాల్మీకి చరిత్రలో అన్నాడు.

చెప్పవలె గప్పురములు
కుప్పలుగా బోసినట్లు, పంపమపైపై

గుప్పినక్రియ, విరిపొట్లము
విప్పినగతి ఘుమ్మనంగవిత్వము సభలన్.

ఈ ప్రతిజ్ఞను ఆయన తన కావ్యంలో సముచితంగా నిర్వహించిచాడు. అర్థంకోసం పెనుగులాడనక్కరలేకుండా, నిఘంటు ద్యుతులు పరపించనక్కరలేకుండా కవిత్వం లలితమై సరళమై ప్రసన్నమై జాలువారడం మళ్ళీ మొదలుపెట్టింది. ఈ విద్యలో చేమకూరవెంకటకవి రఘునాథ నాయకుణ్ణి మించిపోయాడు. ఈయన కవిత్వంలో తెలుగు పదాలు చమత్కారంగా విరిగి మనోహరార్థాలు ప్రసవిస్తాయి. ఇది ఒక విధంగా శ్లేష కవిత్వమే అయినా ద్వ్యర్థి కావ్యాల్లో మల్లె భయజనకంకాదు. ఈతనికి యమకాది శబ్దాలంకారాలు అప్రయత్నంగావచ్చి కూర్చుంటాయి. అవి మురిపెమైన తెలుగు పదాల్తో కూర్పుపొందుతాయి. "అమ్మక చెల్ల నా హృదయమమ్మకచెల్లదు పీనికి య్యేడఁ" 'మనసు భద్రమయ్యె మన సుభద్ర కిపుడు' వంటివి కోకొల్లలు. 'అయ్యారే చెలువెక్కడ ! నయ్యారే గెలువజాలు నంగజునారిఁ" విజ -1-103. 'యమునానది గూడినతో ! యమునా నది తనరె దత్కచామేచకమై' విజ-1-121. ప్రబంధయుగమునంవవలెనే ఈ యుగమునందును శృంగారకావ్యములకే అగ్రతాంబూలము. మొదటిప్రబంధ కాలంలో ఆముక్తమాల్యదకువలె ఈ యుగంలో రఘునాథుని వాల్మీకి చరిత్రకు విశిష్టతకలదు.

మధురనాయక రాజ్యంలో కూడా తంజావూరునందలి సాహిత్యప్రక్రియలే వర్థిల్లాయి. మధురరాజ్యపు కవుల్లో శృంగారరస సమాశ్రయణము ఒక చూపు వాసి విశృంఖలమనే చెప్పాలి. ఇక్కడి విద్వత్కవుల్లో సత్యభామా సాంత్వనము వ్రాసిన లింగనమఖి కామేశ్వర కవి ప్రముఖుడు. నిషిద్ధ శృంగారాన్ని ఇచ్చటి కవులు ఆసక్తితో చేపట్టేవారు. అహల్యాసంక్రందనము, శశాంకవిజయమువంటి కావ్యాలు నీతిలో కొంతలొచ్చినా తెలుగు భాషా మార్దవాన్ని పుక్కిట బట్టడంలో మిన్నయైనవి. వీరందరినీ మించి సుతిమెత్తని తెలుగునుడికారం పలికించగలిగిన ప్రవీణురాలు ముద్దుపళని. ఈమె తంజావూరు ఆస్థానమునకు చెందినది. ఈవిడ - రాధికా సాంత్వనము భాషా సౌకుమార్య విషయంలో ప్రశంసలందుకుంది. రాయలసీమ ప్రాంతంలో సవరము చిననారాయణ నాయకుడు, దామెర్ల వెంగళభూపాలుడు, తెలంగాణంలో సురభి మాధవరాయలు, రాజామల్లారెడ్డి, ఆంధ్రప్రాంతంలో కూచిమంచి తిమ్మకవి సార్వభౌముడు, కంకంటి పాపరాజు మున్నగు ఉత్తమ కవులెందరో వెలిశారు. వీరంతా సమ సంస్కృతాంధ్రములతో కవిత్వం నడిపినవారే. సురభిమాధవరాయులు

మాత్రము భిన్నుడై చంద్రికా పరిణయంలో తొల్లింటి వసు చరిత్ర ప్రౌఢశైలికి మొగ్గినాడు. ఈ కాలంలో అనేక శతక కర్తలు ప్రసిద్ధికి వచ్చారు. శ్రీ కాళహస్తీశ్వర శతకము, దాశరథి శతకము, సింహాద్రి నారసింహ, ఆంధ్ర నాయక శతకములు జనులకు సుపరిచితాలు. వేమనయోగి శతకమునకు ప్రత్యేక స్థానం ఉంది. తత్వకథనాల్లో పోతులూరి వీర బ్రహ్మంగారి కాలజ్ఞాన వచనాలు మిక్కిలి జనాదరణ పొందినవి.

ఒక్క వీరబ్రహ్మంగారి రచనలు తప్ప తక్కిన కృతులన్నీ—ప్రబంధాలైనా, శతకాలైనా, వచన రచనలైనా— చాలావరకు పూర్వ వ్యాకరణ మర్యాదల్నే పాటించాయి. కొంత మినహాయింపు, ఒకింత స్వాతంత్ర్యము వహించక పోలేదు. ఈకాలంలో రేఫఱకారములు సాంకర్యం పొందుతు వచ్చాయి. కారణమేమిటంటే ఉచ్చారణలో వాటి ప్రత్యేక స్వభావం అదృశ్యమయింది. రేఫద్వయ సాంకర్యం నివారించడానికి పండితులు యత్నించేవారు ఈ రెండు రకారాలు ఉన్న శబ్దాల పట్టికలు తయారు చెయ్యడం మొదలు పెట్టారు. తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు, కాకునూరి అప్పకవి, కూచిమంచి తిమ్మకవి మొదలైనవారు ఈ మార్గంలో శ్రమించారు. కాని భాషలో వినపడని ధ్వనిని నిలపడం వీరికి సాధ్యంకాలేదు. ప్రాచీన కాలంలో తెలుగు భాషలో ఉండిన 'ఱ'ధ్వనిని ఎవరైనా నిలుపగలిగినారా. అట్టిదే ఈ రకార ద్వయ భిన్నస్థితికూడా. పూర్వ వ్యాకరణానికి అంతగా సమ్మతంకాని రూపాలు ఈ కాలపు కవులు వాడుతూ వచ్చారు. వీటిని దిఙ్మాత్రంగా చేమకూర వెంకటకవి నుండి ఉదాహరింప వచ్చును. క్త్వార్థక ఇకారసంధి. "అటు జూపిటు, ఇటు జూపటు" వంటివి. అనుప్రయుక్తమైన కొను ధాతువునకు 'క' ఆదేశముగా చేయుట-ఊదుక (ఊదుకొని అనుటకు). కంకంటి పాపరాజుకూడా ఇటువంటి ప్రయోగం చేశాడు. సుమతీ శతకంలో 'వడిగల ఎద్దుల గట్టుక, మడి దున్నుక బ్రతుకవచ్చు'. షష్ఠీకువర్ణము ముందు నగాగమము చేయకుండుట - వాదునకు అనుటకు బదులు వాదుకు. అత్వ సంధిచేయడం - లేనెలయంత అనుటకు లేనెలంత. శబ్దగత ఇకారానికి సంధి చెయ్యడం-బంతిది (బంతి + ఇది). ఇట్టి ప్రయోగాలు ప్రామాణికులుగా భావింపపడే శ్రీనాథుడు, అల్లసాని పెద్దన, నంది తిమ్మన, పింగళి సూరన, రామరాజ భూషణుడు వంటి వారుకూడా చేశారని తాపీ ధర్మారావుగారు వ్రాశారు. ఈ విశేష ప్రయోగాలు ఈ నాటివి కావు. ప్రాచీన కాలంనుంచీ వస్తున్నాయి. శివకవులైన పాల్కురికి సోమనాథుడు మున్నగువారికివి సమ్మతములే. తెలుగు భాషా ప్రయోగంలో రెండు పాయలున్నాయని చెప్పాలి. అందొకటి నన్నయాదుల మార్గము. సంస్కారయుతమైన భాషనే కావ్యంలో ప్రయోగించాలనే వారు ఒక వర్గము—వ్యవహార భాషకు సన్నిహిత

మైన ప్రయోగాలుకూడా అప్పటప్పట చెయ్యవచ్చుననేది ఒక పాయ. రెండుకూడా ఆరోహావరోహణములతో కాలప్రవాహం వెంట తెలుగు సాహిత్య భాషలో వస్తూనే ఉన్నాయి.

## ఆధునిక యుగం గడపమీద

19వ శతాబ్ది ప్రారంభంనుండీ ఆధునిక యుగంగా పరిగణించ వచ్చును. ఈ సమయానికి బ్రిటిషువారి పరిపాలన భారతదేశపు మొత్తంమీద, ఆంధ్రదేశంలోనూ కూడా స్థిరమైన పునాదులపై నిలిచింది. విదేశ ప్రభుత్వంతోపాటు క్రైస్తవ మిషనరీలు కూడా తమ కార్యకలాపాలను విస్తృతం చెయ్యడం మొదలు పెట్టారు. క్రైస్తవ మత వ్యాప్తి కోసమూ, దేశీయులను ఆ మతానికి పరివర్తనం చెయ్యడం కోసమూ, బైబిలు అనువాదం చెయ్యడానికి వారికి దేశభాషయైన తెలుగును ఆశ్రయించవలసి వచ్చింది. తెలుగు నేర్చుకోడానికి మిషనరీలు పూనుకొన్నారు. ప్రభుత్వపు యంత్రాంగంలో కూడా ఆంగ్లోద్యోగులకు తెలుగు నేర్వవలసి వచ్చింది. కోర్టుల్లో వ్యవహారం నడిపించడానికీ, దస్తావేజులు, అర్జీలు మొదలైనవి చదవగలగడానికి వారికి తెలుగుతో పని పడింది. పాశ్చాత్యులు సులభంగా తెలుగు నేర్చుకోడానికి తెలుగు-ఇంగ్లీషు, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులు సమకూర్చడమూ, తెలుగునకు ఇంగ్లీషులో వ్యాకరణాలు వ్రాయడమూ ముఖ్యావసరమైంది. కాంబెలు, విలియం బ్రౌను మొదలైనవారు నిఘంటు నిర్మాణం చేశారు. వీరందరిని మించి తెలుగు విషయంలో కృషిచేసినవాడు ఛార్లెసు ఫిలిప్ బ్రౌను దొర. ఈయన ఇంగ్లీషు-తెలుగు, తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులూ, వ్యాకరణము, వాచకములు మొదలైన పెక్కు రచనలు చేశాడు. తెలుగువారికి ఈ నిఘంటువుల్లోను వ్యాకరణాల్లోను క్రొత్త పద్ధతి కనబడింది. మన పూర్వ నిఘంటువులు సంస్కృతంలోనైనా తెలుగులోనైనా శ్లోక పద్యరూపంలో ఉండేవి. ఇప్పుడు 'అ'కారాది వర్ణక్రమంలో శబ్దాలు కూర్చడమూ, వాటికి అర్థాలు వచనంలో సర్వజన సులభమైన భాషలో వ్రాయడం పాశ్చాత్యులు చేస్తూ వచ్చారు. వ్యాకరణయుక్తమైన భాషకే కాక వ్యవహారంలోనూ బజారుల్లోనూ మాట్లాడబడే భాషకు కూడా వ్యాకరణాల్లో స్థానం దొరికింది. ఇది మన వారికి క్రొత్త. ఇప్పటి నుంచీ పద్య ప్రయోజనం తక్కువ అయి వచనము ప్రయోజనము అధిక మయింది. దీనికి కారణము ఆంగ్లేయులు ప్రవేశ పెట్టిన విద్యా పద్ధతి. పాలకుల రాజకీయావసరాలను బట్టి దేశీయులు ఇంగ్లీషు అభ్యసించవలసి వచ్చింది. విద్యా ప్రణాళికలో ఆంగ్లమునకు ప్రథమ స్థానం ఇవ్వడమయింది. పూర్వంమల్లే అగ్రవర్ణాల వారు, కొద్దిమంది సంపన్నులు మాత్రమే విద్యార్జనకర్హులు అనే భావం పోయింది. సార్వజనిక

విద్యావిధానం అమలులోకి వచ్చింది. పఠనీయాంశములుకూడా మారినాయి. మహాకవుల గ్రంథాలు చదివి అర్థం చెప్పడంతో విద్యావిధానం పూర్తి అవదని గుర్తించారు. వ్రాయడం, చదవడం, లెక్కలు, చరిత్ర, భూగోళము వంటి విషయాలు పాఠ్యాంశములు అయాయి. పూర్వం లెక్కలు కూడా పద్యాల్లోనే ఉండేవి. పావులూరి మల్లన గణితం ఉదాహరణగా తీసుకోవచ్చును. పిల్లలు చదివే వాచకాలు వ్రాయించ వలసి వచ్చింది. అచ్చు యంత్రం వచ్చినప్పటినుంచీ పుస్తకాలు ప్రచారంలోకి వచ్చాయి. జనులు అధిక సంఖ్యలో పుస్తకాలు చదవగోరుతున్నారు. వీరంతా భాషా పండితులు కారు. జన సామాన్యం వినోదం కోసం చదువగోరిన కథల పుస్తకాలు యాత్రాకథనములు వ్రాయించవలసిన అవసరం ఏర్పడింది.

ఇటువంటి విస్తృత ప్రయోజనాలదృష్ట్యా పద్యాత్మక కావ్యాలు వెనకబడ్డాయి. వచనగ్రంథాల ప్రాముఖ్యం హెచ్చింది. యావన్మందికీ అందుబాటులో ఉండవలసిన వివిధ రకముల పుస్తకాలు ఏభాషలో వ్రాయాలి అనే సమస్య రచయితల్ని ఎదుర్కొంది. ఆంగ్లేయులు సహజంగానే తెలుగు వ్యవహారభాషలో వ్రాయాలని భావించారు. తెలుగు పండితులుకూడా సర్వజనోపయోగియైన పుస్తకాలు శిష్టవ్యవహార భాషలో వ్రాయడం మొదలుపెట్టారు రావిపాటి గురుమూర్తిశాస్త్రిగారివంటి పండితులు కథల పుస్తకాలు వ్యవహారభాషలో వ్రాయడం సదాచారంగానే పరిగణించారు. ఏనుగుల వీరాస్వామయ్యగారి కాశీయాత్రా చరిత్రవంటివి వ్యవహారభాషలో వెలువడినాయి. దీనికి పూర్వప్రాతిపదిక లేకపోలేదు. పూర్వంనుంచీ వ్యాఖ్యాన గ్రంథాలు, వివరణలూ శిష్టులు వాడే వ్యవహారికంలో వ్రాసే సంప్రదాయం ఉండేది. శాసనాల్లోనూ, దస్తావేజులు మొదలైనవాటిల్లోనూ వ్యవహారభాష మాత్రమే నడిచేది. ఎటొచ్చీ పద్యకావ్యాలు మాత్రం సలక్షణభాషలోనే వ్రాసేవారు పద్య కావ్యాంతర్గతమైన గద్యభాగంకూడా సలక్షణభాషలోనే ఉండేది.

ఇంతలో 1850 ప్రాంతంలో భాషావేత్తయూ మహావిద్వాంసుడూ అయిన పరవస్తు చిన్నయసూరి విశ్వవిద్యాలయరంగంలో అడుగుపెట్టాడు. ప్రామాణికమైన వ్యాకరణ రచనకోసం ఈయన ఎన్నియో పథకాలు వేసుకొని చివరకు వాటన్నిటి సారభూతమైన బాలవ్యాకరణం రూపొందించాడు. బాలవ్యాకరణం పుట్టిన వేళావిశేషం ఎటువంటిదోకాని అది అచిరకాలంలోనే పండితులకు తలలో నాలుకవంటిది అయిపోయింది. పూర్వ వ్యాకరణరీతులను స్తుతించేవారికీ నిందించేవారికీ కూడ బాలవ్యాకరణమే ఆలంబనం అయింది, ఛందస్సు విషయంలో అప్పకవీయంలాగ. తెలుగు ఛంద

స్సును సమర్థించాలన్నా, విమర్శించాలన్నా అప్పకవి పేరు ఎత్తక ఎవరికీ జరుగదు. చిన్నయసూరిగారు చేసిన మఱియొక ప్రముఖ ప్రయత్నం ఏమిటంటే తాను నిర్మించిన వ్యాకరణం ప్రకారం వచనగ్రంథం వ్రాయడము. సలక్షణమై ప్రసన్నశైలిగల ఉత్తమ కవిత్వానికి నన్నయభట్టారకుని ఎట్లా చెప్పుకుంటున్నామో సలక్షణమైన ప్రసన్నరీతి గల ఉత్తమ వచన రచనకు చిన్నయసూరిని మొదట చెప్పాలి. ఆయన వ్రాసిన మిత్ర లాభ మిత్రభేదములను గురజాడ అప్పారావుగారు కూడా మెచ్చుకున్నారు. కాని ఆధు నికులచేత నిశిత విమర్శలకు గురియైనవాడు చిన్నయసూరి వంటివాడు మరొకడులేడు. ఈ వైరుధ్యం ఎట్లా వచ్చింది.

చిన్నయసూరి చెప్పాడో లేదో కాని అన్నిరకాల వచన రచనకూ పండితులు ఇప్పటినుంచీ బాలవ్యాకరణాన్ని అనుశాసన గ్రంథంగా తీసుకొని పిల్లలకు వాచకాలు వ్రాసినా, విశ్వవిద్యాలయ విద్యార్థులకు పాఠ్యగ్రంథాలు వ్రాసినా, జనసామాన్యం ఆదరించే వినోద గ్రంథాలు, యాత్రాకథనాలు, శాస్త్రగ్రంథాలు, వ్యాఖ్యానాలు ఏవి వ్రాసినా పూర్వకావ్యాల్లో కనబడే శైలివంటి శైలిని పాటిస్తూవచ్చారు. ముఖ్యంగా విశ్వవిద్యాలయాల్లోంచి, విద్యాసంస్థల్లోంచి సజీవమైన వ్యవహారభాష అదృశ్యమయింది. దానిస్థానంలో పద్యకావ్యశైలి చోటుచేసుకుంది. పండితులు ఒకరినిమించి మరియొకరు అనుప్రాసాది శబ్దాలంకారమయము, శ్లేషనిబిడము, నిఘంటుమాత్రదృశ్యములైన పద బంధురమూ అయిన కృతకశైలిని వచనరంగంలోకి కూడా దింపి వచనప్రయోజనాన్ని వమ్ముచెయ్యజొచ్చారు. కందుకూరి వీరేశలింగంపంతులుగారివంటి అభివృద్ధికాముకులు కూడా కొంతకాలం దీని ప్రభావంక్రిందికి వచ్చారు. వారి విగ్రహతంత్రము ఇందుకు ఉదాహరణము. వారు పిల్లలకు వ్రాసిన వాచకాలుకూడా బాలురకు అపరిచితమైన భాషలో నడిచాయి. కాని పంతులుగారు త్వరలోనే ఈవిధమైన కఠినశైలికి స్వస్తిచెప్పి సులభము లాక్షణికము అయిన భాషలో వచన రచన చెయ్యడానికి నిశ్చయించుకు న్నారు. దానిని ఆచరణలో పెట్టారు. ఇతర పండితులు ఈ మాత్రపు భాషా వివేకం కూడా చూపెట్టలేక కావ్యశైలికే అంకితమవుతూ వచ్చారు. దీనివలన జరిగిన మొదటి పెద్దనష్టం ఏమిటంటే తెలుగులో భావప్రకటన చెయ్యడానికి సాధారణ భాషాపరిజ్ఞానం కలవారంతా భయపడిపోయి మానుకున్నారు. ఇప్పటి విద్యావసరాలనుబట్టి అనేక శాస్త్రాల్లో గ్రంథాలు తెలుగులో వెలువడవలసియుండగా రచయితలు కావ్యభాషాస్థాయిని అందుకోలేమని వ్రాసే ప్రయత్నాన్నే విరమించుకున్నారు.

ఈ విపరీత పరిణామం మీద 19 వ శతాబ్దం చివరి పాదంలోనే తిరుగుబాటు బయలుదేరింది. గురజాడ అప్పారావుగారు, గిడుగు రామమూర్తి పంతులుగారు మొదలగు విజ్ఞులు బహుళ ప్రయోజనాలు సాధించవలసిన నేటి కాలపు వచనానికి కూడా ప్రాతవడిన కావ్యభాషకు వర్తించే నియమాలు వర్తింప చెయ్యడం తగదనీ, సర్వతో ముఖాభివృద్ధి పొందవలసిన భాషకు ఇది గొడ్డలిపెట్టు అనీ తీవ్రంగా నిరసించడం ఆరంభించారు. కావ్యాల మట్టుకు ఎట్లా ఉండినా లౌకిక ప్రయోజనాలకు దేశంలో పెద్దలువాడే వ్యావహారిక భాషను వాడే సంప్రదాయం చిరకాలం నుంచీఉన్నదని గిడుగు రామమూర్తి గారు తాళపత్ర గ్రంథాధారాల్తో స్థాపించడానికి విశేష పరిశ్రమ చేశారు. మిక్కిలి ప్రాచీన శాసనాల్లో 'ఇస్తిమి' వంటి 'స్త' రూపాలుండేవని శాసన వాఙ్మయం శోధించి ప్రకటించారు అప్పారావు గారు. శిష్ట వ్యావహారిక భాషను వచన ప్రయోజనాలకు ఉపయోగించే ఉద్యమాన్ని విద్యావంతులైన ఆంగ్లేయ ఉద్యోగులు కొందరు సమర్థిస్తూ వచ్చారు. వీరందరూ కలిసి భాషా విషయిక కాన్ఫరెన్సులు, సమావేశాలు నడిపారు. వచనమే కాదు, కవిత్వానికి కూడా ప్రాతవడిన సాహిత్య భాష ఉపయోగించదనీ, అది నేడు రసానుభూతిని కలిగించలేదని వాదించారు గురజాడవారు. సాహిత్య వేదిక మీద వ్యవహార భాషను అధిష్ఠితం చెయ్యడానికి వారు తమ కన్యాశుల్క నాటకాన్ని ఉత్తరాది మాండలికంతో గూడిన వ్యవహార భాషలో వ్రాసి, ప్రకటించి, ప్రదర్శింపించి సాహిత్య కాసారంలో ఒక కల్లోలం లేపారు. క్రమక్రమంగా వీరు తమ కవితా రచనలకుకూడా వ్యావహారికాన్ని అవలంబించడం మొదలుపెట్టారు. ఛందో విషయంలో కూడా అప్పారావుగారు నూతనత్వాన్ని ఆశ్రయించారు, పూర్వపు అక్షర గణ ఛందస్సులను వదలిపెట్టి మాత్రాగణ బద్ధములైన దేశీయ ఛందస్సును ప్రచారంలోకి తెచ్చారు. వాటిలో గేయ రీతులనే వీరు అభిమానించి పెక్కు రచనలు చేశారు. ముత్యాల సరాలు అనే పేరుతో ఇవి తరువాత ప్రకటింపబడ్డాయి. దీర్ఘ కావ్య పద్ధతిని విసర్జించి కథా ప్రధానములు రస నిర్భరములు అయిన చిన్నచిన్న కావ్యాలను వ్యవహార భాషలోనే ఆవిష్కరించారు.

ఈ ఉద్యమాన్ని విజ్ఞులైన మరి కొందరు పెద్దలు అభినివేశంతో వ్యతిరేకించారు. వారిలో కొందరు ప్రకరణోచితంగా వాడుక భాషను సాహిత్య గ్రంథాల్లో వాడడానికి విముఖులు కారు. కందుకూరి వీరేశలింగం పంతులుగారు తమ ప్రహసనాల్లో వాడుక భాష ప్రయోగించారు. వేదం వెంకట్రాయ శాస్త్రుల వారు ప్రతాపరుద్రీయ నాటకంలో పాత్రోచితంగా వ్యవహార భాష వాడారు. "గ్రామ్యం తత ద్విధా సాధు" అను

అథర్వణుని సూక్తిని వీరు పాటించారు. అయిననూ కావ్యం ఆద్యంతం వాడుక భాషలో వ్రాయడానికి గాని వచన గ్రంథాలైనా ఈ పద్ధతిలో నడిపించడానికి గాని వీరెవరునూ సమ్మతింపలేదు- అనాది నుంచీ వస్తూన్న భాషా సంప్రదాయాల్ని విచ్ఛిన్నం చెయ్యడానికి పండిత వర్గము వారు, పూర్వ సంప్రదాయపు కవులూ సంసిద్ధంగా లేరు. ఈకాలంలో అనగా 19వ శతాబ్ది చరమ పాదములోనూ 20వ శతాబ్దపు ప్రథమ పాదంలోనూ దిగ్గంతుల వంటి మహాకవులు బయలుదేరి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ వచ్చారు. వావిలికొలను సుబ్బారావుగారు, జనమంచి శేషాద్రిశర్మగారు, దాసు శ్రీరాములుగారు, తిరుపతి వెంకట కవులు వంటి మహనీయులెందరో పెక్కు ఉదాత్త గ్రంథాలు వ్రాశారు. పురాణాలు అనువదించారు. వావిలికొలను సుబ్బారావు గారి వంటి వారు భాషా పారిశుద్ధ్యాన్ని ఏమాత్రమూ సడలించడానికి విముఖులు. తిరుపతి వెంకట కవులు పద్యరచన వరకూ పూర్వ రీతులనూ వ్యాకరణాన్ని మన్నిస్తూనే వాటిని జనసామాన్యానికి వీలైనంత దగ్గరగా తీసుకురావడానికి విముఖులుకారు. వచన రచనలో కూడా ఒక దారీ తెన్నూలేని వాడుక భాషను ప్రవేశ పెట్టనక్కర లేకుండానే సర్వజన సమ్మతమైన సులభలాక్షణిక భాష వ్రాయవచ్చని నిరూపించారు కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు. వీరు విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి స్థాపించి దానిలో పెక్కు చరిత్ర గ్రంథములు, పదార్థ విజ్ఞాన శాస్త్రము వంటి ఆధునిక భౌతిక శాస్త్ర ప్రమేయం గల గ్రంథాలూ, విజ్ఞాన సర్వస్వం వంటి వైజ్ఞానిక రచనలూ విరివిగా ప్రకటించి కావ్య భాషను ఆధునిక ప్రయోజనాలకు అనుకూలంగా ఎట్లా మలవాలో ఆచరణలో చూపెట్టారు.

ఈ విధంగా దేశంలో సాహిత్యభాష ఎట్లుండవలెను - సులభ గ్రాంథికమా? శిష్ట వ్యావహారికమా-అనే విషయంపై మన మేధావులంతా రెండు వర్గాలుగా ఏర్పడి దేవాసుర సంగ్రామంలాగ ఓహరిసాహరిగా పాతికముప్పది సంవత్సరాలు పెనకువ చేశారు. ప్రతిపక్షంవారిది అసురవర్గమని ఎవరికివారే భావించేవారు. ఈ సాహిత్య సమరాలు సభాముఖంలో వాగ్రూపంగాను పత్రికల్లో లేఖినీ సహాయంతోను జరిగాయి. ఇటువంటి సముద్రమథనంవలన కాలాంతరంలో దేశానికీ, భాషకూ మంచిమేలే జరిగింది. తమ తమ వాదాల్ని యుక్తియుక్తంగా సమర్థించుకోడానికి ఉభయ వర్గాలవారు భాషా తత్వాన్ని గురించి గంభీరంగా ఆలోచించి వ్రాయడం చేశారు. ఆంగ్లభాషవంటి విశ్వవ్యాప్తమైన భాషాసాదృశ్యంతో సిద్ధాంతాలు ఉత్థాపితంచేసి. సముద్రపుకరళ్ళలాగ వాటి ని ఖండించి గొప్ప చర్చలు సాగించారు. మాండలిక భాషాస్థితినీ, ప్రయోజనాల్ని

సశాస్త్రీయంగా ఖండనమండనలు చేశారు. ఇంతకూ సాహిత్యభాష ఏయుగానికాయుగం మారిపోతుంది, మారిపోవాలంటారు వ్యవహారభాషావాదులు. సాహిత్యభాష యుగయుగానికి మారిపోతే సాహిత్యంలో అవిచ్ఛిన్నధారా సాంగత్యం తెగిపోతుందనీ, అది పనికి రాదనీ అన్నారు గ్రాంథికభాషావాదులు. ఇరువదవశతాబ్దం డెబ్బదియైదు సంవత్సరాలు గడిచినమీదట ఈ భీషణ సారస్వతసంగ్రామం సింహావలోకనం చేస్తే మనకు అని పిస్తుంది-ఉభయ వర్గాలవారూ సత్యమే చెప్పారని. నాణానికి రెండువైపులు ఉన్నట్లు బొమ్మా, బొరుసూ ఉన్నట్లు-సాహిత్యభాష మారనూమారాలి. పూర్వతంతు విచ్ఛేదం జరిగేటట్లు మారనూకూడదనిపిస్తుంది. తెలుగుసాహిత్యభాష సమూలంగా మారిపోతే నన్నయ తిక్కన పోతనల మహా గ్రంథాలను అనుభవించగల యోగ్యత పోగొట్టు కొంటాము. వారి భాషవంటి భాషనే పట్టుకొని కూర్చుంటామంటే ఆధునిక ఆంధ్రసమాజానికి దూరదూరమైపోయి ఉద్దిష్టప్రయోజనం బలిచేసినవారమూ అవుతాము. ఈ రెండు మార్గాల సమన్వయంమీదనే ఆంధ్రసాహిత్య భవిష్యత్తు నిలిచి ఉంటుందన్నమాట.

కొంచెం వెనుకకు మరలి ఈ భాషా సంగ్రామంలోని కొన్నిఘట్టాలను స్మరిద్దాము. తెలుగులో ఆధునిక విజ్ఞానగ్రంథాలు వెడలకపోవడం అప్పటి ప్రభుత్వానికి కూడా ఆశ్చర్యం కలిగించింది. దేశంలో మేధావులు చాలమంది ఉన్నారు. పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానవీధుల్లో విహరించినవారు ఉన్నారు. కాని వారు సేకరించినజ్ఞానము ప్రజానీకానికి అందడంలేదు. ఏమిటి కారణమని బ్రిటిషుపాలకులు విచికిత్సలో పడ్డారు. లార్డుకర్జను కాలంలో దీనికి హేతువులు అరయుటకోసం ఒక సంఘాన్ని నియమించారు వారి విచారణ ఫలితంగా తేలినదేమంటే దేశీయ శాస్త్రవేత్తలకు దేశభాషలో తమ విజ్ఞానాన్ని ప్రజలకు తెలియజెప్పడం కుదరడంలేదు. ప్రజలకు ఆంగ్లమురాదు. శాస్త్రజ్ఞులకు తెలుగులో భావప్రకటన చెయ్యడం చేతకావడంలేదు. అందుచేత దేశీయులకు దేశ్యభాషలలో తగినంత పరిజ్ఞానం ఏర్పడాలి. ఇందుకోసమై విద్యార్థులచేత దేశభాషలో వ్యాసరచన చేయించాలి. వారు క్రమంగా తమస్వభాషలో రచన చేయుటకు సమర్థులవుతారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. విద్యార్థులచేత వ్యాసరచన ఏశైలిలో చేయించాలి అనే ప్రశ్న సముత్పన్నమయింది. సజీవమైన వ్యవహార భాషలో వ్రాయించాలని గురజాడ అప్పారావు మున్నగు పురోగాములు ప్రకటించారు. వీరికి ఆంగ్లోద్యోగుల అండదండ లున్నాయి. ప్రాచీన శైలిని సమర్థించేవారికి జయంతిరామయ్యపంతులు, ఆంధ్రసాహిత్య పరిషత్తు అండగా నిలిచాయి. ప్రభుత్వంలో తమకున్న పలుకుబడి నుపయోగించి భాషాసంస్కారవాదులు స్కూలుఫైనలుపరీక్షలో విద్యార్థులు ఆధునిక శైలిలో వ్రాయ

వచ్చునని అధికారపత్రం పుట్టించారు గ్రాంథికవాదులు అలజడి పొంది దేశం అంతా సభలుచేయించి వ్యవహారభాషా శైలిచే తెలుగుభాషకు తీరని అపకారం జరుగుతుందని ప్రభుత్వానికి మహజర్లు పంపించారు. ఇదేసమస్య విశ్వవిద్యాలయ రంగంలో కూడా తలయెత్తింది. ఇంటర్మీడియటు విద్యార్థులు తెలుగు కాంపోజిషను ఏశైలిలో రచించాలనేది వివాద విషయమయింది. అప్పటి మద్రాసు విశ్వవిద్యాలయంవారు ఒక కాంపోజిషను కమిటీని ఏర్పరచి వారి సిఫార్సులను కోరారు. దానిలో గురజాడ అప్పారావు, గిడుగురామమూర్తి పంతులు, కొమర్రాజు లక్ష్మణరావుపంతులు, వేదం వెంకట్రాయ శాస్త్రిగారు మొదలగు హేమాహేమీలు సభ్యులుగా నియమితులయారు. ఈ కమిటీ సమాలోచనలు రెండుసంవత్సరాలు సాగాయి. వ్యూహ ప్రతివ్యూహాలు నడిచాయి-తమతమ వాదాలను సమర్థిస్తూ ఆనాటి సారస్వతీయులైన పెద్దలంతా రచనలు వెలువరించారు. వావిలికొలను సుబ్బారావుగారి 'ఆధునిక వచనరచనా విమర్శనము' 'గ్రామ్యా గ్రామ్య వివాదపీఠిక'; వేదంవెంకట్రాయశాస్త్రిగారి 'గ్రామ్యాదేశ నిరసనము', గిడుగు సీతాపతి గారి 'సొడ్డు', గిడుగురామమూర్తి పంతులుగారి Memorandum on Modern Telugu జయంతిరామయ్య పంతులవారి Defence of Litarary Telugu ఈ విధంగా వాదప్రతివాద గ్రంథాలుపుంఖానుపుంఖంగా ఆవిర్భవించాయి. వీటన్నిటికీ శిఖ రాయమానమైనది గురజాడ అప్పారావుగారి Minute of Dissent అను రచనము ఏమైనప్పటికీ మద్రాసు విశ్వవిద్యాలయంవారు "ఆధునిక వచనారీతి' అనేదాన్ని ఆమోదింప జాలరని 1915 సంవత్సరంలో తుదిపరిష్కారం ప్రకటించారు. విశ్వ విద్యాలయాన్ని బట్టి విద్యాశాఖాధికారులు పాఠశాలల్లో ఆధునిక భాషారచనకు కల్పించిన అనుమతిని ఉపసంహరించుకున్నారు. గ్రాంథిక భాషావాదము విజయానందంతో చెయ్యివిచింది. వ్యావహారికభాష తాత్కాలికంగా విద్యారంగం నుంచి వెలివేయబడింది. ఇంతలో గురజాడ అప్పారావుగారు దివంగతులయారు. రావుసాహేబు గిడుగురామ మూర్తి పంతులుగారొక్కరే అచంచల విశ్వాసంతో స్థిరసంకల్పంతో శేషజీవితమంతా వ్యావహారిక భాషా ప్రచారానికి అంకితం చేశారు.

రామమూర్తిగారు ఏకాకులుగా కనిపించినా వారి వాదము ఏకాకిగా ఉండలేదు. పూర్వ పండితులంతా దీనిని కాదన్నప్పటికీ యువలోకము వ్యవహార భాషను తమ సాహిత్య రచనలనే పూలపడవలలో ఎక్కించి కాలతరంగిణిలో వదలడం ఆరంభించారు గురజాడవారి 'ముత్యాలసరాలు' 'దేశమును ప్రేమించుమన్నా' 'లవణరాజుకల', 'పూర్ణమ్మకథ' వంటివి రాయప్రోలు సుబ్బారావుగారి 'తమ్ముడా' అనే గేయము వారికి

ఆదర్శం అయాయి. 1920 ప్రాంతంలో గాంధి మహాత్ముని జాతీయోద్యమ ప్రభావం చేత ఎన్నో మధుర కంఠాలు గళం విప్పుకున్నా. 'మాకొద్దీ తెల్ల దొరతనము' 'దండా లండోయిబాబు మేముండలేమండోయి' అనే గీతాలు, అల్లూరి సీతారామరాజు గారిని గూర్చిన వీరకరుణాత్మక గేయాలు; 'కొల్లాయి కట్టితేనేమీ మా గాంధి కోమట్లైపుట్టితే నేమి' వంటి బసవరాజు అప్పారావుగారి గీతాలు-ఇట్లా అసంఖ్యాకంగా గేయ రచనలు వాడుక భాషలో వాతావరణాన్ని పులకరింప చేశాయి. చిన్న చిన్న గేయాలే కాక విస్తృత ప్రణాళిక గల వచన గ్రంథాల్ని వ్యావహారిక భాషలోనడిపించవచ్చని ఉన్నవ లక్ష్మీ నారాయణ పంతులుగారు 'మాలపల్లి' అనే తమ గొప్పనవలలో నిరూపించారు. పండిత వర్గంలో విశాల దృక్పథం కలవారు కూడా ఆధునిక భాష, సాహిత్య పల్యం కికలో ఊరేగడం సమర్థించారు. పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు ఇట్టివారు. ఉన్న వర్గాలవారు వాడే వ్యవహారభాషనే కాక పామరజనులయాసతో కూడిన భాషను కూడ గేయాల్లో ఆదరించారు, నండూరి సుబ్బారావుగారు. వీరియెంకిపాటలు రసహృదయాల్ని బాగా ఆకట్టుకున్నాయి- "యెనక జలమంలోన, ఎవరమోనంటి-సిగ్గొచ్చినవ్వింది సిలక నాయెంకి". ప్రాచీనమై చర్విత చర్వణమై, నీరసమై పోయిన ప్రబంధ కవిత్వం మీద తిరుగుబాటుగా లేచింది భావకవిత్వము. స్వామి శివశంకరులు, దేవులపల్లి కృష్ణశాస్త్రి వంటివారు దేనికి వేగుచుక్కలయ్యారు, ఇక్కడ ఒక విచిత్రమైన సమన్వయం అప్ర యత్నంగానే రూపుదాల్చింది. పూర్వపు ఛందస్సులో పద్యాలు వ్రాసినప్పుడు సరళ గ్రాంథికశైలినీ, గేయాలు వ్రాసినప్పుడు గురజాడరీతిలో వ్యవహార భాషను వీరు సంతరించారు. విశ్వనాథ సత్యనారాయణ గారు, వేంగిక్షేత్రం వ్రాసినప్పుడు ప్రౌఢ సమాస జటిలమైన గ్రాంథికరీతిని, కిన్నెర సాని పాటలు వ్రాసినప్పుడు లలిత రమ ణీయమైన వ్యవహారపు పలుకుబడినీ చిందించారు. భావకవిత్వం మీద తిరుగుబాటుగా బయలుదేరిన అభ్యుదయ కవిత్వంలోనూ, ఈ నాడు శ్రీ దాశరథి, శ్రీ నారాయణరెడ్డి నాయకత్వం వహించే సమన్వయ కవితా రీతిలోను కూడా ఇదే వ్యవస్థ నడుస్తూంది, పద్యకవిత్వానికి సరళమో, ప్రౌఢమో అయిన గ్రాంథిక భాషయూ, గేయ ప్రసంగం వచ్చినప్పుడు మృదులవితమైన జీవద్భాషయూ వాడడం కవులలో ఒక అలేఖ్య సంప్ర దాయం అయింది. భవిష్యత్తులో కూడా ఇది ఇట్లాగే ఉండవచ్చుననిపిస్తుంది. అభ్యు దయ కవితా పితామహుడైన శ్రీశ్రీ కూడ కవితా వ్యవసాయం యొక్క పూర్వ రంగంలో పద్య ఛందస్సును ఆదరించి విప్లవ శంఖారావం పూరిస్తూ 'మహాప్రస్థానం' ఆలపించి నపుడు గేయాన్నీ, వ్యవహార భాషనూ చేపట్టాడు. ఇదియొక సత్సంప్రదా యంగా నిలిచిపోయే సూచనలున్నాయి.

494.813
LAK
Acc No. 6221



వచన రచన విషయంలో ఇప్పటికీ పూర్వ పద్ధతిని పాటించేవారు ఉత్తాలమైన సాహిత్య స్థానం కలవారూ లేకపోలేదు. విశ్వనాథ సత్యనారాయణ గారు, నోరి నరసింహశాస్త్రిగారు వంటి కొద్దిమంది నవలల్లోను వాచకాల్లోను సరళ గ్రాంథికాన్ని ఆదరిస్తూ ఉన్నారు. పూర్వతరం గొప్ప నాటక రచయితలందరూ ధర్మవరం కృష్ణమాచార్యులు, కందుకూరి వీరేశలింగం, పానుగంటి లక్ష్మీనరసింహరావు, తిరుపతి వేంకట కవులు, బలిజేపల్లి లక్ష్మీకాంతం మొదలైనవారు గ్రాంథిక భాషనే చేపట్టారు. తెలుగునకు నూతన ప్రక్రియలని చెప్పదగిన గేయము, నాటిక, ఏకాంకిక, కథానిక, గల్పిక, వచన కవిత్వం వంటి పెక్కు ప్రక్రియల్లో వ్యవహార భాషకే పట్టాభిషేకము. ఈ రీతులన్నీ 1930 ల నాటికి యువకులుగా ఉండిన సాహితీపరులు ఆచరణలోనికి తెచ్చినవే. యువతరం ఎప్పుడూ సంస్కారం పక్షాన విప్లవంవైపున ఉండడం సహజం. వయసు మళ్ళిన కొద్దీ వారే మళ్ళీ సమన్వయవాదులుగా పరిణతి చెందుతూంటారు. ఇది మానవ స్వభావ చక్రపరిభ్రమణంలో అభ్యస్తమైన విషయము. గత ఏబది అరువది సంవత్సరాల్లో వార్తాపత్రికలు నడపడం దేశంలో ప్రవేశించింది. వాటిల్లో మాస, పక్ష, వార, దినపత్రికలు క్రమంగా ప్రచారంలోకి వచ్చాయి. ఈరకం వ్యవసాయంలో కూడా వెనుకటి తరంలో సులభగ్రాంథికము, ఇటీవలి సంవత్సరాల్లో శిష్టవ్యవహారభాష చోటు చేసుకున్నాయి. సులభగ్రాంథికమనగా రేఫద్వయ నిర్బంధమూ, అర్ధానుస్వార యోగమూ ఉపేక్షించడము, క్లేశకరమైన సంధి విధానాన్ని విడిచిపెట్టి కొంతవరకూ విసంధి పాటించడము, దీర్ఘసంస్కృత సమాసాలు, శ్లేషయమకాద్యలంకారాల సందడిని పరిహరించడం, సులభార్థప్రతీతి గల పదజాలం ప్రయోగించడము, ఈ మొదలైన భాషా సంస్కారము. నామప్రత్యయాలు క్రియాంతాలు పూర్వభాషలో వలెనే ఉంటాయి. ఇటీవల సర్వస్వేచ్ఛా ప్రియులైన యువసాహిత్యకులు వీరవ్యవహార భాషకు మొగ్గుతున్నారు. ఏమైనా సాహిత్యం అన్నది దైనందిన వ్యవహారం కంటె కొంత ఉన్నతమై, ఉదాత్తమై, సభ్యమై ఉండక తీరదు. కానినాడది సాహిత్యం మానవుణ్ణి కేవల భౌతిక వాతావరణాన్నుంచి పైకి ఎత్తి భావములు ప్రక్షాళనచేసి, హృదయం పునీతం చేసి, మెత్తపరచి, సమదృష్టిని శిక్షించి అలౌకికత్వానికే, గ్రాహ్యమైన దివ్యత్వానికి అధిరోహింప చెయ్యడం అని అన్ని కాలాల్లోను అన్ని దేశాల్లోను విజ్ఞులు అయినవారు భావిస్తూ వచ్చారు. భాష దీనికి ప్రముఖ సాధనం. ఇతర కళలుసూ సంభావ్యములే. మానవ హృదయాన్ని మృదులీకరించి విస్ఫారితం చెయ్యడానికి తోడ్పడేది గ్రాంథిక శైలి అయినా ఒకటే; వ్యవహార భాష అయినా ఒకటే. ఏదైనప్పటికీ అత్యధిక సంఖ్యాకులైన జనావళికి ఉపగమ్యమై, ఆనందదాయకమై, తిరిగి వారు తమతమ ప్రతిభమేరకు సాహిత్య సృష్టిలో ప్రయోగించడానికి అనువైనదై ఉండాలి. ఇతిశివమ్.

# దేశ భాషలందు తెలుగు లెస్స

ప్రపంచ తెలుగు మహాసభలు

*1975 ఏప్రిల్ 12—18*

సప్పటికీ దివ్య చేతన అతనియందు తదన్యులందు కన్న ఇంతో అంతో అధికంగా ఉండనుట వాస్తవము. అట్టివాడు జగత్సత్యాన్ని తాను సందర్శింప గలిగినట్లు లోకం వారినాపాపనిందలకు లోగక ప్రవచించడం ముఖ్యధర్మం. ఆధర్మాన్ని నెరవేర్చక తన యందలి దివ్యచేతనను దమింపచేసుకొని, అణచిపెట్టుకొని లోకము మెప్పుదలనో లేక ధనాది లాభమునో కోరి లోకముయొక్క ప్రీతికై సత్యాన్ని అన్యథా ప్రకటించడం ఆత్మవంచన, పరవంచన కాక మరేమవుతుంది. 'హితంమనోహారి చ దుర్లభం వచః' అన్నట్లు, హితమైనది ప్రియమైనది అయిన వాక్యము దుర్లభము - లోకమునకు హిత మైనది, లోకంచెవికి ఇంపైనది ఒకటి కాకపోవచ్చును. అప్పుడు నిజమైన కవి కర్తవ్య మేమి. నలుగురూ ఏది మెచ్చుకుంటారో, దేనికి ప్రియపడతారో అట్టి మెరమెచ్చు అస త్యమునో అర్ధసత్యమునో చెప్పడమా లేక లోకముయొక్క క్షణిక ఆగ్రహమునకు వెరవక పూర్ణ సత్యాన్నే చెప్పడమా అనేది మహాకవి తనకు తాను నిర్ణయించుకోవలసిన పరమధర్మము. ఎపడు ప్రజాభ్యుదయము పేర, మూకజనానీకమునకు తాత్కాలికా మోదం కలిగించే భాషణం చేస్తాడో అతడు తనకున్నూ లోకానికిన్నీ అన్యాయమే చేస్తున్నాడు. కావ్యము ప్రజల కందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో కవిత్వ భాషను పలచబరచి. క్రిందికి దిగలాగి హీనవ్యవహార భాషాగతికి దింపే రచయిత లోకానికి మేలు చేస్తున్నాడనడానికి వీలులేదు. ఆధునికుల్లో కొందరు ఇటువంటి అపసిద్ధాంతాలకు గురి అవుతున్నారు. అసలు కావ్యప్రయోజనమేమిటి, పాఠకుణ్ణి భౌతిక శ్రేణినుండి సుకుమా రంగా రసశ్రేణికి ఆధ్యాత్మిక శ్రేణికి క్రమోన్నతంగా తీసుకొని పోవడమేకదా. ఇట్టి ఆరోహణయాత్రకు స్వచ్ఛమైన నిర్మలమైన భాష ఉత్తమసాధనము. అది గ్రామ్యదూషి తము కాకూడదు. అగ్రామ్యతా లక్షణ విలసితమైయుండాలి. ఇట్లా అనడంచేత మేము గ్రామ్యాగ్రామ్య చర్చలోనికి పాఠకుని దింపాలని భావించడంలేదు. ఇక్కడ గ్రామ్య మనగా అసభ్యమైనది, నింద్యమైనది, కటువైనది, అనియే మాతాత్పర్యము. అందుచేత ప్రజాహితము అనే ఆభాసకారణంతో సాహిత్య భాషను అసంస్కృత నిత్య వ్యవహారం లోకి దింపడం కూడా వాంఛనీయము కాదన్న మాట.

ఇంక ఉభయవాదులని మనము చెప్పుకొన్నవారు. వీరి ఉభయనిష్ఠత్వము ఎక్క డంటే ఆత్మ ధర్మాన్ని వీడకుండా పరహితైక దృష్టితో సత్యప్రవచనం చెయ్యడంలో ఉంటుంది. ఇక్కడ సత్యమనగా సాహిత్య సత్యము. వస్తుతత్వ దర్శనము. ఉభయ వాది కవులు ఇదివరలో మనము చెప్పుకొన్న సాత్త్విక శ్రేణికి చెందిన కవులు. తాము లోక హితంకోసమే కావ్యారంభ ప్రవృత్తులైనట్లు వీరు లీలగా సూచిస్తూఉంటారు.